గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# సెప్టెంబర్ 2016
# కథలు




బంజారాహిల్స్ లో నక్షత్ర టీవీ ఛానల్!

గేటు ముందు నుంచున్నాడో వ్యక్తి. బాగా లావుగా ఉన్నా అందంగా ఉన్నాడు. తేజస్సు, ప్రశాంతత ముఖంలో ద్యోతకమవుతోంది.

"మీ యజమానిని కలవాలి" సెక్యూరిటీ అతనితో సౌమ్యంగా అన్నాడు.

ఆ మాటల్లోని మార్దవానికి ముగ్ధుడైన అతను పరవశంతో గేటు తీసి, మరొకతన్ని తోడిచ్చి లోపలికి పంపించాడు.

ఇప్పటి కాలాన్ని రాజసంగా ఏలుతోంది ఛానల్ టీవీ. ఆర్థిక వనరులు అప్రతిహతంగా వచ్చి చేరుతున్నాయి. ఆ హంగూ, ఆర్భాటం సెక్యూరిటీ గేటు నుంచి లోపలి కెళ్లే దాకా అంగుళం అంగుళంలో కనిపిస్తూనే ఉంది. దాన్ని చూసి చిన్నగా

నవ్వుకున్నాడాయన.

లోపల అన్ని సౌకర్యాలూ అమరి ఉన్న ఆ గది లోకి ప్రవేశించాడు. ఇంద్రుడిలా ఆశీనుడై ఉన్న వ్యక్తిని చూసి "నా పేరు ఏక దంత మూర్తి. నెనొచ్చిన పని.." అంటూ కొద్ది నిముషాలు మాట్లాడి."..అంచేత వెంటనే నేను ప్రేక్షకులతో లైవ్ లో మాట్లాడే ఏర్పాటు చేయండి"అన్నాడు.

ఆయన కూడా ఆయన ఆకర్షణ శక్తికి లో బడిన వాడిలా ఏం అడ్డు చెప్ప లేక ఆఘ మేఘాల మీద అన్ని ఏర్పాట్లూ చేశాడు. చుట్టూ కెమేరాలు, లైట్లు.. మధ్యలో ఆసనం మీద ఏక దంత మూర్తి.

"ఓం శివ పార్వతాయ నమః. మీ అందరికీ నా శుభాశిస్సులు. మీతో నేను ముచ్చటించాలని ఇలా కార్యక్రమం రూపొందించుకుని వచ్చాను. మీ ప్రధాని మోడీ స్వచ్ఛ భారత్ అంటూ ఓ మంచి పనికి శ్రీకారం చుట్టాడు. పరిశుభ్రత అనేది అందరూ అవలంబించాలి. శుభ్రతలో ఆరోగ్యముంటుంది. మీ ఆరోగ్యమే నాకు ముఖ్యం. ఇన్నాళ్లు మీరు స్వర్గం అంటే సర్వ సుఖాలు, రంభా ఊర్వశులు అనుకుంటున్నారు. నిజానికి స్వర్గం అంటే పరిశుభ్రత, పచ్చదనం. స్వచ్ఛమైన గాలి, నీరు. మనిషి అనుభూతించడానికి ఆహ్లాదంగా ఉండే ప్రకృతి. మీ భూ లోకాన్ని నరకం చేసుకుంది వీటిని కలుషితం చేసుకునే కదా!

ఒకప్పుడు ఈ భూమండలం అందమైన కీకారణ్యాలతో, విశేషమైన జంతు జాలంతో, మంచి నీరు పారే నదులతో, సెలయేర్లతో, కాలానుగుణ ప్రకృతి మార్పులతో భూతలాన్ని సృష్టించిన మా దేవతలకే కన్నుకుట్టేలా ఉండేది. మేము అప్పుడప్పుడు ఆటవిడుపుగా వ్యాహ్యాళికి వచ్చే వాళ్లం కూడా. మరిప్పుడు ఉద్యాన వనాల మాట మేమెరుగు(దేవుడెరుగు), కనీసం పచ్చని చెట్లు లేవు. సరస్సుల మాట సరే, తాగడానికి గుక్కెడు మంచి నీళ్లు లేవు. ఎక్కడ చూస్తే అక్కడ మురికి. భూమిలో పాతుకుని మట్టిలో కలిసి పోని పాలిథీన్ కవర్లు. మీరు ముక్కులకి మూతులకి గుడ్డ కట్టుకుని తిరగడం. ఎక్కడ ఏ నీరు తాగితే, ఏ ఆహారం తింటే ఏం ప్రమాదమో? అని భయపడుతూ బతకడం. మీరు దాదాపు జీవచ్ఛవాలే. ఇంతకంటే నరకం ఉంటుందా? ఇదా మీరు సాధించిన అభివృద్ధి?

ఎప్పట్నుంచో మీరు నా ప్రతిమలు ప్లాస్టర్ ఆఫ్ పేరిస్ తో చెయ్యడం, హాని కలిగించే రంగులను ఉపయోగించడం, చెఱువుల్లో నిమజ్జనం చెయ్యడం త ద్వారా ఆ నీళ్లు కలుషితమయి పర్యావరణానికి చేటు కలిగించడం, అవి తాగిన చేపలు, పశు పక్ష్యాదులు మరణించడం తెలిసిందే!

ఆ రకంగా చేయడం ప్రమాద కరమని కొంత మంది పర్యావరణ ప్రేమికులు చెవునిల్లు కట్టుకుని చెబుతున్నా, మట్టి ప్రతిమలు అందిస్తున్నా, అనుకున్న మార్పు మీలో రావడం లేదు. అదే నాకు బాధ కలిగించింది. అరే! నన్నింతగా ప్రేమిస్తారే! అభిమానిస్తారే! సంవత్సరానికో సారి నన్ను పిలిచి నవ రాత్రులూ మీ విభవము కొద్దీ కుడుములూ, ఉండ్రాళ్లు, కజ్జికాయలు, లడ్డులూ మా

అమ్మలా బొజ్జ నిండా పెట్టి పూజలతో సంతుష్టి పరుస్తారు కదా! అంతే కాకుండా ఇంట్లో ఏ శుభ కార్యం జరిగినా మొదటి పూజ నాకే కదా! మరి మీ క్షేమం నేను కాంక్షించక పోతే మరెవరు కోరుకుంటారు? అందుకే ఇలా వచ్చాను." అని తన రూపాన్ని క్షణం పాటు వినాయకుడిగా మార్చుకుని టీవీల ద్వారా దర్శనం ఇచ్చి..మళ్లీ యధా రూపం ధరించి "నేను మీ కోసం కైలాసం వదిలి ఈ విషయం చెబుదామనే వచ్చాను. మీకు ఇప్పుడిప్పుడే పర్యావరణం పట్ల అవగాహన కలుగు తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య మంత్రుల ఆధ్వర్యంలో విశేషంగా మొక్కలు నాటుతున్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని నీళ్లు నిలవ చేసుకుంటున్నారు.

స్వార్థం విడిచి ఈ భూప్రపంచం మా అందరి నివాసం అన్న స్పృహతో జాగృతమవుతున్నారు. మీలో నా విగ్రహాలు, పూజల విషయాల్లో కూడా మార్పు రావాలి. మీరు పెట్టే విగ్రహం ఎత్తు ఎంతన్నది కాదు కావలసింది..చిన్న మట్టి ప్రతిమ అయినా మనో శుద్ధితో పూజిస్తే చాలు. పెద్ద పెద్ద మైకులతో పాటలు పెట్టక పోయినా, నా సమక్షంలో మంద్రంగా శ్లోకాలు, పద్యాలు చదివినా చాలు..మిమ్మల్ని అనుగ్రహిస్తాను. విఘ్న నివారణ చేస్తాను.

ఆర్భాటం, ఆడంబరం కాదు కావలసింది. పరిపూర్ణ భక్తి, నా మీద ధ్యాస. నా భక్తులు నిండు మనసుతో నా విన్నపాన్ని వింటారని, ఈ భూతలాన్ని స్వర్గతుల్యం చేసుకుంటారని ఆశిస్తున్నాను. మరిక వెళతాను."అని హడావుడిగా లేచి వెళ్లిపోయాడు. ఆయన వెళ్లిపోయాక ట్రాన్స్ లోనుంచి బయట కొచ్చినట్టుగా టీ వీ స్టాఫ్ ఆయన కోసం వెతికితే దొరక లేదు. టీ వీ లో వినాయకుడి లైవ్ చూసిన భక్తులు తమ జన్మ ధన్యమైందని పొంగి పోయారు. ఆయన తమకు చేసిన విన్నపాన్ని కచ్చితంగా పాటించాలని మానసికంగా సర్వసన్నద్ధులయ్యారు.

*****

అతి కొద్ది కాలం లోనే భూ మండలం స్వచ్ఛతతో, అడవులతో, పచ్చ దనంతో, జంతు జాలంతో, పక్షులతో, సెలయేళ్లతో స్వర్గ సమానమై పూర్వ స్థితి నొంది మానవులందరూ ఎటు వంటి రోగాలు, వ్యాధులు లేకుండా పూర్ణాయుర్ధులై వినాయకుడుకి హంగులూ, ఆర్భాటాలు, ఆడంబరాలు లేకుండా యధా శక్తి మనో శుద్ధితో పూజించ సాగారు.




సాయంత్రం రైలుకి మా ఊరెళ్ళాలని, ఆఫీసుకు ఆఫ్ డే శలవు పెట్టి, మధ్యాహ్నం హోటలు కెళ్ళి భోంచేసి రూమ్ కు వచ్చి కాసేపు కునుకు తీద్దామని మంచం మీద వాలాను. ఏదో అర్జంటు పని ఉంది రమ్మని, ఊరి నుంచి అమ్మ ఫోన్ చేసి చెప్పింది. ఏమిటో విషయం...బహుశా పెళ్ళి చూపుల గురించి కావచ్చు. చాలా రోజులనుంచి తప్పించుకుంటున్నానని అమ్మకు చాలా కోపంగా ఉంది. ఈ రోజు కూడా నేను వాళ్ళు చెప్పే పెళ్ళి చూపుల కోసం కాక, నా మనసులోని మాటను చెప్పటానికి వెళుతున్నాను.

అలా ఆలోచిస్తూ ఎప్పుడు నిద్రపోయానో...“పోస్ట్” అన్న కేకతో మత్తు వదిలింది. పరుగున వెళ్ళి తలుపు తీసాను. ఎప్పటినుండి అరుస్తున్నాడో ఏమో, కవర్ మొఖం మీద విసిరినట్టుగా పడేశాడు పోస్టుమాన్. హౌస్ ఓనర్ కూడా ఎక్కడికో వెళ్ళినట్టున్నారు. లేదంటే, వాళ్ళకే యిచ్చేవాడు అనుకొంటూ, క్రిందపడ్డ కవర్ తీసి చూసాను. లేత గులాబి రంగు కవర్. దానిపై ముత్యాల వంటి అక్షరాలతో నా అడ్రస్ వ్రాయబడి ఉంది. ఫ్రమ్ అడ్రస్ కోసం చూసాను, లేదు. ఎవరీ అజ్ఞాత వ్యక్తి అనుకుంటూ, సస్పెన్స్ భరించలేక కవర్ జాగ్రత్తగా తెరచి చూసాను.తెల్లటి కాగితం మడత పెట్టి ఉంది కాగితం తెరవగానే, దానిపై స్ప్రే చేసిన సెంటు పరిమళం ముక్కు పుటాలకు తాకింది. ఆ ఉత్తరంలోని అక్షరాల వెంబడి నా చూపులు పరిగెడుతున్నాయి...

“డియర్ మోహన్!

హౌఆర్యూ! అయామ్ ఫైన్. ఏంటీ, ఈ క్లోజ్ ఫ్రెండ్ ఎవరా అని ఆశ్చర్యపోతున్నావా? అవునులే, నేనసలు గుర్తుంటేగా, కాలేజిలో ఉన్నప్పుడే పలకరించినా, ముద్దపప్పులా ఉలుకూ పలుకూ లేకుండా ఉండేవాడివి. యిప్పుడయినా కొంచెం మారావా? లేక అంతేనా? ఏంటో, ఎన్ని చెప్పినా నీకు ఒకటే కదా!

ఏంటీ? సమయం, సందర్భం లేకుండా ఉత్తరం రాసానని ఆశ్చర్య పోతున్నావా? సందర్భం ఉంది కనుకనే వ్రాస్తున్నాను. నేను పెళ్ళి చేసుకోబోతున్నాను. ఈ నెల పదిహేనో తారీఖునే నా పెళ్ళి. మద్రాస్ రిజిష్ట్రార్ ఆఫీసులో. ఏంటీ, రిజిష్ట్రార్ ఆఫీసులో పెళ్ళేంటి అని ఆశ్చర్యపోతున్నావా? మరి, నేను చేసుకోబోయేది లవ్ మేరేజి. నన్ను చేసుకోబోయే బలిపశువెవరా అని జాలి పడుతున్నావా? సస్పెన్స్. నీకు డైరెక్టుగానే పరిచయం చేస్తాను.

నా మేరేజికి నిన్ను, నా రూమ్మేట్స్ ఇద్దరిని తప్ప ఎవరిని పిలవటం లేదు. ఎందుకో నిన్నే పిలవాలనిపించింది. ఎన్నాళ్ళ నుంచో వెతుకుతుంటే, అతి కష్టంమీద నీ అడ్రస్ దొరికింది. ఈ లేఖే నా పెండ్లి శుభలేఖ అనుకో. నీ కన్నా ఆత్మీయులు నాకెవరున్నారు మోహన్? తప్పక వస్తావు కదూ? రాక తప్పదులే! నువ్వు రాకపోతే, నాకు కోపంవస్తుంది. నాకు కోపం వస్తే ఏమౌతుందో తెలుసు కదా! అనవసరంగా ఆ అమాయకుడు (పెళ్ళికొడుకు) బలైపోతాడు.

నీ రాక కోసం ఎదురుచూస్తూ ఉంటాను...

“రమ్య”

ఉత్తరం చదవటం పూర్తయినా, నా చేతులు వణకటం తగ్గలేదు. ఒళ్ళంతా చెమటలు పట్టాయి. మెదడు మొద్దుబారిపోయింది. కొంతసేపటివరకూ మనసంతా శూన్యంగా అనిపించింది. రమ్యకి పెళ్ళా? అందులోనూ, లవ్ మేరేజా? నా మనసంతా గతం వైపుకు పరిగెడుతోంది.

******

నేను డిగ్రీ చదువుతున్న రోజులవి. రమ్య ఫస్టియర్ సగంలో కాలేజిలో జాయిన్ అయింది. వాళ్ళ నాన్నగారికి వైజాగ్ నుంచి మా ఊరికి ట్రాన్సఫర్ అవటంతో, ఆమె మా కాలేజిలో జాయిన్ అయింది. అతి కొద్ది కాలంలోనే అందరితో కలివిడిగా మసలుతూ మాకందరికీ బెస్ట్ ఫ్రెండ్ గా మారింది. తను చాలా ఫాస్ట్ గాళ్. చాలా సరదాగా, ఫ్రాంక్ గా మాట్లాడేది. ఎందుకో తెలియదు గాని,

నాతో మరింత చనువు ప్రదర్శించేది. కాని, నాకు మాత్రం ఆమెతో మాట్లాడాలంటే చాలా బిడియంగా ఉండేది. కాని, ఒక రకమైన అభిమానం ఆమెపై ఏర్పడింది. ఆమె నా దగ్గరకొచ్చి మాట్లాడుతున్నా, సూటిగా ఆమె కళ్ళలోకి చూడలేకపోయే వాడిని. ఏదో అధైర్యం, ఏదో బెరుకు, కాని ఎప్పుడూ ఆమె గురించే ఆలోచిస్తుండేవాడిని. అది యిష్టమో, అభిమానమో, స్నేహమో, మరేదో నాకు తెలిసేది కాదు.

నాకు చిన్నప్పట్నించి కో-కరిక్యులర్ ఏక్టివిటీస్ లో పాల్గొనే అలవాటు ఉంది. పాల్గొనే ప్రతి అంశం లోను ఏదో ఒక ప్రైజ్ వచ్చేది. ఇంటర్ లో కూడా కాంపిటీషన్స్ లో నాకు చాలా ప్రైజులు వచ్చేవి. ప్రైజు వచ్చినప్పుడల్లా, రమ్య నా దగ్గరకొచ్చి కంగ్రాట్స్ చెప్పేది. నాకు తిరిగి “థేంక్స్” అని చెప్పటానికి కూడా వణుకు, దడ. నా పరిస్థితిని చూసి, ఆమె మరింత ఏడిపించేది. “ఏంటీ! కంగ్రాట్స్ చెప్పినా కూడా, ఉలుకూ పలుకూ ఉండదు. నీ ప్రైజెస్ అన్నీ తీసేసుకుంటాననా? ఆ భయమేం అక్కర్లేదులే. కావాలంటే మరిన్ని నేనే కొనిపెడతాను”, అంటూనే, నా చేతిలో ఉన్న ప్రైజెస్ లాక్కునేది. జంకుతూనే, నేను “రమ్యగారూ! నా ప్రైజెస్ నాకు యిచ్చెయ్యండి”, అనే వాడిని. “గారూ, గీరూ అన్నావంటే, అసలివ్వను” అంటూ కోపంగా అనేది. నాకూ ఆమెను ప్రేమగా పిలవాలనే ఉండేది. క్లోజ్ గా మాట్లాడాలనే వుండేది.కాని, ఎందుకనో నేను పెరిగిన వాతావరణం నన్ను మాట్లాడకుండా చేసేది. రాన్రాను, రమ్యకు నాతో చనువు ఎక్కువౌతోంది. నాకు కూడా తను అంటే అభిమానం పెరుగుతోంది. ప్రేమంటే ఇదేనేమో? కాని, తనను ప్రేమిస్తున్నానని చెప్పే ధైర్యం లేదు.

రమ్య మీద నా అభిమానం మరింత పెరగటానికి దోహదం చేసిన, ఆ అద్భుతమైన సంఘటన, నాకు ఎప్పటికీ చెరగని గుర్తే. డిగ్రీ ఫైనలియర్ లో అందరమూ అరకులోయ టూర్ వెళ్ళాము. ఆ వాతావరణం ఆహ్లాదకరంగా ఉండి, నన్ను ఏవో ఊహా లోకాలలో విహరింపజేసేది. ఆ కొండవాలుల్లో, చెట్ల నీడల్లో ఎన్నో రంగుల కలలు కనేవాడిని. నా కలలన్నింటిలోనూ రమ్య రూపమే. ఆ రూపాన్ని శాశ్వతంగా నాదిగా చేసుకోవాలన్పించేది. కాని, ఆమె నా దగ్గరగా వస్తే, నోరువిప్పి ధైర్యంగా మాట్లాడే వాణ్ణి కాదు. ఆమె అరకులో నాతో మరింత సన్నిహితంగా మెలిగేది. ఒకసారి, లంచ్ పూర్తవగానే, అందరం చెట్లనీడన కూర్చున్నాం. రమ్య, వాళ్ళ ఫ్రెండ్స్ కొందరు కాలక్షేపం కోసం ఏదైనా చేద్దామన్నారు. కొందరు పాటలు పాడారు. కొందరు జోక్స్ చెప్పారు. పాటల పోటీలలో ఎప్పుడు పాల్గొన్నా ఫస్ట్ ప్రయిజ్ తెచ్చుకొనే నేను, ఆ రోజు ఫ్రెండ్స్ ఎంత బలవంత పెట్టినా పాడ లేక పోయాను.

రమ్య కొంటె చూపులతో, నా గుండె లయ తప్పుతోంది, గొంతు తడారి పోతోంది. నా ప్రక్కనే కూర్చొని, రమ్య చిలిపి పనులు చేస్తుంటె, ఏమీ అన లేక పోయే వాడిని. మా స్నేహితులు కొందరు మా ఇద్దరి సాన్నిహిత్యాన్ని చూసి, ఈర్ష్య పడటం మనసులో గర్వంగా అనిపించినా, భయంగా కూడా ఉండేది. కొంత సేపటి తరువాత, చీటీల ఆట మొదలెట్టేరు. చిన్న చిన్న కాగితాల మీద ఫన్నీ ప్రోగ్రామ్స్ వ్రాసి, అవి లక్కీ డిప్ లో వచ్చిన వారి చేత మిమిక్రీనో, డాన్సో, అభినయమో, చేయించే వారు. యింకో ముఖ్యమైన ఐటమ్ కూడా వుంది. అదేమిటంటే, ‘నేమ్ యువర్ బెస్ట్ ఫ్రెండ్”. అని, అది, రమ్యే సజెస్ట్ చేసిందని అందరికీ తెలుసు. ఆ చీటీ వచ్చిన వారు, తమ బెస్ట్ ఫ్రెండ్ ఎవరో చెప్పాలి. సాధారణంగా ఆడ వాళ్ళు, ఆడ వాళ్ళ పేర్లు, మొగ వాళ్ళు మొగ వాళ్ళ పేర్లు చెప్పే వారు. ఎవరైనా అవతలి వాళ్ళని ఇష్ట పడ్డ వాళ్ళు ఉన్నా, లేని పోని గొడవ ఎందుకని బయట పడే వారు కారు. ఒక వేళ తను మీ గర్ల్ ఫ్రెండ్ కదా, బాయ్ ఫ్రెండ్ కదా అంటే – అబ్బే జస్ట్ ‘ఎ ఫ్రెండ్ హు ఈజ్ ఎ గాళ్’ అంటూ తెలివిగా

తప్పించు కొనే వారు.

ఎలా మేనేజ్ చేసిందో తెలియదు కాని, ఒక సారి, ఆ చిటి రమ్యకు వచ్చింది. ఆమె అందరి ముందరా "మోహన్ ఈజ్ మై బెస్ట్ ఫ్రెండ్" ....అని నా దగ్గరకు వచ్చి, కూర్చుంది. అందరూ చూస్తూండగా, ఊహించని విధంగా, నా చేయి తన చేతి లోకి తీసుకొని ముద్దు పెట్టింది. అనుకోని ఈ సంఘటనకి నేను షాకయ్యాను. అందరూ మాకేసి ఆశ్చర్యంగాను, అసూయ గాను చూడటం కనిపించింది. ఒక్క సారిగా నాకు కోపం, భయం కలిగాయి. వెంటనే, రమ్య పిలుస్తున్నా వినకుండా, బస్సెక్కి కూచున్నాను. ఆమె వచ్చి, "ఐయామ్ సారీ మోహన్, నువ్వు ఇలా రియాక్ట్ అవుతావని అనుకో లేదు.అయినా, సందర్భం వచ్చింది కనుక చెప్పేస్తున్నాను. నువ్వంటే నాకు చాలా యిష్టం. నేను నిన్ను ప్రేమిస్తున్నానని తెలియ జేయ టానికే, అలా చేసాను. నేను తప్పు చేస్తే క్షమించు. కాని, నా మీద కోపం మాత్రం ఉంచుకోకు. నా ప్రేమను కాదనకు...ప్లీజ్" అంటూ బ్రతిమాలింది.

ఆమె కళ్ళల్లోంచి కన్నీళ్ళు నా చేతి మీద ధారగా పడుతున్నాయి. అయినా, నేను నోరు విప్ప లేదు. ఆమె ఆ ప్రయాణంలో నాతో మాట్లాడాలని చాలా సార్లు ప్రయత్నించినా నేను స్పందించ లేదు. అందరెదురుగా ఆమె చేసిన పనికి నాకు మొదట కోపం వచ్చినా, ఆమె యిచ్చిన అపురూపమైన కానుకను మనసులో పదిలంగా దాచుకున్నాను. నా మీద ఎంత ప్రేమ లేక పోతే, అంత మందిలో అలా ప్రకటిస్తుంది? టూర్ నుంచి యింటికి వెళ్ళి పోయిన తరువాత కూడా, ఆ దృశ్యమే నా కళ్ళ ముందు మెదిలేది.

అదృష్టవశాత్తు, పరీక్షలు దగ్గర కావటంతో, మాకు ప్రిపరేషన్ హాలిడేస్ ఇవ్వడం వల్ల, మా పేర్లు మాత్రం కాలేజ గోడల మీదకు ఎక్క లేదు. పరీక్షలలో కూడా ప్రతి రోజూ రమ్య పలకరించేది. ఆమె మాట్లాడుతుంటే, సరిగా సమాధానం చెప్పక పోతే, " ఏం! ఆ రోజు కోపం యింకా పోలేదా?" అని అడిగేది. అబ్బే, అదేం కాదు, అని నేను నవ్వుతూ సమాధానమిస్తే, "అయితే, మరో సారి ఇవ్వనా?" అంటూ కవ్వించేది.

పరీక్షలు అయి పోయాయి. ఆఖరి రోజు. ఫ్రెండ్స్ అందరూ ఆటోగ్రాఫ్ లు తీసుకుంటున్నారు. ఆడ పిల్లలు కూడా కొందరు నా ఆటో గ్రాఫ్ తీసుకున్నారు. రమ్య మాత్రం తీసుకో లేదు, నాకు ఇవ్వ లేదు. "ఆటో గ్రాఫ్ తీసుకుంటే, అంతటి తోనే దూరమై పోతావు. నువ్వెప్పుడూ, నా మనసులో స్థిరంగా ఉండాలి" అని అంది. అలా అంటూంటే, ఆమె కళ్ళల్లో నీళ్ళు. నాకూ ఆ క్షణంలో ఆమెతో నా మనసు విప్పి చెప్పుకోవాలనిపించింది. కాని, ఎంత ప్రయత్నించినా ధైర్యంగా, ఆమెతో, "నిన్ను ప్రేమిస్తున్నాను" అని అన లేక పోయాను.

పరీక్షలు తరువాతి శలవులలో ఒక సారి తను మా యింటికి వచ్చింది. నేను లేక పోవటంతో, మా చెల్లెలితో స్నేహం కలిపి, వాళ్ళ నాన్న గారికి చెన్నయ్ ట్రాన్సఫర్ అయిందని, నాకు ఇమ్మని అడ్రస్ ఇచ్చి వెళ్ళి పోయింది. ఆ తరువాత మళ్ళీ రమ్యను కలవ లేదు. జీవితంలో స్థిర పడిన తరువాత, ఆమెనే పెళ్ళి చేసు కోవాలని నా మనసులో స్థిర నిర్ణయం తీసుకున్నాను. కాని, ఆ విషయం

రమ్యకు కూడా తెలియ పర్చ లేదు. తరువాత నేను, ఎం.సి.ఏ. చదువు కోసం, హైదరాబాదు వచ్చెయ్యటం, జాబ్ కూడా ఇక్కడే రావటం జరిగింది.

మళ్ళీ యిన్నాళ్ళకి, యిన్నేళ్ళకి రమ్య నుంచి ఉత్తరం. అదీ ప్రేమ పెళ్ళి వార్తతో. నాకు ఎంత ప్రయత్నించినా కళ్ళలో నీళ్ళు ఆగటం లేదు. మనసులో ముల్లు పెట్టి గుచ్చినట్లుంది. యింట్లో వాళ్ళు ఎన్ని సంబంధాలు తీసుకువచ్చినా కాదన్నాను. నా మనసులో రమ్య స్థానం వేరెవరికీ ఇవ్వ లేను. ఈ విషయం చూచాయగా చెల్లాయికి చెప్పాను. అదే, అమ్మా నాన్నలతో కూడా చెప్పి, రమ్యను కాంటాక్టు చేద్దామనుకునేంతలో ఈ ఉత్తరం. అప్పుడు, తను నన్ను ప్రేమిస్తున్నానని చెప్పినా, అవుననే ధైర్యం అప్పట్లో నాకు లేదు. నాకు ధైర్యం వచ్చి చెపుదామనుకొనే టైముకు ఆ అవకాశం లేదు. నా అంత దురదృష్టవంతులెవరూ ఈ ప్రపంచంలో ఉండరేమో అనిపించింది. గతంలోని నా పిరికి తనం మీద నాకు ఇప్పుడు అసహ్యం వేస్తోంది.

సరే...తల రాత ఇలా ఉంది...అయినా, రమ్య అదృష్టవంతురాలు...ఆమె ప్రేమను అర్ధం చేసుకో గలిగే వేరొక వ్యక్తిని పొంద గలిగింది. నా లాంటి పిరికి వాడు ప్రేమకు పనికి రాడు...అనుకుంటూ మంచం మీద వాలి, కళ్ళు మూసుకున్నాను. ఏ విషయం అమ్మ, నాన్నలకు చెప్పి, అనుమతి తీసుకోవడానికి ఊరు వెళదామనుకున్నానో, అందుకు అవకాశం ఇంక లేదు కదా...అని, సాయంత్రం రైలు ప్రయాణం కేన్సిల్ చేసుకొని, రమ్య చెప్పిన పెళ్ళి రోజుకు శలవు పెట్టాను..ఎలాగైనా చెన్నయ్ వెళ్ళాలి..తనను మనస్పూర్తిగా అభినందనలు అంద జేయాలి... ఒక మంచి స్నేహితునిగా నైనా తన దృష్టిలో నిలిచి పోవాలి...అని నా మనసును తేలిక పరుచుకోడానికి ప్రయత్నించాను.

* * *

అది చెన్నయ్ లో నుంగంబాక్కం ఏరియాలో ఉన్న రిజిస్ట్రార్ ఆఫీసు. టైము పదకొండు అవుతోంది. ఆఫీసు స్టాఫ్ కూడా అందరూ ఇంకా వచ్చినట్లు లేదు. "నన్ను ఇదే టైముకు రమ్మని, రమ్య ఇంకా రాలేదేంటి"?.. మరో అర గంట వెయిట్ చేసి, అందరూ నన్నే చూస్తూండటంతో బయటకు వచ్చి, కారిడార్ లోనుంచున్నాను. మరో ఐదు నిమిషాలు గడిచాయి. అప్పుడు చూసాను, ఎదురుగా ఉన్న చెట్టు కింద, ఎవరో ఒక అమ్మాయి ఆటో దిగి ఎదురుగా వస్తోంది. రమ్య కాదు కదా...అనుకొంటూ చూసాను.

అనుమానం లేదు...రమ్యే...గాలికి అల్లల్లాడుతున్న నీలాల కురులు, నెమలి కంఠం రంగు కాటన్ చీరలో....హుందాగా, హంసలా నడుస్తూ... నా కలల రాణి రమ్య... ఐదేళ్ళ తరువాత తనలో ఎంతో మార్పు...అందం ద్విగుణీకృతమైంది.. కాని, ఆ అమాయకత్వం, కొంటె తనం కలబోసిన ముఖం తాను ఎన్నటికీ మరవ లేడు,,.ఇంతటి సౌందర్య రాశిని పొంద లేక పోవడం నా దురదృష్టం... ఛీఛీ ఏమిటిలా ఆలోచిస్తున్నాను? తన పెళ్ళికని వచ్చి, ఈ చంచలమైన ప్రవృత్తి ఏమిటీ? అంటూ నన్ను నేనే నిందించుకుంటూ, నవ్వుతూ, రమ్యకు ఎదురు వెళ్ళాను. నన్ను పోల్చుకున్న రమ్య కళ్ళల్లో మెరుపు, ముఖంలో సిగ్గు, అంతలోనే

ఆశ్చర్యం. ఊహించని అతిథి ఎదురుగా ఉన్నట్లు. ఇద్దరి కళ్ళల్లోనూ నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి. కాని, బయట పడటం ఎవరికీ ఇష్టం లేదు.

చివరికి, నేనే ధైర్యం చేసి, నోరు విప్పాను, "రమ్యా! ఎలా వున్నావు?" అని. ఎప్పటి లాగే చిలిపిగా నవ్వుతూ "ఇల్లా ఉన్నాను... ఏం? బాగోలేనా?" అంది. "నో..నో...యు ఆర్ ఆబ్సల్యూట్లీ ఫైన్" అన్నాను, ఏమి సమాధానం చెప్పాలో తెలియక. "సరే...సరదాగా అలా బెంచి మీద కూర్చుని మాట్లాడుకుందామా?" అంది రమ్య. 'ఓకే..కాని, మీ వుడ్ బి ఏరీ?" అన్నాను.అలా అంటుంటే, నా గుండెల్లో బాధ నాకు తెలుస్తోంది. "వుడ్ బీనా? ఇక్కడే ఉన్నారు కదా"...అంది, రమ్య. ఇక్కడా? ఎక్కడ? చుట్టూ చూసాను."అయ్యో మొద్దూ, ఆయన్ని, నా ఎదురుగా పెట్టుకుని, ఎక్కడ వెతుకుతున్నావు?" అంది. "నీ ఎదురు గానా? ఎవరూ?..." విషయం అర్ధం కావటానికి కొంచెం సమయం పట్టింది. అర్ధమయ్యేటప్పటికి, నా మనసు రాగ రంజితమైంది.

"నిజంగా...నువ్వు చెప్పేది...?" అంటుంటే, అవును, అంటూ చూపులతోనే చెపుతున్న రమ్య కొంటె కళ్ళల్లో సిగ్గు దొంతరలు. నా మనసులోని బింకాన్ని, భయాన్ని పటాపంచలు చేస్తూ, "థాంక్యూ రమ్యా...ఈ జన్మకు లేదనుకున్న అదృష్టాన్ని నాకు కలిగించావు...ఐ లవ్యూ వెరీ మచ్...ఈ విషయం నీకు చెబుదామనుకునేంత లోనే...నీ నుంచి ఉత్తరం...దొంగా, నన్ను ఇక్కడ కూడా ఫూల్ ని చేసావు కదూ..." అంటూ తనని నా దగ్గరకు తీసుకున్నాను... గుండెల్లో గువ్వ పిట్టలా ఒదిగి పోయిన రమ్య కళ్ళల్లోంచి వెచ్చని కన్నీళ్ళు... అమృత ధారల్లా కురుస్తున్నయి... దగ్గరలో ఉన్న గుడి లోంచి గంటలు మోగాయి...శుభ సూచకంగా...వెడ్డింగ్ బెల్స్ అనిపించేట్లు.



వినాయక చవితి పండుగ రోజున భూలోక విహారానికి బయల్దేరాడు వినాయకుడు. మొట్టమొదట ఒక నగరంలో ప్రవేశించాడు వినాయకుడు. వాహనాలు వదులుతున్న పొగ ఎక్కువై వాయు కాలుష్యంతో గాలి పీల్చడం కష్టమై ఉక్కిరి బిక్కిరయ్యారు మూషిక, వినాయకులు.

“స్వామి… నాకు ఊపిరి ఆడడం లేదు. ఈ నగరంలో ప్రజలు ఎలా బ్రతుకుతున్నారో అని సందేహం కలుగుతోంది. ఇక్కడే రోజంతా గడిపితే మన లోకం వెళ్లలేము” అంది మూషికం.

“నా పరిస్థితీ అలాగే ఉంది. వెంటనే ముఖానికి తొడుగులు ధరించకపోతే ప్రమాదం తప్పదు” అని రెండు తొడుగులు సృష్టించి ఒకటి ధరించడమే కాకుండా మూషికానికీ ఇచ్చాడు వినాయకుడు.

“హమ్మయ్య… ఇప్పుడు కొంత నయం” ముఖానికి తొడుగు ధరించి అంది ఎలుక. ఆ ఉత్సాహంలో దగ్గరలోని ఇంటికి చేర్చింది వినాయకుడిని.

ఆ ఇల్లు భాగ్యవంతుడు బంగారయ్యది. బంగారు వినాయకుడి ప్రతిమకు పూజలు చేస్తున్నాడు బంగారయ్య. బంగారు పళ్ళెం నిండా ఉండ్రాళ్ళు, పాయసం, వడపప్పులు, పండ్లూ, పాలు దండిగా అమర్చి కుటుంబమంతా కూర్చుని పూజలు చేసారు. “దేవా… ఈ సంవత్సరం కూడా వ్యాపారంలో ఎక్కువ లాభాలు ప్రసాదించు. ఏడాది తిరిగేలోపు నా ఆస్తి రెట్టింపు చెయ్యి” అని మొక్కాడు బంగారయ్య. బంగారయ్య ఇంట్లో ఏమీ తినకుండానే బయటపడ్డాడు వినాయకుడు.

సుగంధపు వాసనలు వచ్చిన ఇంటికి దారి తీసాడు మూషికుడు. కమలయ్య అనే ఉద్యోగి ఇల్లు అది. వెండి వినాయకుడిని పూజిస్తున్నారు కమలయ్య కుటుంబ సభ్యులు. పూజ పూర్తి చేసి “స్వామీ…ఇప్పుడు జీతం మాత్రమే వస్తోంది. ఖర్చులు పెరిగాయి. అదనపు రాబడి కూడా వచ్చేలా దీవించు” అని మొక్కాడు కమలయ్య. కమలయ్య ఇంట్లో ఏమీ తినకుండానే మరో ఇంటికి వెళ్ళాడు వినాయకుడు.

ఈసారి శ్రేష్టమైన నెయ్యిలో చేసిన ఉండ్రాళ్ళ వాసన ముక్కుకి సోకగా ఆ ఇంటికి వెళ్ళాడు వినాయకుడు. సూరయ్య అనే పూజారి ఇల్లు అది. ఇత్తడి వినాయకుడి విగ్రహానికి పూజలు చేసారు సూరయ్య దంపతులు. “మా పిల్లలకి చదువు మీద శ్రద్ధ లేదు. నువ్వే వాళ్ళని ఎలాగోలా ప్రయోజకుల్ని చెయ్యి. మా అమ్మాయికి గొప్ప ఇంటి సంబంధం అయ్యేలా దీవించు”

అని మొక్కాడు సూరయ్య. సూరయ్య ఇంట్లో ఏమీ తినకుండానే బయట పడ్డారు మూషిక, వినాయకులు.

అప్పటి వరకు ఏమీ తినకపోవడం వల్ల మూషికానికి కడుపు కాలుతోంది. "స్వామీ .. ఏమీ తినకపోవడం వల్ల శక్తి చాలక మోయలేక పోతున్నాను" అంది మూషికం. "కాసేపు ఓపిక పట్టు" అన్నాడు వినాయకుడు నవ్వుతూ.

అలా చాలా పూజలు చూసిన వినాయకుడుకి తృప్తి కలగక నగరం నుండి పట్టణానికి బయల్దేరాడు వినాయకుడు. అక్కడ కూడా అంతే. శక్తి మేరకు పూజలు జరిపించి పెద్ద పెద్ద కోరికలు కోరే భక్తులతో విసుగు వచ్చింది వినాయకుడికి.

ఈ సారి పల్లెకు వెళ్ళాడు వినాయకుడు. ప్రశాంత వాతావరణంలో ఉన్న ఆ పూరు నచ్చింది. ఎత్తైన చెట్ల మధ్య ఒక పూరిల్లు కనబడితే అక్కడకు వెళ్ళారు. మట్టి వినాయకుడి బొమ్మకు పూజలు చేస్తున్నాడు ఒక రైతు. చెట్లకు కాసిన సీతాఫలాలు, అరటి పండ్లు, పొలంలో పండిన చెరకు గడలు నైవేద్యం పెట్టాడు రైతు. దొడ్లో పూసిన పూలుతో పూజించారు రైతు దంపతులు.

"దేవుడిని ఏమి కోరారు?" అని అడిగింది రైతు భార్య.

"మన అవసరాలు దేవుడికి తెలుసు. వేరుగా ఎందుకు కోరాలి?" అని అడిగాడు రైతు.

"అడగందే అమ్మయినా పెట్టదు. మీకేం కావాలో మీరే అడగాలి" అని భర్తను ప్రోత్సహించింది రైతు భార్య.

"'శ్రమ పడేందుకు తగిన శక్తి ప్రసాదించు! కష్టానికి తగిన ప్రతిఫలం ఇవ్వు" అని కోరాడు రైతు.

"అదేమి కోరిక? మీ కోసం ఏదైనా అడగండి" అంది రైతు భార్య.

"సమయానికి వర్షాలు కురిపిస్తే చాలు. నా పొలంలో పండిన పంటలు ప్రజలకు ఆహారంగా అందితే అదే పదివేలు. అందరికీ ఆరోగ్యం ప్రసాదించు" అని ఈసారి కోరాడు రైతు.

రైతు భార్య తల పట్టుకుంది. "తనకేం కావాలో కోరడం కూడా తెలియని ఈయనను నువ్వే కాపాడు" అంది రైతు భార్య.
"తథాస్తు" అన్నాడు వినాయకుడు.

"ఖరీదైన విగ్రహమూ పెట్టలేదు. మిగతా వాళ్ళలా మంచి ఫలహారమూ పెట్టలేదు. అయినా రైతుని దీవించారు. అలా చేసారేం స్వామీ?" అని అడిగింది మూషికం.

"కపటం లేని మనసుతో పొరుగు వారి క్షేమం కోసం ప్రార్థించాడు రైతు. అలాంటి వారు కొందరైనా లోకంలో ఉండాలి. అందుకే దీవించాను" అన్నాడు వినాయకుడు.

రైతు పెట్టిన ఫలహారాలు తృప్తిగా ఆరగించి మరో ఇంటికి బయల్దేరాడు వినాయకుడు. కడుపు నిండా ఫలహారం తిని ఉత్సాహంగా వినాయకుడిని మోసాడు మూషికుడు.



విజయ్ గాడు అంతగా నవ్వడం నేనెప్పుడూ చూడలేదు.

చిన్న చెరువు తూము, చప్టామీద పడి దొర్లుతూ నవ్వుతూనే ఉన్నాడు.

ఆ నవ్వుకు కారణం ఉంది.

ఇది చెప్పడానికి ముందు మాగురించి కొంత చెప్పాలి. మా జట్టులో నలుగురం మిత్రులం ఉన్నాం. సీనియర్ విజయ్ గాడే. అంటే పదో తరగతిలో రెండు సార్లు, ఇంటర్ మరో రెండు సార్లు డుంకీలు కొట్టినవాడు. నేను పదో తరగతి ఒకసారి, ఇంటర్‌లో ఒకసారి బోల్తా కొట్టాను. మిగిలిన ఇద్దరిలో ఒకడు కోటేశ్వరరావు. మరొకడు రాంబాబు. కోటేశ్వరరావుకు చిన్నప్పటి నుంచి చదువు అబ్బలేదు. ఇక రాంబాబు అందరికన్నా ఎక్కువ చదువుకున్నవాడు. డిగ్రీ ఐదో సంవత్సరం.

మా ఊరి పేరు చిన్న రేజేరు. చిన్నూరు అంటారు. పెద్ద రేజేరు అదే పెద్దూరు గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోనూ, పార్వతీపురం టౌన్‌కు పది కిలోమీటర్ల దూరంలోనూ ఉంది. చిన్నూరు- పెద్దూరుకు మధ్య మంచి నీటి చెరువు ఉంది. చెరువు గట్టుపై, రావిచెట్టు కింద తూము చప్టాపైనే మా మకాం. దాదపు రోజంతా అక్కడే ఉంటాం. చిన్నూరు నుంచి పెద్దూరుకు వెళ్లాలన్నా, పార్వతీపురం బస్సు ఎక్కాలన్నా ఈ చెరువు గట్టుపై నుంచే వెళ్లాలి. వచ్చి పోయే జనాలతో కబుర్లు, చెరువులో చేపలతోనూ, మంచినీటికి వచ్చే పాపలతోనూ పొద్దంతా కాలక్షేపం.

మా బ్యాచ్ అంటే ఊళ్లో జనాలకు హడల్. మా లీడర్ విజయ్ అని చెప్పాను. ఎవడి పేరు చెబితే జనాలు చెవులు, కళ్లు, ఇంటి తలుపులు మూసుకుంటారో వాడే విజయ్ . అంత అల్లరి చేస్తుంటాడు.

ముచ్చటగా మూడు వీధులతో అందమైన ఊరు మాది. ఏ చిన్న వస్తువు కావాలన్నా పార్వతీపురం వెళ్లాల్సిందే. అందుకే మా ఊర్లోవాళ్లందరికీ పార్వతీపురంలోనే పొద్దు పొడుస్తుంది. అపవిడప్పుడూ పెద్దూరు వ్యాపారస్తులు తోపుడు బండ్లపై సరుకులు తెచ్చి చిన్నూరులో అమ్ముతూంటారు.

ఆ రోజు గాజుల నరసయ్య ఆయాస పడుతూ తోపుడు బండిని అతి కష్టం మీద చెరువు గట్టుపైకి తోసుకు వచ్చాడు. బాన పొట్టతో, నెక్కరుపై నల్లగా పొట్టిగా ఉంటాడు. రంగు రంగుల గాజులతో అందంగా అలంకరించుకుని తీర్థానికి బయల్దేరిన అమ్మాయిలా ఉంది బండి. తూపు చప్టాపై రాంబాబుగాడి ఒడిలో తల పెట్టుకుని శేషశయ్యపై మహా విష్ణువులా పడుకుని సినిమా కబుర్లు చెబుతున్నాడు విజయ్ . మరో పనేం -లేకపోవడంతో పాత చింతకాయ పచ్చడి అయినా ఆ గీతామృతాన్నే గ్రోలుతున్నాం.

గాజుల నరసయ్యను చూడగానే విజయ్ కు ఎక్కడలేని హుషారు వచ్చింది - ఏం మావా మీ అమ్మాయి పెద్ద మనిషి అయిందటగదా అని అరిచాడు.

మేమంతా పెద్దగా నవ్వేశాం.

నరసయ్య ముఖం మాడిపోయింది - మీ నాన్న చచ్చినా నీకు బుద్ధి రాలేదురా.. ఏంత మంచివాడు! కడుపున చెడబుట్టావ్. ముసల్దాని కష్టంతో షికార్లు చేస్తున్నావ్. సిగ్గులేని జన్మ.. చక్కగా కాలేజికి వెళ్లి చదువుకోక ఈ చెరువుగట్లంట.. ఈ యెదవలతో ఏంట్రా దరిద్రం.. అంటూ ముక్క చివాట్లు పెట్టాడు.

మేం నవ్వుతూనే ఉన్నాం. ఇటువంటివి మాకు మామూలే. ఇలాంటి తిట్లు తినకపోతే మాకు రోజు గడిచినట్టు ఉండదు. నరసయ్య ఉడుకెత్తి పోవడం విజయ్ కు మరింత హుషారెత్తించింది - వరసగదా అందుకే అడిగాను మావా! అన్నాడు.

ఛీ.. సిగ్గులేదు. బేవార్స్ యెదవలు అంటూ గట్టిగానే తిట్టాడు. నరసయ్య తోపుడు బండిని చెరువు గట్టుపై అమ్మవారి విగ్రహం ఎదుట పెట్టాడు. చెరువుగట్టు వాలులోకి బండి జారిపోకుండా అతి కష్టం మీద చిన్న రాయి వెతికి చక్రం కింద సపోర్టుగా పెట్టాడు. రెండు రకాల గాజులు తీసి బిజినెస్ బాగా సాగాలని గట్టు మీద అమ్మవారికి సమర్పించడానికి వెళ్లాడు.

బండి మాకు ఎదురుగా సరిగ్గా పదిహేను అడుగుల దూరంలో ఉంది. విజయ్ ముఖం వింత కాంతితో మెరిసింది - రెండు రాళ్లు అందుకోండిరా అన్నాడు చేయిసాచి.

చేతికందిన రెండు రాళ్లు తీసి వాడికిచ్చాం. లేచి కూర్చుని పొజిషన్ తీసుకుని గాజుల బండిపైకి విసిరాడు. మొదటిరాయి గురి త

ప్పింది. రెండో రాయి సరిగ్గా గాజుల బండి చక్రం కింద నరసయ్య పెట్టిన చిన్న సపోర్ట్ రాయికి బలంగా తగిలింది. అంతే.. బండి దడ దడమని చెరువు గట్టు నుంచి కిందికి దొర్లి కాలువలో పడింది. బండి పూర్తిగా విరిగిపోయింది. గాజులు కాలవలోనూ, పంట పొలాల్లోనూ చెల్లా చెదురుగా పడిపోయాయి.

నా బండి... నా బండి అంటూ గుండెలు బాదుకుంటూ బండి వెనుక పరిగెత్తాడు నరసయ్య. బాన పొట్ట వేసుకుని పరుగులు తీస్తూంటే మాకు నవ్వాగలేదు. నరసయ్య తిట్లు, శాపనార్థాలు మాకు వినిపించడం లేదు. ఇక విజయ్ గాడి సంగతి చెప్పనవసరం లేదు. కడుపు పట్టుకుని, కళ్లవెంట వస్తున్న నీళ్లను తుడుచుకుంటూ ఒకటే నవ్వు. ఆ రోజంతా ఆ సంఘటన గురించి చెప్పుకుంటూ నవ్వుతూనే ఉన్నాడు.

విజయ్ గాడు అంతగా నవ్వడం నేనెప్పుడూ చూడలేదు.

00000

0000 0000

రాత్రి ఎనిమిది దాటుతోంది. దశమి రాత్రి కావడంతో వెన్నెల విరగకాస్తోంది. చెరువు గట్టు, చుట్టూ పంట పొలాలు కనువిందు చేస్తున్నాయి. చిన్నూరు లోని సుబ్బారావు బెల్ట్ షాపులో బీర్లు తెచ్చుకుని నెమ్మదిగా సిప్ చేస్తున్నాం. మత్తుతోబాటు మాటలు పెరుగుతున్నాయి.

ఏం దరిద్రపు ఊరురా బాబూ..! ఒక సినిమా లేదు. ఒక షికారు లేదు. బీరు కొట్టిన తర్వాత సినిమా చూస్తే ఆ థ్రిల్లే వేరు. అందుకే సాయంత్రమే పార్వతీపురం వెళదాంరా అన్నాను.. నిష్ఠూరంగా అన్నాడు కోటి.

వెంటనే బీర్ బాటిల్ పట్టుకుని స్టయిల్‌గా లేచి నిలుచున్నాడు విజయ్ - ఏం నీకిప్పుడు సినిమా చూడాలని ఉందా? అని అడిగాడు.

ఏం చూపిస్తావా? పార్వతీపురం వెళ్లాలి. బస్సు లేదు. ఆటో లేదు. నీకూ నాకూ బండి లేదు. ఏం బతుకుల్రా మావా.. అంటూ ఏడుపు మొదలుపెట్టాడు కోటి.

నీ కెందుకు? ఐదు.. ఐదంటే ఐదు నిముషాల్లో అరేంజ్ చేస్తాను... ఒకేనా? అన్నాడు. సెల్ ఫోన్ తీసి 108 అంబులెన్స్

కు ఫోన్ చేశాడు - నా పేరు విజయ్ . చిన్నూరు నించి మాట్లాడుతున్నాను. మా వాడికి అపెండిసైటిస్ నొప్పి .. అర్జంట్ అని చెప్పాడు.

మిగిలిన ముగ్గురం తెల్లబోయాం. తర్వాత చెప్పాడు విజయ్ . కోటిగాడు కడుపు నొప్పి నటిస్తాడు. ఆస్ప త్రిలో పది నిముషాలు పడుకుని లేచి సినిమాకు వెళ్లిపోతారు. అదీ ప్లాన్!

108 ఇలా కూడా ఉపయోగపడుతుందని నేను కలలో కూడా ఊహించలేదు.

పది నిముషాల్లో అంబులెన్స్ వచ్చింది - వెంట ఒకరు చాలు అన్నాడు అంబులెన్స్ టెక్నిషియన్. కానీ మిగిలిన ఇద్దరు కూడా రావాలని కోటి పట్టుబట్టాడు.

టెక్నిషియన్ కు అనుమానం వచ్చింది -సర్ నిజంగా అపెండిసైటిస్ నొప్పి అయితేనే రండి. పెద్దూరులో ఒక హార్ట్ పేషెంట్ పరిస్థితి సీరియస్‌గా ఉందట! అన్నాడు.

అయితే..? మాది సీరియస్ కాదా.. మేం అబద్ధమాడుతున్నామా? తగువుకు దిగాడు విజయ్. మరో మాట మాట్లాడకుండా టెక్నిషియన్, డ్రైవర్ అంబులెన్స్ ఎక్కేసారు. మరో పదిహేను నిముషాల్లో పార్వతీపురం ఆస్పత్రి ముందు ఆగింది అంబులెన్స్. ఆస్పత్రి లోపలి నుంచి ఇద్దరు నర్సులు పరిగెత్తుకుంటూ వచ్చారు.

కోటి అంబులెన్స్ దిగుతూ -నొప్పి కొద్దిగా తగ్గింది మావా అన్నాడు.

టెక్నిషియన్ నిలదీసాడు -సర్... సినిమాకే కదూ. అంబులెన్స్ ను ఇలా వాడుకోవడం తప్పు కదా? అన్నాడు.

కోపంతో విజయ్ ముఖం ఎర్రబడింది -ఏంట్రా తప్పొప్పులు మాకే చెబుతున్నావా? అన్నాడు కోపాన్ని కంట్రోల్ చేసుకోడానికి ప్రయత్నిస్తూ.

కాదాసార్ చదువుకున్న మీరే.. అంటూ టెక్నిషియన్ ఏదో చెప్పబోయాడు. గట్టిగా ఈడ్చి కొట్టాడు విజయ్. ఆ దెబ్బకు నిశబ్ద నిశీధిలో ఆస్పత్రి గోడలు ప్రతిధ్వనించాయి - నీ డ్యూటీ నువ్ చెయ్... ఎక్స్ట్రాలొద్దు వేలు చూపిస్తూ వార్నింగ్ ఇచ్చినట్టు అరిచాడు విజయ్.

నర్స్ లతో సహా అంతా నివ్వెరపోయి నిల్చున్నాం.

చెంప పట్టుకున్న టెక్నిషియన్ మొదట తేరుకున్నాడు - సార్.. మీరు కొట్టారని నేను బాధపడటం లేదు. మీరు చేసిన పనివల్ల అక్కడ హార్ట్ పేషెంట్ విలువైన ప్రాణాలు పోయాయి. సినిమా రేపు చూడొచ్చు. పోయిన ప్రాణాలు తిరిగి రావు కదాసార్.. అన్నాడు. పేషెంట్ చనిపోయిన సమాచారం సెల్ ఫోన్ ద్వారా అప్పటికే వాళ్లకు తెలిసిపోయింది.

కానీ జీవితంలో మొదటిసారి చూశాను శాంతంతో విధిని తప్ప అవమానాన్ని లెక్క చేయని ఉద్యోగిని.

విజయ్ గాడు దారుణమైన తప్పు చేశాడనిపించింది.

ఆస్పత్రి నుంచి బైటకి రాగానే - తప్పు చేశామేమోరా.. అన్నాను.

మననే కాదు. ఇక ఎవర్నీ క్వశ్చన్ చేయడు. వాడి డ్యూటీ వాడు చేయాలి. అంతే.. అన్నాడు విజయ్. వాడి లాజిక్ ఎప్పుడూ డిఫరెంట్గానే ఉంటుంది. కానీ నాకు మాత్రం సినిమాకు వెళుతున్న ఆనందం ఆవిరైపోయింది. సినిమాపై దృష్టిపెట్టలేక పోయాను.

0000

0000 0000

ఆ రోజు గ్రామ దేవత పండుగ.

మా నలుగురిలో ఎవరి దగ్గరా దమ్మిడీ లేదు. ఇంటి దగ్గర ఎలాగూ నాన్ విజ్ చేస్తారు. తలా ఒక బీరుకు డబ్బు సంపాదించాలి. ఎదో ఒకటి చేయాలి. అన్నింటికి సమర్ధుడు విజయ్. నేను చూసుకుంటాను.. అన్నాడు.

అంతా సుబ్బారావు బెల్ట్ షాపు దగ్గరికి వెళ్లాం. ఊరంటా బంధువులు ఉండటంతో బెల్ట్ షాప్ కూడా రద్దీగా ఉంది.

పండగపూట అరువు లేదు అని ఖండితంగా చెప్పాడు సుబ్బారావు -గతంలో బాకీ వేయి రూపాయలు రావాలి. ఇలా అయితే నేను షాపు వదిలేసి వెళ్లిపోవాలి.. అని విసుగ్గా కొసరు వేసాడు.

బీర్లు ఇవ్వడని అర్ధమైంది. విజయ్ తోబాటు బైటికి వచ్చేశాం. ఆ పండగ నాలిక తడవకుండానే గడిచిపోతుందని తెలిపోయింది.

రాత్రి పది గంటల సమయంలో ఇంటికి వెళుతూ వీధి చివరి నాగేషుగాడి చెప్పులు సుబ్బారావు ఇంటి ముందు విడిచి వెళ్లాడు విజయ్.

రాత్రి పదకొండు దాటిన తర్వాత బెల్ట్ షాపు మూసి వచ్చిన సుబ్బారావు ఇంటి ముందు నాగేషుగాడి చెప్పులు చూసి ఆగ్రహోద గ్రుడయ్యాడు. సుబ్బారావు అసలే అనుమానం మనిషి. నాగేషుగాడు ఊర్లో షోకిల్లా రాయుడిగా పేరున్నవాడు. పండగపూట ప్రళ యమే సంభవించింది. రాత్రికి ఊర్లో ఎవరికీ నిద్ర లేదు..

మరునాడు సుబ్బారావు భార్యను పుట్టింటికి పంపించేశాడు.

ఈ సంఘటన మూడు నాలుగు రోజులపాటు నవ్వులు పంచింది.

oooo

oooo

విజయ్ గాడి అమ్మకు బాగోలేక పోవడంతో నాలుగు రోజులుగా పార్వతీపురం అస్పత్రి చుట్టూ తిరుగుతున్నాడు. మేమూ వాడితోనే అటూ ఇటూ తిరుగుతున్నాం. ఆ రోజు పార్వతీపురం నుంచి రావడం లేటయింది. అప్పటికే చీకటి పడుతోంది. కోటీశ్వర రావు ఇంటి ముందు జనం గుమిగూడి ఉన్నారు. ఏం జరిగిందన్న ఆందోళనతో మేం పరుగున వెళ్లాం. ఇల్లంతా జనంతో నిండిపోయి ఉంది. లోపలి నుంచి కోటిగాడి తల్లి ఏడుపు ఆర్తనాదంలా వినిపిస్తోంది.

జనం మధ్యలో చాపమీద పడుకో బెట్టి ఉంది కోటిగాడి చెల్లె రమ్య. ఉరి పోసుకుని చనిపోయింది.

ఏం జరిగిందో క్షణాల్లో అర్థమై పోయింది నాకు. రెండు రోజుల క్రితం రమ్యతో పెళ్లి ఖాయం చేసుకోడానికి రాజాం నుంచి మగ పెళ్లి వారు వచ్చారు. ముహూర్తాలు పెట్టుకోడానికి పిల్ల తరపున ఊర్లో ఒకరిద్దరు పెద్దలు ఉంటే బాగుంటుందన్నారు. కానీ కోటిగాడి ఇంట్లో కార్యం అనే సరికి ఏ పెద్ద మనిషీ ముందుకు రాలేదు. నీ కొడుకు నిర్వాకం వల్ల కొంపలు కూలిపోతున్నాయ్.. నీ ఇంటి కొస్తే జనం ముఖం మీద ఉమ్మేస్తారు.. అంటూ ముఖం మీదే రానని చెప్పారు. ఊర్లో కాస్త పేరున్న ప్రతి పెద్దనూ కోటిగాడి తండ్రి రామునాయుడు బతిమాలాడు. తిట్లు ఇంటికి తెచ్చుకున్నాడు తప్ప ఒక్క పెద్ద మనిషిని ఇంటికి రప్పించుకోలేక పోయాడు.

మగ పెళ్లివారికి పరిస్థితి అర్థమై పోయింది. ఒక్క పెద్దమైనిషైనా పెళ్లి పెద్దగా రాలేదంటే ఎంత నీచమైన కుటుంబమో అంటూ ముఖం మీదనే చెప్పి మగ పెళ్లివాళ్లు వెళ్లిపోయారు. పీటల మీదికి వెళ్లాల్సిన కోటిగాడి చెల్లి పెళ్లి అలా చెడిపోయింది.

జనం గుసగుసలు, తిట్లు... శాపనార్థాలు స్పష్టంగా వినబడుతున్నాయి. అన్నీ కోటిగాడిని, వాడి స్నేహితులమైన మమ్మల్ని.

కూతురు మీద పడి ఏడుస్తున్న రామునాయుడు కోటిగాడిని, మమ్మల్ని చూసి కోపంతో మండిపోయాడు. మీ మూలంగానేరా..నా బిడ్డ చచ్చిపోయింది. మీకు అదేం అన్యాయం చేసిందిరా.. పొండిరా పొండి.. కళ్లకు కనిపించకుండా వెళ్లిపొండి... అంటూ రెండు చేతులు ఎత్తి నమస్కరించాడు.

నిజమే .. మా మూలంగానే పెళ్లి కాలేదు.. కాదన్న అవమాన భారంతో చిట్టి తల్లి రమ్య చనిపోయింది. కోటిగాడి ఆకతాయితన ఆ ఇంటి మహలక్ష్మి ఉసురు తీసుకుంది.

జనం చూపుల్లో ఛీత్కారాన్ని తట్టుకోలేక, వాళ్ల కళ్లలోకి చూడలేక తల దించుకుని బైటకి నడిచాను.

రెండు రోజులకే జనం అంతా మరచిపోయారు. కానీ మా ఇంట్లో మా అమ్మా నాన్న నాతో మాట్లాడటం మానేసారు. కోటిగాడు పిచ్చోడై తిరుగుతున్నాడు.

విజయ్ తల్లికి కొంత బాగుండటంతో ఇంటికి తీసుకు వచ్చారు. కానీ అనారోగ్యం అలాగే కొనసాగుతోంది. మా కలయికలో ఆబ్సెంట్ లు ఎక్కువయ్యాయి.

ఆరోజు రాత్రి కోటిగాడు, రాంబాబు, నేను చెరువు తూము చప్టామీద కూర్చుని కొత్త సినిమా కబుర్లు చెప్పుకుంటూ పది గంటల వరకూ గడిపాం. తర్వాత ఇళ్లకు వెళ్లబోతూండగా విజయ్ గాడు పరిగెత్తుకుంటూ వచ్చాడు -ఒరేయ్ మా అమ్మకు సీరియస్‌గా ఉందిరా.. రండిరా! అన్నాడు.

అంతా కలిసి వాడి ఇంటికి వెళ్లాం. విజయ్ తల్లి మంచంపై ఛాతి పట్టుకుని మెలికలు తిరిగిపోతోంది. పరిస్థితి అర్థమై పోయింది. గుండె నొప్పి.. దేనికైనా దారితీయవచ్చు.

ఒరేయ్.. 108కి ఫోన్ చేశావా..? అడిగాను.

చేశాను.. బయల్తేరుతున్నామన్నారు..

అంబులెన్స్ రాగానే విజయ్ గాడి తల్లిని ఎక్కించడానికి అన్ని సర్థుకుని రెడీగా ఉన్నాం. విజయ్ తల్లి పరిస్థితి చెప్పనలవి కాకుండా ఉంది. గుండె నొప్పితో మంచంలో ఉండలు చుట్టుకు పోతోంది. చూడలేక 108కి ఫోన్ చేశాను -చిన్న ఊరేనా.. విజయ్ క

దా? ఆ రోజు హస్పిటల్ దగ్గర కొట్టాడు. గుర్తుంది. వస్తున్నాం.. అన్నాడు టెక్నిషియన్.

అవాక్కయి పోయాను. అంబులెన్స్ లాగ్ బుక్‌లో ఫోన్ చేసిన ప్రతి వ్యక్తి అడ్రస్ ఫోన్ నెంబర్ ఉంటాయి. తనను కొట్టిన వ్యక్తి ఫోన్ నెంబర్‌ను సేవ్ చేసుకోవడం, గుర్తుంచుకోవడం పెద్ద కష్టమైన పని కాదు. రేపు అనేది ఉంటుందని నమ్మే వ్యక్తుల్లో ఉండే శాంత గుణమే ఆ రోజు దెబ్బతిన్న టెక్నిషియన్‌లో కనిపించింది.

నెమ్మదిగా నాలో అలజడి ప్రారంభమైంది. అంబులెన్స్ వాళ్లు ప్రతీకారానికి దిగితే ప్రమాదం. నా అనుమానాలను విజయ్ తో చెప్పలేదు. వస్తున్నారట! అని మాత్రం అనగలిగాను.

గంట దాటినా 108 జాడ లేదు.

విజయ్ లో సహనం నశించిపోయింది. కానీ  అటువైపు నుంచి అదే సమాధానం -బయల్దేరాం ... వస్తున్నాం

ఇంకెంతసేపు. తొక్కలో పార్వతీపురం నుంచి రావడానికి గంటా? అని  అరిచాడు విజయ్.

మధ్యలో ఉన్నాం సర్.. రోడ్డుకు అడ్డంగా ఎవరో చెట్లు నరికి వేసారు. నక్సలైట్లు అనుకుంటా.. అన్నాడు అంబులెన్స్ టెక్నిషియన్.

త్వరగా వచ్చేయండి ఇక్కడ సీరియస్ అని విసుగ్గా ఫోన్ పెట్టేసాడు విజయ్.

మరో గంట గడిచిపోయింది. కానీ 108 జాడలేదు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఇక 108 రాదని అర్థమై పోయింది. విజయ్ కొట్టినందుకు ఇలా సహాయ నిరాకరణ చేస్తున్నారు.

అప్పటికే విజయ్ తల్లికి గుండె నొప్పి ఎక్కువై  కోమాలోకి వెళ్లిపోయింది.

ఎద్దుల బండిపై విజయ్ తల్లిని పార్వతీపురం ఆస్పత్రికి తరలిద్దామని ప్రయత్నించాం. రెగ్యులర్‌గా పార్వతీపురానికి బండి కట్టే కుమార స్వామి ఇంటికి వెళ్లి తలుపు తట్టాను. షర్ట్ చేత్తో పట్టుకుని నిద్ర మత్తులో బైటికి వచ్చి పద అంటూనే పేషెంట్ ఎవరు? అని అడిగాడు.

విజయ్ గాడి తల్లి చెప్పాను.

గోడ ఎదురుగా వచ్చినట్టు ఆగిపోయాడు కుమారస్వామి. నిద్ర మబ్బులుగా విడిపోయింది - మీ నాన్న ముఖం చూసి లేచి వచ్చాను. నువ్వు తెచ్చిన యెదవ బేరం ఇదా? యెల్లెల్లు..అని కసురుకున్నాడు. ఎడ్ల బండ్లున్న మరో ఇద్దరు ఇళ్లకు వెళ్లాం. బండి కట్టడానికి కాదు కదా అంత చిన్న ఊర్లో సాటి మనిషికి ఆపద వచ్చిందంటే వచ్చి చూడటానికి కూడా ఎవరూ ఆసక్తి చూపలేదు.

ఊర్లో జనం మా బ్యాచ్‌ను ఎంతగా అసహ్యించుకుంటున్నారో తెలిసింది.

విజయ్ కు కూడా విషయం అర్థమైంది -ఒరేయ్ చెప్పండిరా.. పొరపాటే చేశాను. ఎన్నో పొరపాట్లు చేశాను. మనం అంబులెన్స్‌లో సినిమాకు వెళ్లడం తప్పే. వాడిని కొట్టడం కూడా తప్పే. సారీ చెబుతున్నాను. వాడి కాళ్లు పట్టుకుంటానని చెప్పండిరా.. మా అమ్మను హస్పిటల్‌కు తీసుకువెళ్లమని చెప్పండిరా.. అంటూ ఏడుస్తున్నాడు.

అప్పటికే తెల్లవారిపోయింది.

108 మాత్రం రాలేదు.

విజయ్ తల్లి బతుకు తెల్లారిపోయింది.

పశ్చాత్తాపం అగ్నిలా దహించి వేస్తూంటే తల్లి మీద పడి గుండెలు పగిలేలా రోదిస్తున్నాడు విజయ్ .

విజయ్ గాడు అంత దీనంగా ఏడవడం నేనెప్పుడూ చూడలేదు




పూర్వం మగధ దేశాన్ని కీర్తి సింహుడు అనే రాజు పరిపాలించేవాడు. ఆయన రాజ్యంలో శ్రీపాలుడు మంత్రిగా పని చేసేవాడు. కీర్తి సింహుడి తండ్రి శూరసింహుడి హయాము నుండీ శ్రీపాలుడు మంత్రిగా ఆ దేశానికి సేవలు అందిస్తూ ఉన్నాడు. శూరసింహుడి మరణానంతరం ఆయన ఏకైక కుమారుడు కీర్తి సింహుడికి పట్టాభిషేకం జరిపించి మగధ దేశానికి రాజుని చేశాడు మంత్రి శ్రీపాలుడు. తమ దేశానికి పొరుగునే ఉన్న మరో శక్తివంతమైన అవంతి దేశాధినేత ఏకైక కుమార్తె తో కీర్తి సింహుడి వివాహం జరిపించి మగధ రాజ్యానికి బలమైన మిత్ర దేశంగా అవంతి దేశాన్ని చేశాడు. శ్రీపాలుడు కీర్తి సింహుడి తండ్రి హయాములో పరిపాలనకు సంబంధించిన ఎన్నెన్నో చక్కటి సలహాలు , సూచనలు ఇచ్చి కీర్తి సింహుడి తండ్రికి మంచి పరి పాలనా దక్షుడు అనే పేరు వచ్చేలా చేశాడు. తన రాజకీయ చతురత లో ఇరుగు పొరుగు దేశాలతో సత్సంబంధాలు నెరుపుతూ మగధ రాజ్యాన్ని శత్రుదుర్భేధ్యంగా తయారు చేశాడు. అంతేకాక తమ పరిపాలన గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోనేటందుకు చారులను నియోగించటం మాత్రమే కాకుండా తాను సైతం తరచుగా మారు వేషాలతో రాజ్యం లో సంచరిస్తూ ప్రజల నాడిని కనిపెట్టి ప్రజా రంజక మైన పాలన అందించేలా చూసేవాడు.

ప్రస్తుతం వయోభారం వలన తను మునుపటిలాగా చురుగ్గా పని చెయ్యలేక పోతున్నట్లు శ్రీపాలుడు కూడా గుర్తించాడు. తనకు శక్తి ఉన్నంత కాలం మంత్రి పదవిని నిర్వహించి కీర్తి సింహుడికి కూడా తన తండ్రికి లాగా మంచి పాలకుడు అనే గుర్తింపు

వచ్చేలా చెయ్యాలని శ్రీపాలుడు ఎప్పుడూ ఆలోచించేవాడు. వయో భారంతో మునుపటిలాగా చురుకుగా పని చెయ్యలేక పోతున్న మంత్రి గారి గురించి కీర్తి సింహుడు కూడా తరుచుగా బాధ పడేవాడు. ఆ వయసులో కూడా ఆయన రాజ్య పరిపాలనకు సంబంధించిన అనేక కార్య భారాలతో సతమతం అవుతూ ఉండటం చూసి కీర్తి సింహుడికి కూడా బాధగా ఉండేది. మగధ దేశం లోనే శ్రీపాలుడికి సాటి వచ్చే ప్రతిభాశాలి మరొకడు లేనేలేడని కీర్తి సింహుడి అభిప్రాయం. అందుకే శ్రీపాలుడు తన స్థానంలో మరొక సమర్ధుడిని మంత్రి గా నియమించుకోమని చాలా సార్లు కోరినా కీర్తి సింహుడు నిర్ద్వందంగా తిరస్కరించేవాడు. ఒక నాడు కీర్తి సింహుడు కొలువు తీరి ఉండగా శ్రీపాలుడు "ప్రభూ ! నేను రాచ కార్యాల భారం అధికమై సతమతమౌతున్నాను. తమరు నాకు రోజువారీ కార్యాలలో చేదోడు వాదోడు గా ఉండగలందులకు ఎవరినయినా సహాయకుడిగా నియమిస్తే బాగుంటుంది. ఆ విధంగా నాకు కొంచెం కార్య భారం తగ్గుతుంది" అని మనవి చేశాడు.

"అవును అమాత్యా-మీకు రాచ కార్యాల భారం అధికంగా ఉన్నది. మీకు నచ్చిన వాడిని మీరే సహాయకుడిగా నియమించుకోండి" అని చెప్పాడు కీర్తి సింహుడు.

తనకు సహాయకుడిని నియమించుకునే అధికారం తనకే కట్ట బెట్టటం తో శ్రీపాలుడు ఆ దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టాడు. శ్రీపాలుడి సహాయకుడి నియామకం కోసం పెట్టిన పరీక్షలలో ఆ దేశానికే కాక ఇరుగు పొరుగు దేశాలకు చెందిన చాలా మంది యువకులు పాల్గొన్నారు. దేహ దారుఢ్యము, కత్తి యుద్ధం, విలువిద్య, మల్ల యుద్ధాలలో ప్రావీణ్యం వంటి అనేక పరీక్షల ద్వారా అన్ని వడపోతల తరువాత చివరికి ఇద్దరు యువకులు మాత్రమే రంగంలో మిగిలారు. ఆ ఇరువురి పేర్లు అజయుడు, విజయుడు. ఇద్దరూ మంచి గురువుల దగ్గర విద్యాభ్యాసం పూర్తి చేసుకున్నారు. మంత్రిగారి సహాయకుడిగా పనిచేయటం అంటే మాటలు కాదు. అమిత ప్రజ్ఞాశాలిగా పేరు తెచ్చుకున్న శ్రీపాలుడు వంటి మేధావికి సహాయకుడిగా బాధ్యతలు నిర్వహించటం అంటే ఆషామాషీ వ్యవహారం కాదని ఆ ఇద్దరికీ తెలుసు. అయినా ఆ ఇద్దరూ తమ తమ తెలివి తేటలతో పోటీదారులనందరినీ అంచెలంచెలుగా అధిగమించి చివరి అంచె దాకా వచ్చారు. కాని ఇద్దరిలో ఒక్కరికి మాత్రమే ఆ అవకాశం లభిస్తుంది. చివరి అంచెలో ఒకరిని ఎంపిక చేసుకుని సహాయకుడిగా నియమించే ప్రక్రియ మొదలైంది. చివరి అంచెలో పరీక్షాంశం గా "సమస్యా పరిష్కారం" ఉంటుంది. శ్రీపాలుడి సలహా మేరకు సైన్యాధ్యక్షుడు ఆ ఇరువురు యువకులని చెరొక గ్రామానికి పంపించాడు. రెండు గ్రామాల పేర్లు రామాపురం, సీతాపురం. రెండు గ్రామాలలో దాదాపు ఒకేలాంటి సమస్య ఉన్నది. ఆ రెండు ఊళ్లకు తాగు నీటి సమస్య ఉన్నది. రెండు ఊళ్లకు దూరంగా రెండు కోసుల దూరంలో మంచినీటి చెరువులు ఉన్నాయి. ఆ గ్రామస్తులందరికీ చెరువు నుండి మంచి నీరు తెచ్చుకోవటము తోనే ప్రతి రోజూ అధిక సమయం గడిచి పోతున్నది. ఆఖరి అంచె పరీక్షలో భాగంగా అజయుడు విజయుడు రామాపురం సీతాపురం గ్రామాలకు పంపబడ్డారు. ఆ గ్రామస్తులతో సంప్రదించి ఆ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న మంచి నీటి సమస్యను పరిష్కరించి రమ్మని ఆ యువకులకు తెలియ

చేశారు. ఇద్దరికీ రెండు మాసాల గడువు విధించారు.

రెండు మాసాల గడువు తీరిన తరువాత అజయుడు విజయుడు తమకు అప్పగించిన పనులను విజయవంతంగా పూర్తి చేసి రాజధానికి తిరిగి వచ్చారు. ఇద్దరూ తమకి అప్పగించిన గ్రామాల నీటి సమస్యను తమదైన శైలి లో పరిష్కరించారు. ఐతే ఇద్దరిలో సరి అయిన పరిష్కారం ఎవరు చూపుతారో వారే విజేత గా నిలుస్తారు. ఈ విషయం మంత్రి శ్రీపాలుడే స్వయంగా పరీక్షించి ఇద్దరిలో విజేత ఎవరో నిర్ణయించవలసినదిగా మహా రాజు కీర్తి సింహుడు కోరాడు. రాజాజ్ఞ మేరకు శ్రీపాలుడు రెండు గ్రామాల్లోనూ పర్యటించి అజయుడు విజయుడు ఆ గ్రామాల నీటి సమస్యను ఏ విధంగా పరిష్కరించినదీ పరిశీలించాడు.

రామాపురానికి పంపబడ్డ అజయుడు ఆ ఊరి వారందరితో సంప్రదించి ఒక నలుగురు బలిష్టులైన యువకులను ఎన్నుకున్నాడు. నాలుగు కావళ్ళను దృఢమైన కొయ్యతో చేయించాడు. ఆ నలుగురు యువకులు ప్రతిరోజూ కావళ్ళలో పెట్టుకుని చెరువు నుండి బిందెలతో నీటిని తెచ్చి గ్రామస్తులకు ఇళ్ళ వద్ద అందించేలాగా ఏర్పాటు చేసాడు. అందుకు బదులుగా ఆ నలుగురు యువకుల జీవనానికి అవసరమయిన ధనాన్ని గ్రామస్తులందరూ వంతులు వేసుకొని ఇచ్చేలాగా అజయుడు ఏర్పాటు చేసాడు. ఇలా నీళ్ళను చెరువు నుండి మోసుకుని తెచ్చుకొనే పని తప్పి పోవటంతో గ్రామస్తులకు ఎంతో తీరిక దొరికి తమ పొలం పనులు మరియు ఇతర పనులను మరింత చక్కగా చూసుకోసాగారు. గ్రామస్తులందరూ అజయుడు చేసిన కావళ్ళ ద్వారా నీటి సరఫరా ఏర్పాటు ఎంతో బాగుందని, తమకు ఎంతో సమయం ఆదా అవుతోందని చెప్పారు. ఆ సమయాన్ని తాము ఇతర కార్య కలాపాలకు వినియోగిస్తున్నట్లు మంత్రి గారికి విన్నవించారు. మంత్రి శ్రీపాలుడు ఆ తరువాత సీతాపురానికి బయలుదేరాడు.

సీతాపురానికి పంపించిన విజయుడు ఆ ఊరిని, ఊరి చెరువును శ్రద్ధగా పరిశీలించాడు. ఊరు కంటే ఊరికి నీరు అందిస్తున్న చెరువు ఎక్కువ ఎత్తులో ఉన్నట్లు గమనించాడు. నీరు పల్లమెరుగు అన్న సూక్తి ప్రకారం ఎత్తుగా ఉన్న ప్రదేశంలో ఉన్న చెరువు నుండి పల్లపు ప్రాంతంలో ఉన్న ఊరికి నీటిని సులభంగా ప్రవహింప చేయవచ్చు అని గ్రహించాడు. కావలసిందల్లా చెరువునుండి గ్రామానికి మంచి నీటిని తీసుకుపోయే టందుకు ఒక పిల్ల కాలువ మాత్రమే అని గ్రహించాడు విజయుడు. ఆ గ్రామస్తు లందరినీ సమావేశపరిచి అందరినీ పిల్ల కాలువ తవ్వటానికి శ్రమదానం చేయటానికి ఒప్పించాడు విజయుడు. గ్రామస్తుల సహకారంతో త్వరలోనే పిల్ల కాలువ తయారైంది. కాలువ గుండా ప్రవహించే నీరు భూమిలోకి ఇంకి పోకుండా కాలువ అడుగుభాగాన ఆ గ్రామ సమీపంలోనే లభించే నాప రాళ్ళను కాలువ కింది భాగంలో పరిపించాడు. దీంతో శుభ్రమైన నీరు ఆ పిల్ల కాలువ ద్వారా గ్రామ మధ్యకు ప్రవహించే లాగా ఏర్పాటు అయింది. గ్రామ మధ్యలో ఒక పెద్ద తొట్టి ఏర్పాటు చేయటంతో కాలువ ద్వారా వచ్చే నీటితో తొట్టి నిండి గ్రామస్తులకు తాగు నీరు నిరంతరాయంగా అందుబాటు లోకి వచ్చింది. ఆ విధంగా సీతాపురం గ్రామస్తుల తాగు నీటి బాధలకు శాశ్వత మైన పరిష్కారం దొరికింది.

రెండు గ్రామాలలో అజయుడు విజయుడు చేసి చూపించిన పరిష్కారాలను పరీక్షించిన మంత్రి శ్రీపాలుడు రాజు తో ఇలా చెప్పాడు " ఒకే లాంటి సమస్యలున్న రెండు గ్రామాలలో వీళ్ళిద్దరూ తమదైన శైలిలో పరిష్కారాలను చూపించారు. రామాపురం నీటి సమస్య తీర్చటానికి అజయుడు చేసిన ఏర్పాటు తాత్కాలికమైనది. ఆ నలుగురు యువకులు కావిళ్ళ తో నీటిని గ్రామస్తుల ఇళ్ళ వద్దనే అందిస్తున్నారు. అంటే గ్రామస్తులందరి బదులుగా ఆ నలుగురు యువకులే శ్రమ పడుతున్నారన్న మాట. కాని నా దృష్టి లో ఇది శాశ్వతమైన పరిష్కారం కాదు. ఇకపోతే విజయుడు దూరదృష్టి తో ఏకంగా చెరువు నీటిని గ్రామానికి తరలించేలాగా పిల్ల కాలువ తవ్వించటం ద్వారా ఆ గ్రామస్తుల మంచి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాడు. అందువల్ల విజయుడే ఈ పోటీలో విజేత" అని ముగించాడు మంత్రి శ్రీపాలుడు.




సైక్రియాటిస్టు రాజేష్ కు ఆ రోజు సరికొత్త సమస్య తెచ్చిపెట్టాడు ఒక వ్యక్తి.

“ వాళ్ళందరిని పలకరించాలంటే పరమ అసహ్యంగా ఉంటోంది “ అన్నాడు వర్ధన్.

“ఎరక్కపోయి నేనే వాళ్ళ నందరిని నెత్తికెక్కించుకున్నానా అనిపిస్తూ ఉంటుంది.”

“ఎవరికీ వారు వాళ్ళేదో గొప్ప అనుకుంటారు. స్వయం ప్రకాశక శక్తి లేదు. వాళ్ళనీ వీళ్ళనీ అనుకరిస్తూ రోజులు గడిపేస్తూ ఉంటారు. “

“ వాళ్ళు చేసే నిర్వాకాలకు” ఆహో ఓహో” అంటూ పైకి ఎత్తేయ్యాలిట. ఇలా ఎంతకాలం వాళ్ళ పల్లకీ మొయ్యాలి ?”

“ఇంతా చేస్తే వాళ్ళు చేసేవన్నీ కాపీ పనులే. చేతిలో టైపింగ్ చేసే కళ ఉందని మరీ రెచ్చి పోతున్నారు. హార్మోనియం పెట్టిలా ఒళ్లో పెట్టుకుని వాళ్ళవీ, వీళ్ళవీ ఒకటే బాదేస్తున్నారు.”

“ ఎంతో కష్టపడి బుర్ర ఉపయోగించి రాత్రింబవళ్ళు శ్రమపడినా ఫలితం దక్కడం లేదు. ”

“అప్పటికీ చాలా సార్లు అనుకున్నాను. కొత్తగా అంటించుకున్న ఈ రోగాన్ని ఎలాగైనా వదుల్చుకోవాలని “

“అలా చేస్తే నాలో ప్రజ్వరిల్లుతున్న కళను అణగదొక్కేసుకోవడమే అవుతుందేమో అని మళ్ళీ ఆలోచన “

“ ఈ విచిత్ర రోగం బారిన పడుతున్న వాళ్ళు ఎక్కువగా అరవై ఏళ్ళు పై పడిన వాళ్ళేనట . ఈ వయసులో ఏ వ్యాపకంలేకుండా, బుర్ర ఉపయోగించ కుండా రెండు పూటలా తిండి తినేసి ఖాళీగా కూర్చుంటే లేనిపోని వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఆయనెవరో హెచ్చరించడం గుర్తొచ్చి ఒక్కోసారి మనసు మార్చుకునే ప్రయత్నం కూడా చేస్తున్నాను “

“ఇంకోపక్క తీవ్రమైన ఆందోళన, నన్ను సరిగ్గా గుర్తించడంలేదన్న అవమాన భారంతో రాత్రంతా నిద్ర పట్టటం లేదు “

“అయినా కూడా నాలుగైదు సార్లు అందులోంచి బయటకు వచ్చేసాను. రాయని ఉత్తరానికి రిప్లై కోసం ఎదురుచూసే వాడ్నిలా అయ్యింది నా పని. వాళ్ళు నన్ను అసలు పట్టించుకోవడం మానేశారు. ఆణువణువూ నిస్సత్తువ, ఆవరించింది. దాని స్థానాన తీవ్రమైన అవమానం నరనరాల్లోనూ విషంలా పాకసాగింది “

“ లేదు లేదు నేనిలా చేతకాని వాడిలా ఉండటానికి వీల్లేదు. ఈ పుష్పకవిమానంలో కాని ఖర్చు లేకుండా ఇంతమంది అర్హులు, అనర్హులు ప్రయాణం చెయ్యగా లేనిదీ నాకేం తక్కువని ఇలా ముడుచుకుని కూర్చోవాలి ?. ఎవరో కోసం మనం బ్రతుకుతున్నామా ? ఎవరో కోసం మనం వ్యాపకాలు మానుకోవాలా ?” అని వీరావేశం వచ్చి మళ్ళీ ముందుకు దూసుకు పోయేవాడిని. ”

“ సైక్రియాటిస్టు రాజేష్ సావధానంగా రోజూ వచ్చి వర్ధన్ చెపుతున్న సమస్యల సీరియల్ వింటూ వచ్చాడు. బహుశా ఆయన సర్వీస్ మొత్తంలో ఇలాంటి సమస్యలున్న వాళ్ళను ఎవర్నీ చూసి ఉండడు. వర్ధన్ మానసిక వ్యాధికి ఎటువంటి చికిత్స ఇవ్వాలో తెలియక రోజూ తనచుట్టూ తిప్పుకుంటున్నాడు.

ఆఖరికి ఒకరోజు రాజేష్ వర్ధన్ చెయ్యి పట్టుకుని “ వర్ధన్ గారు దయచేసి నాకో పది రోజులు సమయం ఇవ్వగలరా ? ఈ లోపు మీ సమస్యకు సరియిన పరిష్కారం కనుక్కుంటాను “ అని దాదాపు వేడుకున్నట్టుగా అడిగాడు.

ఈ పది రోజులు వర్ధన్ డాక్టర్ రాజేష్ మొహం చూడలేదు. యధావిధిగా తను చవిచూస్తున్న నరక బాధలను ఎలాగో అలా దిగమింగుకుంటూ క్రమం తప్పకుండా పట్టు వదలని “విక్రమూర్ఖుడిలా” తనకు సంక్రమించిన అంటు రోగాలకు ఏవేవో తోచిన ఉపశమనాలు చేసుకుంటూ పది రోజుల తర్వాత డాక్టర్ రాజేష్ దగ్గరికి వెళ్ళాడు.

“ చూడండి మిస్టర్ వర్ధన్ గారు. మీరు క్రమక్రమంగా మీరు చేస్తున్న పని నుండి ఎంత త్వరగా బయట పడితే అంత మంచిది. ఇది భయంకరమైన వైరల్ ఫీవర్ లాంటిది. మనుషుల్ని పీల్చి పిప్పి చేసి కాని వదలదు. దీనికి అలవాటు పడితే ఏ మందులూ పని చెయ్యవు. మీరు చేస్తున్న పనిలో ఒక్కోసారి ఎంతో ఎత్తుకు ఎదుగుతున్నానని అందరూ మీ చుట్టూ భరోసాగా ఉన్నారని భ్రమ కలిగిస్తుంది. చూస్తూండగానే అంత ఎత్తునుండి ఒక్కసారి దభీమని పడిపోతారు. మన ఇంట్లోనే మనకు

శత్రువులు తయారవుతారు. ఏదో చెయ్యాలన్న ఆరాటం, ఏమీ చెయ్యలేని అశక్తత మిమ్మల్ని వెంబడిస్తుంది. రోజులో పది పన్నెండు గంటలు ఇదే వ్యాపకం వల్ల ఊబ కాయానికి వారసులవుతారు. పని మధ్యలో ఎవరైనా ఆటంకపరిస్తే వాళ్ళ మీద గట్టిగా అరవడం మొదలు పెడతారు. లెక్కకు మించి ఎన్నో సార్లు మనిషి డిప్రెషన్ కు గురవుతాడు. మీ ఒరిజినల్ బిఎస్సీ డిగ్రీకి స్వయంకృతాపరాధంతో తెచ్చుకున్న మరో బిఎస్సీ డిగ్రీ జత అవుతుంది. అదేనండి. బీపి, షుగర్, కొలెస్ట్రాల్ అన్నమాట. "

"ఇంకా వినండి. మెల్ల మెల్లగా మీలో ఆల్జైమర్స్ అనే భయంకరమైన మతిమరుపు వ్యాధి అలుముకుంటుంది. పక్కనే కాఫీ ఉన్నా, నీళ్ళు ఉన్నా దాన్ని తోసేస్తారు. మీకు భోజనం తెచ్చిన మీ ఆవిడ మొహమ్మీద కంచం విసిరికొడతారు. దాని పర్యవసానం పిచ్చి పిచ్చిగా మాట్లాడుతూ చివరకు "పిచ్చివాళ్ళు"గా మారడం. మీరు ముందుగా వచ్చి మంచి పని చేసారు. ఇప్పుడు మీ బుర్ర ఇంకా మీ స్వాధీనంలో ఉంది కాబట్టి నేను చెపుతున్నది మీకు అర్ధం అవుతోందనే అనుకుంటున్నాను. ఇంకో వారం రోజుల తర్వాత వచ్చి ఉంటే నా చేతుల్లో ఏమీ ఉండేది కాదు. కమాన్. హర్రీ అప్. . మనసును వేరే పనులలోకి మళ్ళించి త్వరగా దీన్ని నుండి బయటపడండి ." అంటూ ఆవేశంగా ఊగిపోతూ చెప్పాడు ప్రముఖ సైక్రియాటిస్టు డాక్టర్ రాజేష్.

" అది సరే సర్. ఈ విషయం చెప్పడానికి మీరు పది రోజులు సమయం ఎందుకు తీసుకున్నారు ? " అని అనుమానం వచ్చి అడిగాడు వర్ధన్.

" కారణం మీరు ఎదుర్కొంటున్న సమస్య నాకూ ఉంది కాబట్టి. నేను ఈ పది రోజులు ఆ సమస్య నుండి బయట పడటానికి విశ్వ ప్రయత్నాలు చేసి చేసి మీకు ఇప్పుడు ఈ సలహా ఇవ్వగలుగుతున్నాను" అంటూ టేబుల్ మీద గ్లాసులో నుండి గటగటా మంచినీళ్ళు తాగేసాడు సైక్రియాటిస్టు రాజేష్. .

ఇంతకీ వర్ధన్ ఎదుర్కొంటున్న భయంకరమైన సమస్యేమిటో చెప్పలేదు కదూ అదేనండి బాబూ పేస్ బుక్ సమస్య.




పూర్వం రామకృష్ణాపురం అనే ఒక చిన్న గ్రామంలో ఆనందుడు అనే రైతు బిడ్డ ఉండేవాడు. వాడు కాస్త అమాయకంగా ఉండేవాడు. ఆనందుడికి చిన్నతనంలోనే తల్లి తండ్రి చనిపోవటంతో పెద్దగా చదువు వంట బట్ట లేదు. ఆనందుడు ఒంటరిగా తమ పొలం సమీపం లో వేసుకున్న చిన్న గుడిసె లో ఉండేవాడు. తన తల్లి తండ్రుల నుంచి సంక్రమించిన కొద్ది పాటి పొలం దున్నుకుని జొన్న, వరి వంటి పంటలు పండించి తన జీవనం సాగించేవాడు. ఆనందుడికి చిన్న తనం నుండే దైవ భక్తి కాస్త అధికంగా ఉండేది. ఆ గ్రామంలో ఉన్న రామాలయం లో జరిగే పురాణ, హరి కధా కాలక్షేపాలకు ఆనందుడు తరుచుగా హాజరు అయ్యేవాడు.

ఒకసారి ఒక మునీశ్వరుడు ఆ గ్రామానికి వచ్చి కొద్ది కాలం ఆ రామాలయంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు కొన సాగించాడు. రామాయణ, భారత, భాగవతా ల గురించి, పాప పుణ్యాల గురించి ఆయన చెప్పిన ప్రవచనాలు గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఒక రోజు ఆయన బుద్ధుడి బోధనలు, ముఖ్యంగా అహింస గురించి సోదాహరణగా గ్రామస్తులందరికీ బోధించి తాను మరో చోటికి బయలు దేరే ముందు ఆ గ్రామస్తులందరి చేతా తాము అహింసా యుతమయిన జీవనము గడుపుతామని, సాటి మనుషులకు, జంతువులకు, పక్షులకు, క్రిమి కీటకాదులకు హాని చేయ బోమని ప్రతిజ్ఞ చేయించాడు. ఆనందుడు కూడా అందరితో పాటే ప్రతిజ్ఞ చేసాడు. అహింస గురించి మునీశ్వరుడు చెప్పిన మాటలు ఆనందుడి మనసులో బాగా నాటుకు పోయాయి. అహింసాయుత మార్గంలో జీవించాలని ఆనందుడు గట్టిగా తీర్మానించుకున్నాడు.

ఆ ఏడు చక్కటి వర్షాలు పడటంతో గ్రామస్తులంతా సంతోషంగా నాట్లు వేసే కార్యక్రమం ప్రారంభించారు. ఆనందుడు కూడా తన కున్న కొద్ది పాటి పొలంలో జొన్న పంట వేసాడు. ఆనందుడు వేసిన జొన్న పంట ఏపుగా పెరిగింది. జొన్న పంట చక్కటి దిగుబడి ఇస్తుంది కనుక ఆ పంట అమ్మగా వచ్చే డబ్బుతో కొన్ని ఆవులనో , మేకలనో, కోళ్ళనో కొనుగోలు చేసి వాటి పెంపకం ద్వారా మరింత ఆదాయం గడించవచ్చు ఆ తరువాత తాను కూడా తగిన కన్యని వివాహం చేసికొని జీవితంలో స్థిర పడవచ్చు అని ఆనందుడు ఆలోచించ సాగాడు.

ఒక రోజు ఆనందుడు పొలానికి వెళ్లి చూడగా తన చేలో త్వరలో చేతికి అందనున్న పంటకు క్రిమి కీటకాలు ఆశించి పంటను నాశనం చెయ్యటం గమనించాడు. తన పొలంలో లాగే ఆ గ్రామంలో మిగతా రైతులు వేసిన పంటలకు కూడా క్రిమి కీటకాలు ఆశించటాన్ని గమనించాడు ఆనందుడు. గ్రామం లోని రైతులందరూ వెను వెంటనే సస్య రక్షణ చర్యలు చేపట్టి క్రిమి కీటకాల బారి నుండి పంటలను కాపాడుకొనే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఆనందుడికి మునీశ్వరుడు చెప్పిన జీవహింస, అహింస మాటలే గుర్తు రాసాగాయి. తాను సస్య రక్షణ చర్యలు చేపడితే తన పంటని తిని బతుకుతున్న క్రిమి కీటకాలు చనిపోతాయి. అది జీవ హింస అవుతుంది. మునీశ్వరుడు జీవ హింస చేయ రాదని బోధించాడు. పైగా తాను జీవ హింస చేయనని ప్రతిజ్ఞ కూడా చేసాడు. అందు వలన ఆనందుడు దైవం మీద భారం వేసి తన పంటని కాపాడుకోవటానికి ఎటువంటి సస్య రక్షణ చర్యలు చేపట్టకుండా ఊరుకున్నాడు. దానితో పక్క పొలాల రైతులు చేపట్టిన సస్య రక్షణ చర్యల ప్రభావం వలన ఆ పొలాల నుండి కూడా మొత్తం క్రిమి కీటకాలు అన్నీ ఆనందుడి పొలంపై దాడి చేసి ఆనందుడి పంటని సర్వ నాశనం చేసేశాయి.

గ్రామంలోని ఇతర రైతులు అనందుడికి పంట రక్షణ చర్యలు చేపట్టమని ఎన్ని మార్లు చెప్పినా ఆనందుడు పెడ చెవిని పెట్టాడు. పైగా "సస్య రక్షణ చర్యల వలన పాపం ఆ క్రిమి కీటకాలు చనిపోతాయి. అది హింస-- పాప కార్యం. నేను చేయ లేను" అని చెప్పటం తో తతిమా రైతులు ఆనందుడి మీద జాలి పడ్డారు. వారు ఎంతగా వివరించి చెప్పినా వినక ఆనందుడు మొండిగా "జీవ హింస--అహింస" అంటూ తన పంటనంతా క్రిమి కీటకాల పాలు చేస్తున్నాడని వారు బాధ పడ్డారు. కానీ ఆనందుడు వారి మాట వినలేదు. ఆనందుడి పంట పూర్తిగా నాశనం ఐపోయింది. అలాగే ఆ తరువాత వేసిన వరి పైరు కూడా చీడ పీడలు ఆశించి, అహింస పేరిట సస్య రక్షణ చర్యలు చేపట్టనందున పూర్తి పంట క్రిమి కీటకార్పణం అయి పోయింది. ఇలా వరుసగా పంటలు దెబ్బ తినటంతో ఆనందుడు పూర్తిగా చితికి పోయాడు. పంట వేయటానికి అవసరమయిన విత్తనాలు సైతం కొన లేక చివరకు తన పొలాన్ని దున్నకుండా వదిలేసి తాను ఇతర రైతుల దగ్గర కూలీ పనికి వెళ్ళటం మొదలు పెట్టాడు. ఆవిధంగా ఆనందుడి బ్రతుకు రైతు స్థాయి నుంచి రైతు కూలీ స్థాయి కి దిగ జారింది.

కొంత కాలానికి ఆ మునీశ్వరుడు రామకృష్ణా పురానికి మళ్ళీ వచ్చాడు. ఊరి పెద్దల ద్వారా ఆనందుడి దుస్థితి గురించి విన్న మునికి అమితమయిన జాలి కలిగింది. తన బోధనలను సరిగ్గా అర్థం చేసుకోకుండా ఆనందుడు రైతు కూలి స్థాయికి దిగ జారి పోయాడని తెలిసి ముని ఆనందుడిని పిలిపించాడు. ఊరులో అందరు రైతులు చీడ పీడల నుంచి తమ పంటలను కాపాడుకుంటుంటే నువ్వు మాత్రం ఎందుకు ఆ పని చేయ లేదని ముని ఆనందుడిని ప్రశ్నించాడు. స్వామి తమరు క్రిందటి సారి మా ఊరు వచ్చినప్పుడు మా అందరి చేత జీవ హింస చేయబోమని ప్రతిజ్ఞ చేయించారు. నేను కూడా ఆ రోజు ప్రతిజ్ఞ చేసాను. ఆ ప్రతిజ్ఞ కి భంగం కలిగేలాగా చేయ కూడదని నేను నా పంటలను కాపాడుకోవటానికి ఎటువంటి సస్య రక్షణ చర్యలు చేపట్ట లేదు అని చెప్పాడు ఆనందుడు.

"నీ లాగే జీవహింస చేయ బోమని ప్రతిజ్ఞ చేసిన మీ ఊరి లోని మిగిలిన రైతులు సస్య రక్షణ చర్యలతో తమ పంటలను కాపాడుకున్నారు కదా ? నువ్వు ఎందుకు ఆ పని చేయ లేదు ? " అన్న ముని ప్రశ్నకు "నేను ఆ పని చేస్తే నేను చేసిన ప్రతిజ్ఞ ని భంగం చేసినట్లు అవుతుంది కదా ?" అని ఎదురు ప్రశ్నించాడు ఆనందుడు. ఆనందుడి అమాయకత్వానికి జాలి పడి ముని ఇలా వివరించాడు. "అహింస అని నేను బోధించిన దాని అర్థము మనకు అపకారం చేయని జీవులను హింసించ రాదని. కానీ మన పంటలను నాశనం చేసే క్రిమి కీటకాలు మన పంటలను పాడు చేసి మనకు తీరని నష్టం కలిగిస్తాయి. నీ విషయమే తీసుకుంటే ఆ క్రిమి కీటకాలు నీ పైర్లను నాశనం చెయ్యటం వలన నీకు ఎంతటి నష్టం జరిగిందో గుర్తించావా ? రైతు గా జీవించే నువ్వు ఇప్పుడు రైతు కూలి గా మారి పోయావు. దీనికి కారణం నా బోధనలను నువ్వు సరిగ్గా అర్థం చేసుకోలేక పోవటమే. మీ గ్రామం లో మిగతా రైతులు కూడా నీలాగే అహింసా యుతంగా జీవిస్తామని ప్రతిజ్ఞ చేసినా వారెవరూ నీలా పంటలను క్రిమి కీటకాలకు వదిలి పెట్టి, పంటలను పోగొట్టుకొని రైతు కూలీలుగా మారలేదు. మరొక ఉదాహరణ --మన శరీరం లోకి రోగ క్రిములు ప్రవేశించి మనకు వ్యాధులను కలిగిస్తాయి.

పాపం రోగ క్రిములు మన దేహాన్ని ఆశ్రయించుకొని బ్రతుకున్నాయి పోనీలే అని మనము ఊరకుంటే ఆ రోగ క్రిములు మన రక్త మాంసాలని పీల్చి పిప్పి చేస్తాయి. చివరకు మన శరీరం శిధిలం అయి మృత్యు వాత పడతాము. అలా జరగకుండా మనం మందులు వాడి రోగాలను నయం చేసుకుంటాము. అంటే మన శరీరం లోకి ప్రవేశించిన రోగ క్రిములను నిర్మూలిస్తామన్న మాట. ఇప్పుడు నీకు నా బోధనా సారం అర్థం అయినది అనుకుంటాను" అని ముగించాడు మునీశ్వరుడు. మునీశ్వరుడి వివరణతో ఆనందుడికి తాను చేసిన తప్పిదం తెలిసి వచ్చింది. ఆ తరువాత నుంచి ఆనందుడు మళ్ళీ కష్ట పడి అచిరకాలం లోనే తన పొలం లో చక్కటి పంటలు పండించు కోవటమే కాకుండా త్వరలో నే తగిన కన్యని వివాహం చేసుకొని ఒక ఇంటి వాడిగా, మంచి రైతు గా స్థిర పడ్డాడు.




“వాసుకు పెళ్లి సంబంధం చూసే బాధ్యత నీదే బాబూ” అంటూ మా మామయ్య నాకు గురుతరమైన బాధ్యత అప్పగించాడు.

పెళ్లి సంబంధాలు చూడ్డమంటే మాటలు కాదు. తీరా చూసాక పెళ్లి కుదిరి విజయవంతమైతే ఫరవాలేదు గాని బెడిసికొట్టిందంటే నా కాపురమెక్కడ కొల్లేరవుతుందోనని భయపడ్డాను.

అయినా నా జాగ్రత్తలో నేనుండాలి. ‘సంబంధం చూడటం వరకే నావంతు.. ఆ కుటుంబం మంచి, చెడు లోతుగా తెలుసుకొని ఖరారు చేసుకోవడం మీ వంతు..’ అని తప్పుకుంటే సరి అని మనసులో అనుకొని పైకి మాత్రం నా మాటలన్నీ ధైర్యంలో కుమ్మరించి “సరే..మామయ్యా..” అన్నాను గంభీరంగా..

అలా అనక తప్ప లేదు. నేను హైదరాబాదు కూకట్ పల్లిలో ఉంటాను. సిటీలో పెళ్లిసంబంధాల సంస్థలెక్కువ. మామయ్య వాళ్ళది పెద్ద కుటుంబం. ముగ్గురమ్మాయిలు.. ఇద్దరబ్బాయిలు. వాళ్ళు సిరిసిల్లలో ఉంటారు.

ఇంటికి పెద్దల్లున్ని నేను. నన్ను పెద్ద కొడుకులా చూసుకుంటారు. ఆ మర్యాద కాపాడుకోవా లను కున్నాను.

నా పెద్ద బావమర్ది వాసు పెళ్లి సంబంధం కుదిరిందంటే అనుభవాల దొంతరాలలో వాసు రాటుదేలుతాడు. ఇక వారి కుటుంబ భారం అతడు చూసు కుంటాడనని నానమ్మకం.

సంబధాలు చూసే కార్యక్రమంలో అడుగుమోపాను.

నాకు తెలిసిన "పెళ్లి భరోసా కేంద్రం " - 'పడకు నిరాశ' అనే ట్యాగ్ లైన్ కలిగిన వివాహ సంస్థ ఒకటి వారసిగూడలో ఉంది. దాన్ని నడిపేది నడిమింటి నారాయణ గారు. నాకు పరిచయస్తుడు కూడా..

ఆదివారం వీలు చూసుకొని ఫోన్ చేసి వెళ్లాను. సాదరంగా ఆహ్వానించాడు.

వారసిగూడ ప్రధాన కూడలిలో ఒక పోర్షన్ ఇంట్లో రోడ్డు ముఖంగా లేడీస్ ఎంపోరియం.. దాని వెనకాల గదిలో పెళ్లి సంబంధాల ఫైల్స్ అల్మారాలలో పేర్చి ఉన్నాయి. తాను నిస్వార్థంగా సేవ చేస్తున్నాడు. వెళ్ళిన వారందరికీ చాయ్ పానీయాలివ్వడం వారి ఆత్మీయతను చాటుతుంది.

బుక్ షెల్ఫ్ లలో అమ్మాయిల, అబ్బాయిల ఫైల్స్ వేరు వేరుగా ఉన్నాయి. అందులో డాక్టర్లు, ఇంజనీర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్స్, గ్రాడ్యుయేట్స్, పాఠశాల చదువుతో ఆగిపోయినవారి ఫైల్స్ లేబుల్స్ అతికించిన సొరుగుల్లో ఉన్నాయి. ఇంకా పునర్వివాహం ఫైల్స్ ఉండడం అభినందనీయమే.

నేను వాసుకు సరిపోయే అమ్మాయిల వివరాలు వారి చిరునామాలు డైరీలో రాసుకుంటు న్నాను.

ఇంతలో నారాయణ గారే స్వయంగా ట్రే లో గ్లాసుల్లో నీళ్ళు, టీ కప్పులు తీసుకొచ్చాడు. ఫైళ్ళు పక్కకు పెట్టి ట్రే అందుకున్నాను.

టీ తాగుతూ కబుర్లలో పడ్డాం. సంబంధాలు నా బావమర్ది కోసమని తెలుసుకున్నాడు.

“ముందుగా ఫోన్ చెయ్యండి. ఫోన్లో వారు మాట్లాడే విధానంతో వారి స్వభావం కొంతవరకు తెలిసి పోతుంది. వారు ఇంట్లో ఉండే సమయ వివరాలు తెలుసుకోండి. ఒక రోజు చెప్పా చెయ్యకుండా మీరొక్కరే వెళ్ళండి. దాంతో వారింటి స్థితిగతుల యదార్థ స్వరూపం బయట పడ్తుంది.

స్నేహపూర్వకంగా కుటుంబ పరిచయం చేసుకుందామని వచ్చానని అందరినీ పలుకరిస్తూ అమ్మాయిని పరిచయం చేసుకోండి. మీకు నచ్చితే వారి బంధువుల చిరునామాలు కనుక్కొని బయట పడండి. ఆ తరువాత వారి బంధువులతో చర్చించి నిర్ణయం తీసుకున్నాక సదరు అమ్మాయి వాళ్ళని మీ ఇంటికి ఆహ్వానించండి. అబ్బాయిని పరిచయం చేయండి. మీ బంధువుల వివరాలివ్వండి. వారికీ నచ్చాక పెళ్లి చూపులు పెట్టుకోండి. పెళ్లి చూపులయ్యాయంటే సగం పెళ్ళయినట్లే..” అంటూ గీతోపదేశం చేసాడు నారాయణ.

“1965 లో పెళ్లి పిల్లవాడు సైకిల్ కావాలని, 1975 లో రేడియో కావాలని, 1985 టీ.వీ. కావాలని, 1995 లో టూ వీలర్ కావాలని అడిగే వాడు. కాని ఇప్పుడు అమ్మాయికి బాయ్ ఫ్రెండ్ లేకుంటే చాలనుకునే కాలమొచ్చింది” అనే సరికి నాకు నవ్వాగింది కాదు. టీ గ్లాసు కింద పెట్టి భళ్ళున నవ్వాను. నా నవ్వులో నారాయణ నవ్వు మిళితమైంది. మా నవ్వుల ధాటికి షాపుకొచ్చిన వాళ్ళంతా మమ్మల్ని తొంగి చూడసాగారు ఆశ్చర్యంగా..

“నిజమే ఈ కాలంలో బాయ్ ఫ్రెండ్, గర్ల్ ఫ్రెండ్ లేకుంటే నామర్దా అనుకుంటుంది యువత. హద్దుల్లో ఉంటున్నారా అంటే అదీ లేదు. అనర్థాలు కొని తెచ్చుకుంటున్నారు. ఏదైనా తమ దాకా వస్తే గాని తెలిసిరాదు” అంటూ నా డైరీ తీసుకొని బయలుదేరాను.

పెళ్లి సంబంధాల వేటలో ఒక రోజు నేను మలక్ పేట వెళ్లాను. నేను ఎన్నుకున్నది చిన్న కుటుంబం. సారంగపాణి, సరోజలకు ఒక్కర్తే అమ్మాయి పేరు నీరజ. ఫైల్లో ఫోటోలు చూసాను.. సులభంగా గుర్తు పట్టవచ్చు. నారాయణ గారి సలహా తు.చ. తప్పకుండా ప్రణాళిక ప్రకారం తలుపు తట్టాను.

అమ్మాయి తలుపు తీసింది.

“నాన్న గారున్నారా.. నీరజా” అంటూ అడుగుతుంటే స్వరం తప్పింది. మంచినీళ్ళు కావాలని సంజ్ఞ చేసాను. పేరు పెట్టి పిలిచే సరికి కాసేపు విస్తుపోయింది. తల వెనకాల చూపుడు వేలుతో సుతారముగా గోక్కుంటూ వంటగదిలోకి వెళ్తోంది. మధ్యలో ఆమె చెయ్యి పట్టుకొని వెనక్కి లాగాడు.. ఒక అబ్బాయి.

డ్రాయింగ్ రూం చివరన ఉన్న అద్దంలో వారి ప్రతిబింబాలు స్పష్టంగా కనబడుతున్నాయి. వారది గమనించే స్థితిలో లేరు. నీరజను దగ్గరికి లాక్కొని హత్తుకున్నాడు. చుంబించబోతుంటే వద్దన్నట్లుగా అతడి పెదవులపై అరచెయి అడ్డు పెట్టింది. నన్ను పంపించి వస్తానన్నట్లుగా ఆమె ముఖకవళికలు అద్దంలో ఆడుకుంటున్నాయి..

నా మనసు చివుక్కుమంది. నేనెవరని పరిచయం చేసుకోవాలి?.. అనే ఆలోచనలు నన్ను ముసురుకున్నాయి.

నీరజ గ్లాసు నా చేతికందిస్తూ "అమ్మ, నాన్న ఊరెళ్ళారు. నేనొక్కర్తనే ఉన్నాను. ఏం పనిమీద వచ్చారు.. మీరెవరండి? నాకు గుర్తుకు రావడం లేదు." అంటూ ఏంతో వినయం ప్రదర్శిస్తోంది.

నా హృదయం ఉడికి పోతోంది.. "మీ అమ్మ గారి బాయ్ ఫ్రెండ్ ని" అన్నాను తక్కున. ఉన్నఫళంగా నా పైకి లంఘించింది నీరజ ఆవేశంగా.. ఆమె కళ్ళు నిప్పుకణికలయ్యాయి. చున్నీని నడుమకు చుట్టూ..

"ఏదీ మళ్ళీ అనండి.." అంటూ గట్టిగా అరిచింది. " మా నాన్నుంటే ప్రాణాలు తోడేసే వాడు"

"లేడనే గదా నేను ధైర్యంగా వచ్చింది.. పేరెంట్స్ లేరనే ధీమాతో నువ్వేం వెలగబెడ్తున్నావో ఎవరికెరుక?.." అంటూ నేను వ్యంగ్యంగా సమాధానమిచ్చాను.

లిప్తకాలం స్థాణువై తేరుకుంది. ఆవేశం తగ్గించుకుంది.

"నవ్వెవ్వరో ఎందుకొచ్చావో నాకు తెలీదు. పైగా హద్దు మీరి మాట్లాడుతున్నావు. మర్యాదగా వెళ్ళిపో" అంటూ కళ్ళు ఎగరేస్తూ మాట్లాడుతుంటే.. రయ్యిన బయటకొచ్చాడు నీరజ బాయ్ ఫ్రెండ్.. నన్ను తరిమేయాలనే ఆవేశంలో కాబోలు.

ఖంగుతింది నీరజ. నూవ్వెందుకొచ్చావ్ అన్నట్లుగా ఉరిమి చూసింది.

“ఒక్కర్తనే ఉన్నానన్నావుగా.. ఇతనెవరు?” అంటూ ప్రశ్నించాను.

“నీకన్నీ చెప్పాలా.. అయినా నాకు భయమేంటి? .. ఇతను నా బాయ్ ఫ్రెండ్”

“మరి నేను మీ అమ్మగారి బాయ్ ఫ్రెండునంటే నీకు కోపమెందుకొచ్చింది?..” అంటుంటే గుమ్మం తెరుచుకుంది.

ఎదురు గా.. నీరజ పేరెంట్స్. నేనూ నెమ్మది పడ్డాను.

“నమస్కారం సార్.. నమస్కారమమ్మా..” అంటూ నేను లేచి వారిరువురికి అభివాదం చేసాను.

నీరజ బాయ్ ఫ్రెండ్ సుడిగాలిలా బయటికి పరుగు లంఘించుకున్నాడు.

“ఏమీ తప్పు చేయడం లేదుకదా.. ఎందుకలా నీ బాయ్ ఫ్రెండ్ పారిపోతున్నాడు?” అంటూ ప్రశ్నిస్తుంటే నీరజ ముఖం పాలిపోయింది.

సారంగపాణిగారు తల దించుకున్నాడు.

సరోజగారు పారిపోతున్న అబ్బాయిని తదేకంగా చూడ సాగింది.

“చూడమ్మా.. నీరజా.. నీ మూలాన తల్లిదండ్రులను తలెత్తుకోలేకుండా చేస్తున్నావ్. నిన్ను పెంచి పెద్దచేసినందుకు నువ్వు వారికిచ్చే బహుమానమిదేనా?..

నేను మీ అమ్మ గారి బాయ్ ఫ్రెండునంటే నీకు విపరీతమైన కోపమొచ్చింది. నీ పెళ్ళయ్యాక కూడా నీ భర్తకు ఇతడు నా బాయ్ ఫ్రెండ్ అని పరిచయం చేయగలవా?.. చేయలేవు. మన సంస్కృతి అడ్డొస్తుంది. ఒక వేళ సంస్కృతిని కాల రాచి పరిచయం చేసినా నీ కాపురం నిలబడుతుందనే గ్యారెంటీ లేదు.

ఫ్రెండ్ అంటే స్నేహితుడా.. స్నేహితురాలా అనే సందేహం రాకుండా బాయ్ ఫ్రెండ్, గర్ల్ ఫ్రెండ్ అంటూ వాడుతున్నాం. స్నేహితుల్లా మెలగడం తప్పులేదు. కాని అలా మెలగడం లేదు.. పరిధులు దాటుతున్నారు. స్నేహితుడు అంటే వేరు.. బాయ్ ఫ్రెండ్ అంటే వేరు అనే అర్థాలు వచ్చేలా నేటి యువత ప్రవర్తిస్తోంది. దాని మూలాన  బాయ్ ఫ్రెండ్ అంటేనే అదోరకమైన చెడు అభిప్రాయం మనలో స్థిరపడిపోయింది..” అంటూ చిన్న పాటి ఉపన్యాసమిచ్చాను.

సారంగపాణిగారు  మౌనంగా వింటున్నాడు. సరోజగారు, నీరజను తీసుకొని లోనికి వెళ్ళింది. నీరజతో గుస, గుస లాడుతోంది.. నాకు అద్దంలో కనబడతోంది.

“సార్.. నేనే మీకు ఫోన్ చేసాను. నా బావమర్ది వాసు పెళ్ళిసంబంధం గురించి. మీరు ఊరెళ్తున్నామన్నారు. అనుకోకుండా దిల్ సుఖ్ నగర్ వెళ్ళాల్సి వచ్చింది. దారిలోనే కదా.. ఒక సారి మీ ఇల్లు చూసినట్లుంటుందని వచ్చాను” అంటూ నా పరిచయం చేసుకున్నాను. “సారీ సార్..మీకు ఇబ్బంది కల్గించాను”

“అదేం లేదు బాబు.. మాకు ట్రైన్ మిస్సయ్యింది. తిరిగి వచ్చేసాం...”  అంటూ సారంగపాణిగారు సంభాషణను ఎలా పొడిగించాలా అని అమాయకంగా మాటలు వెదుక్కుంటున్నాడు.

ఇంతలో సరోజగారు  హాల్లోకి వస్తూ.. “మా నీరజ నిప్పు బాబూ.. ఇంతకు ముందు వచ్చిన అబ్బాయి మా నీరజ క్లాస్ మేటు. నోట్స్ అడిగి తీసుకోడానికి అప్పుడప్పుడు వస్తూంటాడు.. మీరు అపార్థం చేసుకోవద్దు” అంది. ఎంతైనా తల్లి గదా.. బిడ్డని వేనుకేసుకు రావడం సహజం.

తల్లి తనకు సపోర్ట్ చేస్తుంటే లోన నీరజ ‘హమ్.. తుమ్.. ఏక్ కమ్రే మె బంద్ హో...’ అన్నట్లు డాన్స్ చేస్తోంది.. అద్దం అందంగా చూపిస్తోంది.

“నేను అబద్ధమాడినా అద్దం అబద్ధమాడదు కదమ్మా.. ఇలా వచ్చి నా కుర్చీలో కూర్చొని అద్దం వంక చూడండి..  మీ అమ్మాయి చేష్టలు నాకెలా కంట పడ్డాయో మీకర్థమవుతుంది. ” అంటూ నేను లేచాను.

సరోజగారు  సందేహిస్తూ కూర్చుంది.. అద్దం వంక చూస్తోంది.. పక్క గదిలోని నీరజ నిజ స్వరూపం అద్దంలో ప్రతిబింబిస్తోంది.. ఆమె ముఖం వివర్ణమౌతోంది.. ఇంకా నేను అక్కడే ఉండటం సమంజసం కాదని సారంగ పాణి వద్ద సెలవు తీసుకొని బయటపడ్డాను.




స్త్రీణామాద్యం..ప్రణయవచనం విభ్రమో హిప్రియేషు”

స్త్రీలు ప్రియుల విషయమై తమ భావాలను విభ్రమములతోనే ..అంటే శరీర విన్యాసములతోనే ప్రకటిస్తారు తప్ప నోటి మాటలతో ప్రకటించరు. దానినే మనం ఈనాడు ఓ మోడ్రన్ ట్రెండ్ గా “బాడీ లాంగ్వేజ్ “ అంటూ విర్రవీగుతున్నాం.దాదాపు పద్నాలుగు వందల సంవత్సరాల క్రిందటే” కాళిదాసు మహాకవి” తన మేఘసందేశం లో వివరించారు.

స్త్రీలు సున్నిత మనస్తత్వం కలిగి వుండడమే దీనికి ముఖ్య కారణం కాదు. తమకు ప్రకృతి సహజంగా సంక్రమించిన ఆకృతిని ..అందమైన భంగిమలలో బంధించి ..ఎటువంటి భావాన్నైనా శరీర విన్యాసంతో వ్యక్తం చేయగల సామర్ధ్యాన్ని కలిగి వుండడమే.

అందుకే అన్నారో మహాకవి “కళ్లెత్తితే చాలు కనకాభిషేకాలు.”.అని.

సీనియర్ ఇంటర్ స్టూడెంట్స్ కు లెసన్ చెప్తున్న తెలుగు లెక్చరర్.. శ్రీరమణ..గొంతది.

స్టాఫ్ రూం ప్రక్కనే ఆ క్లాస్ రూం వుండడం..ఆ నాలుగో పీరియడ్ నాకు లీజర్ కావడంతో రమణ చెప్పే పాఠాలన్నీ నా చెవిని పడుతూనే వుంటాయి.

దాదాపు టూ యియర్సయి పోతోంది..రమణ కాలేజి కొచ్చి.

ఇంగ్లీష్ బిఏ చేసి..తెలుగు బాషమీదున్న అభిమానంతో తెలుగు ఎంఏ చేసి..లెక్చరర్ గా జాయినై పోయాడని..ఇప్పటికో వంద సార్లు రికార్డ్ పెట్టేసింది వాణి..ద గ్రేట్ ఇంగ్లీష్ లెక్చరర్ ఆఫ్ దిస్ కాలేజ్ అండ్ ..మై ఒన్ అండ్ ఓన్లీ క్లోజ్ ఫ్రెండ్

తనే కాదు మా కాలేజిలో ఎవరు నోరు విప్పినా ..సేమ్ డైలాగ్సే .స్టూడెంట్స్ కైతే ..మాస్టారు

కాదు ..మా..స్టారే! అతని కలుపుగోలు తనం..జంటిల్ బిహేవియర్..లైక్ చేయని వారు మా కాలేజిలో లేరనే చెప్పాలి. నాకు కూడా అతనంటే యిష్టమే.ఆ యిష్టం ఈ మధ్యే అదీ డాడీ లెటర్ వచ్చాక ఓ ప్రత్యేకతను సంతరించుకొని..హరివిల్లులా ఆకర్షణీయమవుతోందని అర్ధ మవుతోంది.

ఎంఏ సోషల్ సైన్సెస్ చేసిలెక్చరర్ గా స్థిర పడినప్పటి నుండి మమ్మీ డాడీలు పాడుతున్న పెళ్లి పాట వినాలనిపిస్తోంది.

ఆస్తి అంతస్తులున్న కుటుంబం మాది.ఆ ఆస్తికి నేనొక్కదాన్నే వారసురాల్ని.అందం విషయానికొస్తే "కాకి పిల్ల..సామెతలా "..నా అందం నాకే ముద్దోస్తుంటుంది..ఎప్పుడు బాత్ రూం మిర్రర్ ముందు నిలబడినా. నా ఫ్రండ్ వాణి కెప్పుడూ నా అందంమీదే ధ్యాస.

ఏయ్ శిరీషా.!.నువ్వీ చదువుల తల్లి వేషం మానేసి ..ఏ సిల్వర్ స్క్రీనుకో ..బుల్లి తెరకో ట్రాన్స్ ఫరైపోయి" మేరా శిరీష మహాన్"

అనుకుంటూ మేమంతా గర్వ పడేలా..చేయవే బాబూ అంటూ టైం దొరకితే చాలు వాయించేస్తూ వుంటుంది.

పెళ్లైపోయి ఇద్దరు భావి భారత పౌరుల్ని పొలోమంటూ కనేసినా..దాని చిలిపి తనం మాత్రం తగ్గలేదు.

వాణే తొలిసారిగా రమణమీద ఓ అభిప్రాయం కలిగేలా చేసింది.

ఆ రోజు కాలేజి డే.ఫుల్ సూట్ లో రేమండ్ మోడల్లా తయారైన రమణ ఆ ఫంక్షన్ ను కండక్ట్ చేసిన తీరు అమోఘం.అదే స్టేజిమీద ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ తంతంతా నేనే నిర్వహించాను.

ఆ గొడవంతా అయిపోయాక హమ్మయ్య అనుకుంటూ..వాణి ప్రక్కన సెటిలౌతుండగానే మొదలు పెట్టింది. "అదీ మేడ్ ఫర్ ఈచదరంటే "అంటుంటే..అర్దంకాని గాని నేను తెల్లముఖం పెట్టేస్తే ..ఓయ్ పిల్లా !..ముఖాన్ని అంతగా..వైట్ వాష్ చేసుకోకు.నిన్నూ రమణల్ని అలా స్టేజ్ మీద చూస్తూ..

ఏ" సింగపూరో..స్విట్జర్లాండో "వెళ్లి పోయి..ఓ డ్యూయట్ ఊహించేసుకుందామని ట్రై చేసి ఫెయిలైపోయి..చివరకు శిరీషా రమణా ! వెన్నార్యుగివింగ్ పప్పన్నం విందో అని అడిగేద్దామనే నిర్ణయాని కొచ్చేశాను అన్న మాట.

తన మాటలు వింటుంటే తొలి సారిగా సిగ్గనిపించింది.

ఆహా ఏం ఫ్లూయన్సే బాబూ..ఇంగ్లీష్ ..తెలుగు ..రెండు లేంగ్వేజెస్..అదరహో..కుర్రాడు ఇంపోర్టెడ్ చాకులా వున్నాడు..నువ్వు స్పాట్ పెట్టెయ్ నేను బత్తీ బర్న్ చేసేస్తా.. అంటూ విజృంభిస్తున్న..దాని వాక్ ప్రవాహాన్ని ఆపకపోతే ..అక్కడే ఓ బహిరంగ సభ..ఏర్పాటు చేసేలా వుందని పించి ఆ విషయాలు తర్వాత మాట్లాడుదాం..ఇప్పుడెవరి చెవిలో నైనా పడిందంటే..ప్రత్యేకహోదా..విషయంలా..వైల్డ్ ఫైర్ అయిపోతుంది ఇప్పూడు ఆపవే ప్లీజ్.. అంటూ నోరు మూసెయ్య బోతుంటే ..

చిలిపిగా నవ్వి..చిన్నగా కన్నుకొట్టి

అయితే అమ్మాయి గారు ఆల్రెడీ..ట్రాక్ లోనే వున్నారన్న మాట..బెస్టాఫ్ లక్కే పిల్లా..ఆరోజైనా రమణబాబుని పంచెకట్టులో చూసే భాగ్యం దక్కుతుంది..ఎప్పుడు చూసినా ..జీన్సూ టక్కులేగా.

ఆ సంఘటన తర్వాతే రమణని నిశితంగా గమనించడం మొదలు పెట్టాను.అతని సిన్సియారిటి ప్రొఫెషన్ మీద అతనికున్న

డెడికేషన్..నాకు ఎంతగానో నచ్చాయి . గుడ్ నేచరున్న..గుడ్ గై అన్న నిర్ణయాని కొచ్చేశాను.

క్లాసైపోయినట్లుంది..స్టూడెంట్స్ గోలతో నా ఆలోచన్లకు..బ్రేక్ పడింది.తేరుకుని చూస్తే..ఎదురుగా విజయ.లేబ్ అసిస్టెంటుగా పని చేస్తున్న విజయంటే నాకో ప్రత్యేకమైన అభిమానం.ఎంత పొలైట్ గా బిహేవ్ చేస్తుందంటే..ఇలాంటి అమ్మాయి కూతురు గానో ..చెల్లెలి గానో వుంటే ఎంత అదృష్టమో అనుకునేంత. ఆ అమ్మాయిని ఎప్పుడు చూసినా శరత్ నవలా నాయకి లానే అనిపిస్తుంటుంది.మంచి ముహూర్తం లేదని ..పెళ్లి తర్వాత ర్పాటు చేసిన శోభనానికి వస్తూ ఆటో యాక్సిడెంటులో ప్రాణాలుకోల్పోయాడు విజయ భర్త . కాలేజ తోటమాలిగా పనిచేస్తున్న విజయ తండ్రి అభ్యర్థనను మన్నించి..విజయను లేబ్ అసిస్టెంట్ గా నియమించింది కాలేజ మేనేజ్ మెంటు.అందం అణకువలున్న విజయ విషాధ కావ్యంలా మిగిలి పోయింది.

మేడం ! ఓపెన్ యూనివర్సిటీ బిఏ చదవమంటున్నారు శ్రీరమణ సర్.మిమ్మల్నడిగితే సబ్జక్ట్ సజస్ట్ చేసి తగిన సలహాలుకూడా యిస్తారని ..మిమ్మల్ని కలవమన్నారు శ్రీరమణసర్.

విజయ మాటలకు చెప్పలేనంత ఆనందం కలగింది.అటువంటి ఐడియా నాకు రానందుకు సిగ్గనిపించింది.,ష్యూర్ విజయా..నేను చేసిన సబ్జక్ట్ లో చేస్తానంటే..నోట్సుతో బాటు..సబ్జక్ట్ లో హెల్ప్ కూడా చేస్తాను..రమణసర్ కి ఈ ఐడియా రావడం నిజంగా గ్రేట్.. మనస్పూర్తిగా అన్నాను.

ఔను మేడం శ్రీరమణ సర్ మన కాలేజిలో పని చేయడం ..పిల్లల అదృష్టం మాత్రమే కాదు..నాదికూడా..మళ్లీ కలుస్తాను మేడం.

రమణా యువార్ గ్రేట్ యార్ ..అనుకోకుండా వుండలేక పోయాను.రమణలాంటి వ్యక్తి జీవిత భాగస్వామైతే? నవ్వుకుంటూ నాన్న రాసిన లెటర్ మరోసారి చదువుదామని తీసుకున్నాను.

అమ్మా శిరీ.!.నీ అభిప్రాయం కోసమే ఈ ప్రపోజల్.మీ కాలేజ లెక్చరర్ శ్రీరమణ గురించి నీ అభిప్రాయం రాస్తే నేను వాళ్ల అమ్మా నాన్నలతో మాట్లాడి విషయాలు తెలియ పరుస్తాను.కట్న కానుకలు ఆశించని ఆదర్శ కుటుంబం వారిది..చేతిలో లెటర్నెవరో లాక్కున్నట్లు అనిపించి చూస్తే వాణి.నేను రియాక్టవకముందే లెటరంతా చదివేసి.. అయి తే అమ్మాయి గారి లవ్ స్టోరీ ఫాస్ట్ ట్రాక్ లో పరుగెడులోందన్న మాట.కంగ్రాట్స్ ఐశ్వర్యారాయ్.. అంటూనే రెండు బుగ్గలూ చిదిమేసి ..నుదుటిమీద ముద్దు పెట్టేసింది. ఏం మాట్లాడాలో అర్ధం గాక మౌనవ్రతం పాటించాను.

ఏయ్.. ఏంటే శిరీ!..అలా డల్లయి పోయావ్. కుదిపేస్తూ అడిగింది.

ముందు రమణ మనసు తెలియాలి కదా ? ..నెమ్మదిగా నా అనుమానాన్ని వ్యక్తం చేశాను. ఆహా.. మరీ యింత చెత్త అనుమానమా?..అందము ప్రాయము ఐశ్వర్యమున్న నీ లాంటి అమ్మాయ దొరికితే ఎగిరి గంతేయని పురుష పుంగవు డెవరే..నీ ప్రపోజల్ కి రమణబాబు టై పీక్కో పోతే చూడు. తేలికగా కొట్టి పడేసింది.కానీ నేనంత ఈజీగా తీసుకో లేక పోయాను. చివరకు తనే ఓ పథకాన్ని రచించి ..నెక్స్ట్ సండే అమలు చేయాలని డిసైడ్ చేసేసింది.

*** *** ***

"ఆదివారం"

వాణి ప్లాను ప్రకారం మధ్యాహ్నమే తన ఇంటకెళ్లి ..తన బెడ్ రూంలో సెటిలై పోయాను.డ్రాయింగ్ రూం ప్రక్కనే బెడ్ రూం వుండడం వలన హాల్లోని సంభాషణంతా క్లియర్ వినొచ్చు.సాయంత్రం నాలుగవుతుండగా వచ్చాడు రమణ.వాణి తన హబ్బీని లిటిల్ రాస్కెల్స్ ని పరిచయం చేసింది.టీ బిస్కెట్స సర్వ్ చేసి.. క్యాజువల్ గా కాలేజి విషయాలు..లెక్చరర్ ల గురించి ప్రస్తావించి..చివరగా నా గురించి టాపిక్ ఎత్తింది.నా గురించి తన అభిప్రాయాన్ని అడిగింది.బెడ్ రూం లో వున్న నాకు నా హార్ట్ బీట్ డీటియస్ లెవెల్లోకి మారిపోయందని అర్థమై పోయింది.

వాణీ మేడం ! శిరీషా మేడం గురించి నేను కామెంట్ చేయడమా?..మరీ జోకులేయకండి.మన కాలేజి లెక్చరర్లలో షి ఈజ్ మోస్ట్ ఎఫిషియంట్ అండ్ బ్యూటిఫుల్ . ఆమెని లైక్ చేయని వారు మన కాలేజిలో ఎవరూ లేరు మేడం.

ఆ కామెంట్ నా గుండె నిండా ఆక్సిజన్ ని పంప్ చేసేసింది.గుండె చప్పుడు నార్మల్ కొచ్చేసింది.

శిరీషది మీదీ ఒకేకులం అని విన్నాను.వాళ్ల నాన్న గారు తనకు మ్యారేజి చేయాలని..కట్నకానుకలు నీ ష్టం.నీ అభిప్రాయం చెపితే..

మేడం కులాల కట్నాల ప్రసక్తి వద్దు.నా అభిప్రాయం రేపు కాలేజి లో మీకే తెలుస్తుంది.సీ యూ మేడం..

రమణ వెళ్లి పోవడం నాకు తెలుస్తూనే వుంది.హడావుడిగా వచ్చిన వాణి గుడ్ లక్కే మేనకా..శ్వామిత్తుడు..ఆల్రెడీ తపస్సు ఫినిష్ చేసేసి నట్లున్నాడే.

తనకేం సమాధానం చెప్పాలో అర్ధంగాని నేను సరాసరి ఇంటికొచ్చి బెడ్ మీద వాలిపోయాను.

***          ***

మర్నాడు కాలేజికి డుమ్మా కొట్టేద్దామనుకుంటూనే రేపు కాలేజిలో మీకే తెలుస్తుంది మేడం అన్న రమణ మాటలు గుర్తొచ్చి ..కాలేజి కొచ్చి కూడా అన్యమనస్కంగా ప్రేయర్ కి కూడా అటెండవకుండా స్టాఫ్ రూంలోనే వుండిపోయాను.కందిరీగల తుట్టెలా వుంది..మనసు.

ప్రేయరైపోయినట్లుంది.మైక్ లోంచి రమణ వాయిస్ వినిపించింది.

గౌరవనీయ ప్రిన్సిపల్ గారూ..తోటి సహోధ్యాయులు మరియూ నా ప్రియమైన..విద్యార్ధులారా..

ఆదర్శం కోసమో అభ్యుదయం కోసమో నేనీ నిర్ణయం తీసుకోలేదు.జాలితోనో ..ఆమెను ఉద్ధరించాలనో     నేనీ పెళ్లి చేసుకోవడం లేదు.ఆమె యిష్టానుసారమే..మన లేబ్ అసిస్టెంట్ విజయను మీ అందరి సమక్షంలో వివాహం చేసుకుంటున్నానని మనవి చేస్తూ మీ అందరి ఆశీస్సులను..సహకారాన్ని కోరుకుంటున్నాను.

కరతాళధ్వనులతో కాలేజ మారుమోగి పోయింది.విజయ పేరు వినిపించగానే అప్పటి వరకు నన్ను ఆవరించివున్న..నిరాశ..నిస్పృహలు పటాపంచలమై పోయాయి.కనులముందు కళ్యాణ తిలకంతో విజయ సాక్షాత్కరించింది.మనసు మల్లెలమేఘమై..ఆనందంతో ఆకాశాన్ని తాకిన అనుభూతిలో శరీరం పులకరించి పోయింది.నాప్రమేయం లేకుండానే ఆనంద భాష్పాలతో..నా కనులు కాసారా లయ్యాయి.

రమణా యువార్ గ్రేట్ ..అనుకుంటూ నిలబడి అంజలి ఘటిస్తుంటే ఎదురుగా గోడమీదున్న కందుకూరి వారు..చిరునవ్వులు చిందిస్తూ ..వధూవరులను ఆశీర్వదిస్తున్న అనుభూతి కలిగింది.




ఊరు చివర ఇల్లు. ఒంటిరగా నిస్తేజంగా జాలిగా ఉంది. ఇల్లు చాల పాత బడి పోయింది. గోడలకు పెచ్చులు ఊడి పోయాయి. చాల సంవత్సరాల నుంచి సున్నం వెయ్యక పోవటం రంగు వెలిసిన బొమ్మలా ఉంది. హాలులో కూర్చుని ఏదో పుస్తకం చదువుతోంది ఒక యాభై సంవత్సరాల స్త్రీ. సన్నగా పొడుగ్గా ఉంది. రంగు వెలిసిన చీర. అక్కడక్కడ చినిగిన జాకెటు. ఆమె పరిస్థితిని చెప్పకనే చెప్పుతున్నాయి.

ఒక వైపు పుస్తకం చదువుతునే ఇంకో వైపు గుమ్మం వైపు ఆత్రంగా చూస్తోంది. ఆవిడ ఎవరి కోసమో ఎదురుచూస్తున్నట్టుగా ఉంది. ఒక రోజు నుంచి కాదు. రెండు రోజుల నుంచి కాదు. నెలల నుంచి కాదు. సంవత్సరాల నుంచి ఎదురుచూస్తోంది. ప్రతి రోజు ఆ మనిషి తప్పకుండ తనని వెతుక్కుంటు వస్తాడని నమ్ముతోంది. కాని రోజులు సంవత్సరాలు గడిచిపోయాయి. కాని ఆమె ఎదురుచూస్తున్న మనిషి మాత్రం రాలేదు. అయిన ఆమె ఆశ వీడలేదు. ఈ రోజు కాకపోయిన రేపయిన వస్తాడని ఆవిడకు తెలుసు. అందుకే ప్రాణాలు బిగ పట్టుకుని అతని కోసం ఎదురు చూస్తోంది.

నిజానికి రాజేశ్వరి ఏమంత పేదది కాదు. ఆవిడుకు కొద్దో గొప్పో ఆస్తి పాస్తులు ఉన్నాయి. సొంత ఇల్లు ఉంది. బ్యాంకులో కొంచం డబ్బు ఉంది. దాని మీద వచ్చే వడ్డీ ఆమె జీవనాధారానికి సరి పోతుంది. డబ్బు కోసం ఆమె ఎవరి మీద ఆధార పడ వలసిన అవసరం లేదు. ఆమెకు ఉన్నది ఒక్కగా నొక్క కొడుకు. రెండు సంవత్సరాలకు ముందు అతను అకస్తాతుగా చని పోయాడు.

దాంతో ఈ ప్రపంచంలో ఆమె పూర్తిగా ఒంటరిదై పోయింది. భర్త చాల కాలం క్రితం చని పోయాడు.

కొడుకు పోయిన తరువాత రాజేశ్వరి పరిస్థితి బాగా మారి పోయింది. అతని చావు ఆమెలో బలమైన ప్రభావం చూపించింది. ఆ షాక్ నుంచి దాదాపు దాదాపు నెల రోజుల వరకు కోలుకో లేక పోయింది. తరువాత మెల్లగా తేరుకుంది. కాని మునుపటి ఉత్సాహం ఆమెలో క్షీణించింది. నిజానికి ఆమె మంచి బట్టలు కొనుక్కోవచ్చు. ఇంటిని బాగు చేసుకో వచ్చు. కాని అది ఆమెకు ఇష్టం లేదు. కారణం ఏమిటో ఎవరికి తెలియదు. చుట్టు పక్కల వాళ్ళు ఎన్నిసార్లు అడిగిన ఆమె జవాబు చెప్పేది కాదు. నవ్వి ఊరుకునేది.

ఆమె ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ తలుపు మీద చప్పుడు వినిపించింది. పుస్తకం టిపాయ్ మీద పెట్టి వెళ్ళి తలుపు తెరిచింది రాజేశ్వరి. గుమ్మం దగ్గర ఒక యువకుడు కనిపించాడు. ముప్పై సంవత్సరాలు ఉంటాయి అతనికి. పొడుగ్గా బలంగా ఉన్నాడు. తన పేరు ప్రసాద్ అని పేపర్ లో ప్రకటన చూసి వచ్చానని చెప్పాడు.

రాజేశ్వరి అతన్ని సాధరంగా లోపలికి ఆహ్వానించింది. మాములు ఫార్మాలిటిస్ పూర్తయిన తరువాత ఇంటి దర గురించి ప్రసక్తి వచ్చింది.

“చూడు బాబు. ఈ ఇంటిని పదిహేను లక్షలకు అమ్మాలని అనుకుంటున్నాను. నీకిష్టమైతే చెప్పు అగ్రిమెంట్ రాసుకుందాం” అంది రాజేశ్వరి.

“చాల ఎక్కవ. ఈ పాడు పడిన ఇంటికి పదిహేను లక్షలా. ఎవరైన వింటే నవ్వి పోతారు. ఆశకు అంతు ఉండాలి. అంత ఇచ్చుకో లేను కాని అయిదు లక్షలు ఇవ్వ గలను” అన్నాడు ప్రసాద్. రాజేశ్వరి ససేమిరా అంది. ప్రసాద్ ఎంత నచ్చ చెప్పటానికి ప్రయత్నించిన ఆవిడ లొంగ లేదు. పదిహేను లక్షలకు ఒక పైసా తగ్గనని చెప్పింది.

ఇక చేసేది ఏం లేక ప్రసాద్ వెళ్ళి పోయాడు. వచ్చిన పార్టీ వెళ్ళి పోయినందుకు ఆమె పెద్దగా బాధ పడ లేదు. తను కోరుకున్న డబ్బుకు ఇల్లు అమ్ముడు అవుతుందని ఆమెకు పూర్తి నమ్మకం ఉంది. రెండు రోజుల తరువాత ఆమె ఊహించినట్టుగానే జరిగింది. ఇల్లు కొనుక్కోవటానికి ఇంకో వ్యక్తి వచ్చాడు. తన పేరు రంగారావు అని చెప్పాడు. రాజేశ్వరి చెప్పిన రేటు విని అతను కొంచం కూడా ఆశ్చర్య పోలేదు. అలాగే ఇస్తానని ఒప్పుకున్నాడు.

“నేను ముంబాయి నుంచి వచ్చాను. హోటల్ లో దిగాను. రేపు డబ్బు అగ్రిమెంట్ కాగితాలు తీసుకు వస్తాను. సిద్ధంగా ఉండండి”

అని చెప్పి రంగా రావు వెళ్ళి పోయాడు. రాత్రి రాజేశ్వరి అతని హోటల్ కు కాల్ చేసింది.

“చూడు బాబు నా నిర్ణయం మార్చుకున్నాను. పదిహేను లక్షలు కాదు. పాతిక లక్షలు ఇస్తే ఒప్పుకుంటాను” అంది చావు కబురు చల్లగా చెప్పుతున్నట్టు.

“అదేమిటి ఉదయం పదిహేను లక్షలు అన్నారు. నేను దానికి ఒప్పుకున్నారు. ఇప్పుడు పాతిక లక్షలు అంటున్నారు. ఇది అన్యాయం. దయచేసి పదిహేను లక్షలకు ఒప్పుకోండి. ఇదే కదా మన మధ్య జరిగిన ఒప్పందం” అన్నాడు రంగారావు.

“నేను మాట అంటే మాటే. పాతిక లక్షలకు ఒక్క పైసా తగ్గను. నీకు ఇష్టమైతే కొనుక్కో. లేక పోతే మానుకో. నేను ఇంకో మనిషిని చూసుకుంటాను”అంది రాజేశ్వరి తీక్షణంగా.

“వద్దు లెండి అంత మాట ఎందుకు. పాతిక లక్షలు ఇస్తాను. కాని దయ చేసి ఈ రేటు మీద నిలబడండి” అన్నాడు రంగా రావు.

మరునాడు ఉదయం రంగారావు డబ్బు సంచితో అగ్రిమెంట్ కాగితాలతో వచ్చాడు.

“ఇదిగో మీరు అడిగిన డబ్బు. ఇవి అగ్రిమెంట్ కాగితాలు. వీటి మీద మీరు సంతకం పెడితే డీల్ అయి పోతుంది. నాకు ఎంత తొందరగా ఇల్లు స్వాధీనం చేస్తే అంత మంచిది” అన్నాడు రంగారావు.

“అలాగే ముందు ఇద్దరం కలిసి టీ తీసుకుందాం. ఆ తరువాత కాగితాల మీద సంతకం పెడతాను” అని చెప్పి రెండు టీలు తీసుకువచ్చింది. ఒక కప్పు అతనికి ఇచ్చి రెండోది తను తీసుకుంది. అతను టీ గబ గబ తాగి కప్పు టీపాయ్ మీద పెట్టాడు.

అంతే అతనికి తల గిర్రున తిరిగినట్టుగా అయింది. గుండెల్లో ఏదో మంట మొదలయింది. ఊపిరి పీల్చటం చాల కష్టమైంది. రెండు క్షణాలు చిత్రవధ అనుభవించి తరువాత అతను తల వాల్చేశాడు. రాజేశ్వరి మెల్లగా అతని దగ్గరికి వెళ్ళి చూసింది. చని పోయాడని నిర్ధారణ చేసుకున్న తరువాత గబగబ బాత్రూం కోలి వెళ్ళింది. శుభ్రంగా స్నానం చేసి మంచి బట్టలు వేసుకుంది. చని పోయిన రంగా రావు ముందుకు వచ్చి నిలబడి అంది.

“నాకు ఉన్నది ఒక్కగానొక్క కొడుకు. వాడు బాగానే చదువుకున్నాడు. కాని చెడుస్నేహం వల్ల బాగా చెడి పోయాడు. ముంబాయి స్మగ్లర్స్ తో వాడికి స్నేహం ఏర్పడింది. నువ్వు వాడి పార్టనర్ వి. మీరిద్దరు కలిసి వజ్రాలు స్మగ్లింగ్ చేసేవారు. ఇలాంటి తప్పుడు పనులు చెయ్య వద్దని మా వాడికి ఎన్నో సార్లు చెప్పాను. కాని వాడు వినిపించుకో లేదు. ఒక రోజు అర్ధ రాత్రి నువ్వు వాడు కలిసి ఈ ఇంటికి వచ్చారు.

ఆ సమయంలో ఇంట్లో కరెంటు లేదు. అంతా చీకటిగా ఉంది. నిన్ను పూర్తిగా బాగా చూసే అవకాశం లేక పోయింది. మీరిద్దరు నాకు ఎదురుగా ఉన్న గది లోకి వెళ్ళి తలుపులు లోపల నుంచి గడియ వేసుకున్నారు. ఆ రోజు మీరిద్దరు భోజనం కూడా చెయ్య లేదు. ఒక గంట తరువాత నువ్వు బయటకు వెళ్ళి పోయావు. మళ్ళీ రెండు గంటల తరువాత తిరిగి వచ్చావు. ఆ క్షణం నుంచి మీ మద్య గొడవ అయింది. మీరు దొంగలించి తెచ్చిన వజ్రాల కోసం గొడవ పడుతున్నారని నాకు అర్ధమైంది. నువ్వు కోపంతో నా కొడుకు గొంతు పిసికి చంపేశావు. నేను ఎక్కడ పట్టుకుని పోలీసులకు అప్పగిస్తానని నీకు భయం వేసింది. అందుకే పారి పోయావు.

“కాని తప్పకుండ నువ్వు తిరిగి వస్తావని నాకు తెలుసు. ఆ వజ్రాల కోసం తప్పకుండ తిరిగి వస్తావని నాకు నమ్మకం. అందుకే ఈ ఇంటిని అమ్మకానికి పెట్టానని పేపర్ లో ప్రకటన చేశాను. నిజానికి ఈ ఇల్లు అయిదు లక్షలు కూడా చెయ్యదు. కాని వచ్చిన వాళ్ళందరికి పది లక్షలు అని చెప్పాను. అందరు నన్ను పిచ్చి దానిలా చూశారు. నేను అడిగిన మొత్తం బేరం చెయ్యకుండ ఎవరు ఇస్తారో వాడే నా కొడుకును చంపిన హంతకుడు. ఆ వజ్రాలు నా కొడుకు ఈ ఇంట్లో దాచాడని వాడి నమ్మకం. రెండు సంవత్సరాల నిరీక్షణ తరువాత నువ్వు వచ్చావు. పదిహేను లక్షలని చెప్పగానే బేరం చెయ్యకుండ ఒప్పుకున్నావు. ఆ రాత్రి నా కొడుకును చంపింది నువ్వే అని నాకు మెల్లగా అనుమానం కలిగింది. అది నిజమా కాదా తెలుసుకోవటానికి రేటు పెంచి పాతిక లక్షలు కావాలని అన్నాను. నువ్వు వెంటనే ఒప్పుకున్నావు. దాంతో నా అనుమానం పూర్తిగా తీరి పోయింది. ఒక నిజం చెప్పమంటావా. ఆ వజ్రాలు ఎక్కడ ఉన్నాయో నాకు తెలిసింది. సీలింగ్ ఫ్యాన్ కప్పులో ఉన్నాయి. నువ్వు చని పోయిన తరువాత ఆ వజ్రాలను పోలీసులకు అప్పగించాలని గట్టిగా నిర్ణయించు కున్నాను. అందుకే ఇన్ని రోజులు వాటిని నా దగ్గర జాగ్రర్తగా పెట్టుకున్నాను. నా పగ తీరింది. ఇప్పుడు నా కొడుకు ఆత్మకు తప్పకుండ శాంతి కలుగుతుంది”

సంతోషంతో ఒక్క సారిగా పగల బడి నవ్వింది రాజేశ్వరి. రెండు సంవత్సరాల తరువాత ఆమె సుధీర్ఘ నిరీక్షణకు తెర పడింది.




దసరారోజుల్లో సరస్వతీ దేవి పూజ చేసుకుంటే విద్యావృద్ధి, ఉద్యోగ వృద్ధి జరుగుతుందని అనాదిగా వస్తున్న నమ్మకం. ఈకాలం పిల్లలు ఫాషన్ల మోజులో ఎంత కొట్టుకుపోతున్నాగానీ, ఇంకా చాలామందిలో దైవం పట్ల భక్తి, నమ్మకం ఉన్నాయి. 'అమ్మా, నాన్నలు చెప్పేరుగా, కాసేపు దేవుణ్ణి ధ్యానించుకుంటే మనకి పోయేదేముంది? వస్తే ఏదో ఒక మంచి తప్ప' అన్న భావం ఉంది వారికి. అందుకే పర్వదినాల్లో చాలా గుళ్ళలో పెద్దవాళ్ళతో పాటూ పిల్లలూ కూడా కనిపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఆయా దేవాలయాల్లో నూటెనిమిది సార్లు ప్రదక్షిణం అన్న కార్యక్రమం కూడా చేపడుతున్నారు కొందరు పిల్లలు. మా పిల్లలది కూడా మరీ గొప్ప భక్తి కాకపోయినా, పర్వదినాల్లో వాళ్ళ అమ్మ ఎంత చెప్తే అంత.

మా పెద్దవాడు ఎం. టెక్ ఫైనల్ ఇయర్, చిన్నది ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో ఉన్నారు. ఎప్పటిలాగే కాస్త ముందుగానే మా ఆవిడ వాళ్ళని, పూజ ఉంది సిద్ధం కమ్మని చెప్పడం వల్ల, వాళ్ళూ తెల్లవారు ఝామునే లేచి, రెడీ అవసాగారు. దసరా సెలవులు సాధారణంగా గతంలో అన్ని స్కూళ్ళకీ, కాలేజీలకీ ఇచ్చేవారు. టీచర్ వృత్తిలో ఉన్నవాళ్లకి సరేసరి. దసరానే ఓ సరదా వాళ్ళకి. 30-40 ఏళ్ల క్రితం దసరా పాటలు, పద్యాలు పిల్లలకి నేర్పి, వాళ్ళతో ఇంటింటికీ వెళ్ళి, వాళ్ళచేత ఆ పాటలు,పద్యాలు పాడించి ఎంతో కొంత దసరా కట్నం (అదే రాను రాను వాళ్ళకి తప్ప మిగతావారికి దసరా మామూలు, లేక దసరా దండా అయిపోయిందనుకోండి!) తీసుకునే వారు ఉపాధ్యాయులు. ముఖ్యంగా "అయ్యవారికి చాలు అయిదు వరహాలు, పిల్లవాళ్లకి చాలు పప్పు బెల్లాలు" అని తప్పని సరిగా పాడించి, తమకు కట్నం, పాడిన పిల్లలకి పప్పుబెల్లాలు రాబట్టుకునే వారు. ఈ కాలం చదువుల్లో కాలేజీ వారీగా ర్యాంకుల కోసం రన్నింగ్ రేస్ వల్ల దసరా సెలవులు, సంక్రాంతి సెలవులు, వేసవి సెలవులు అన్నీ అంతరించి పోయాయి. ఆదివారాలు కూడా హాఫ్ డే స్పెషల్ క్లాసెస్ అని పిల్లల్ని హింస పెడుతున్న

కాలేజీలు కోకొల్లలు.     మా పిల్లలకి అతికష్టమ్మీద ఒక్క విజయదశమి నాడే సెలవు ఇచ్చారు. సరస్వతీ పూజ నాటికి సెలవు లేదు కనుక,     నేను ఆఫీస్ కి, పిల్లలు కాలేజీలకి వెళ్ళి పోవాలని ఉదయాన్నే పూజకి అన్నీ సిద్ధం చేసేసింది నా శ్రీమతి.

తీరా అన్నీ సిద్ధం చేసుకున్నాక, అరటిపళ్లు చాలవేమో నని మా ఆవిడకి సందేహం కలిగింది. ఫలితం! అరటిపళ్ళ కోసం నేను ఉదయాన్నే రోడ్డెక్కాను. మా ఇంటికి దగ్గరే బజారు, అయినా అంత ఉదయాన్నే ఎవరు దుకాణాలు తెరుస్తారు?తెరిచినా పళ్ల దుకాణాలు తెరవడం కొంచెం కష్టమే. అయితే అరటిపళ్లు తోపుడు బళ్ల వాళ్ళే     ఎక్కువ అమ్ముతారు కనుక,     వాళ్లెవరైనా దొరుకుతారేమోనని ప్రయత్నించేలోగానే, ఓ రెండు అరటిపళ్ల బళ్ళు కనబడ్డాయి. బహుశా, పర్వదినాలు కదా, ఉదయాన్నే నాలాంటి బేరగాళ్ళు కూడా తగుల్తారని వాళ్ళ నమ్మకం కాబోలు. అందుకని ఉదయాన్నే రెడీగా ఉన్నారు వాళ్ళు.

హమ్మయ్య! అనుకుని, ఓ బండి దగ్గరకి చేరాను. తీరా చూస్తే ఆ బండి దగ్గర ఓ చిన్నకుర్రాడు, బహుశా మూడేళ్ళుంటాయేమో, కూర్చుని ఉన్నాడు. దగ్గర్లో ఎవరూ కనబడలేదు, వెనకున్న ఓ టీ కొట్టులో ఒకరిద్దరు తప్ప. పక్కనే ఉన్న ఇంకో బండి వాడు నన్ను చూసి పిలుస్తున్నాడు, “అక్క డెవరూ లేరుగానీ, ఇట్రాండి బాబూ” అని .

కానీ ఆ కుర్రాడు నన్ను చూస్తూనే “ అమ్మా! బేరమొచ్చిందే! రావే! రావే!!” అని గట్టిగా అరవడం మొదలెట్టాడు, వెనకున్న టీ కొట్టు కేసి చూస్తూ. నేను పక్కనున్న బండి దగ్గరికి వెళ్ళేలోగానే,     ఆ అరుపులు విని,     ఆ టీ కొట్టు దగ్గర నిలబడి టీ త్రాగుతున్న ఓ ఆవిడ “వస్తున్నా.. వస్తున్నా…” అంటూ టీ గ్లాస్ తో సహా పరిగెట్టుకొచ్చింది.

నాకు ఆ చిన్నపిల్లాడిని చూస్తే ఆశ్చర్యమేసింది. ముచ్చటేసింది కూడా.     తన బండి దగ్గర కొచ్చిన వాడు అరటిపళ్లు కొనే బేరగాడు. ఆ బేరం పోకూడదని ఆ మూడేళ్ల వాడు తన తల్లిని పిలిచిన తీరు నన్ను ఆకట్టుకుంది.

“ఏమ్మా! నీ కొడుకా? భలే ట్రైనింగ్ ఇచ్చావు. ఇంత చిన్న వయసులోనే, బేరం పోకుండా భలేగా పిలిచాడు నిన్ను. ఇంతకీ డజనెంత? అనడిగాను ఆవిడని, అరటిపళ్లని పరీక్షిస్తూ. “అవును బాబూ. నా కొడుకే” అని నవ్వి, ‘డజను డెబ్భై బాబూ’ అని రేటు చెప్పింది ఆవిడ.

“మరీ డెబ్భై ఏమిటమ్మా? ఏభై చేసుకో” అన్నాను , ఇదే మా ఆవిడైతే డజను ఏ ముప్పై కో అడిగుండేది కదా, నా కంత ధైర్యం లేదనుకుంటూ.

‘మరీ అంత తేడా కిట్టదు బాబూ’ అని, మళ్ళీ     ‘ఓ అయిదు తగ్గించి అరవై అయిదివ్వండి’ అందామె. పర్వాలేదు. అయిదు

తగ్గింది కదా, నేనో అయిదు పెంచితే పోలా.. అనుకుని, సరే! ఏభై అయిదిస్తా.. ఓ డజనివ్వు " అన్నాను అదే ఫైనల్ అన్నట్టుగా.

ఇలాంటి బేరాల్లో మా బావమరిది మహా ఘటికుడు. ఇలాంటివే కాదు, ఎక్కడైనా బేరాలాడే సత్తా ఉన్నవాడు. తను వాళ్ళ స్వంతూరులో హై స్కూల్ లో మాథ్స్ టీచర్ గా చేస్తున్నాడు. ఓ సారి వాళ్ళ ఊరికి మేం వెళ్ళినప్పుడు ఓ హోటల్ కి తీసుకుపోయి, సుష్టుగా టిఫిన్ చేశాక బిల్ చెల్లించే ముందు, ఆ సర్వర్ కన్నా ముందే బోర్డ్ మీద రేట్లు చూసి, మేం తిన్నవాటికి ఎంతయిందో లెక్క కట్టి, దానికి ఓ పది తగ్గించి కౌంటర్ లో ఇచ్చాడు.

ఆ ఓనరు గారు సర్వర్ చెప్పిన దానితో ఆ డబ్బులు సరిచూసి, 'బాబూ! ఓ పది తగ్గించినారేటి?' అనగానే, మా బామ్మర్ది "సరిపోతుందోయ్. చిన్న పూరీలు, చల్లారిన కూర, ఇడ్లీల్లోకి పులిసిన చెట్నీ! ఇంతకీ..పొద్దున్నే రెడీ చేయలేక, నిన్నటిదే వేసేశారా ఏంటీ ఆ చట్నీ? అన్నాడు సీరియస్ గా. దాంతో సీన్ అర్ధమైపోయి, "అబ్బే! అలాగేం ఉండదు బాబూ. సర్లేండి. పదిరూపాయల కేవుంది. ఈసారొచ్చినప్పుడిద్దురు గానీ" అంటూ మావాడిచ్చిన డబ్బులు తీసుకున్నాడా ఓనరు, ఓడినా గెలిచినవాడిలా మొహం పెట్టి, ఇంకోసారి ఆటో ఎక్కి ఫలానా సెంటర్ కి పోనీ అని, అక్కడ దిగాక ఇరవై రూపాయల నోటు వాడి చేతిలో పెట్టి వెళ్లిపోతుంటే ఆ ఆటో అతను 'సార్! సార్! ముప్పై సార్' అనరవసాగాడు. "ఈ దూరానికి నీకెంతివ్వాలో నాకు తెలుసు.

మనిషికి పది. ఇద్దరం కనుక ఇరవై. లెక్క సరిపోయిందిలే. లేకపోతే ఓ పని చెయ్యి. ఓ అరగంట వెయిట్ చేస్తే మమ్మల్ని మళ్ళీ ఎక్కినచోటే దింపేద్దువుగాని, అటు ఇటూ కలిపి ఏభై ఇస్తా. ఓకేనా!" అననడంతో వాడు గొణుక్కుంటూ పోయాడు. అప్పట్నుండి మా బామ్మర్దిని బేరగాడు అని పిలుస్తూండేవాళ్లం. అలాంటి మహా తెలివితేటలు అసలుకే లేవు నాకు.

ఏభై అయిదుకి కూడా సంకోచిస్తున్న ఆమెని చూస్తూ, పూజ కి ఇప్పటికే ఆలస్యమైపోతోంది అనుకుంటూ, పోనీ ఆ అయిదూ కలిపేసి అరవై ఇస్తా అని అందామనే లోగానే, "అమ్మా! బోణీ బేరమే!" అన్నాడు మళ్ళీ ఆ పిల్లాడు.

ఇంకా ఆశ్చర్యపోయాను నేను. అంటే! 'ఇది బోణీ బేరం, కాస్త తక్కువైనా వదులుకోవద్దు' అని వాళ్లమ్మ కి హింట్ ఇస్తున్నాడా ఈ పిల్లాడు? ఏం బిజినెస్ మేనేజిమెంట్ కోర్సు తెల్సు విడికి? హాయిగా ఆడుకునే వయసులో తన తల్లితో పాటు ఈ పళ్ల బండి మీద కూర్చుని, రోజూ తన తల్లి చేస్తున్న వ్యాపారాన్ని నిశితంగా గమనిస్తున్నాడా? బోణీ బేరం పేరిట కాస్త వెనక్కి తగ్గి నష్టపోకపోయినా, లాభం కాస్త తగ్గించుకుంటే, తర్వాత అమ్మకాల్లో ఆ తగ్గిన లాభాన్ని పూడ్చుకోవడం ఎంతసేపు? ఈ టెక్నిక్ కూడా ఈ చిన్నవాడు ఒంట బట్టించుకున్నాడా అన్న అనుమానం వచ్చింది. ఏమైనా, వాణ్ని చూశాక నాకు ఇంక బేరమాడాలనిపించలేదు. ఆమె ఎంతంటే అంత ఇచ్చేద్దామనే అనుకున్నాను. కావాలంటే మా ఆవిడకి వాళ్ళు డెబ్బై అంటే.. ఏభై

కే తెచ్చా అని చెప్పేద్దాం గొప్పగా అని కూడా అనుకున్నా.

‘నేను చెప్పిన మాట విను’ అని మనం ఎవరితోనైనా అంటే.. అది వారిని భౌతికంగా వినమనే అర్థమే కాకుండా, ఆ మాటని మన్నించి అలా చెయ్యి అన్న అర్థం వస్తుందిగా!? అలాగే తన కొడుకు మాటలు విన్నట్టుగా, మన్నించినట్టుగా, “సర్లే బాబూ! బోణీ బేరం.” అంటూ డజను ఏభైఅయిదుకే ఇస్తున్నట్టుగా డజను పళ్ళు నేను ఎంచినవి తీసింది. ఈలోగా ఆ చిన్నోడు సగానికి చింపి రెడీగా ఉంచిన న్యూస్ పేపర్ ముక్క వాళ్లమ్మకి అందించాడు. ఆ కాగితం పొట్లం లో పళ్లని చుట్టి ఇచ్చిందామె. పాలిథిన్ కవర్ లేదా అని అడగబోయి, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే చర్య గా ఆమె చేస్తున్న పనిని మెచ్చుకుంటూ అరటి పళ్లని తీసుకుంటూ,

“ నాకు నీ కొడుకుని చూస్తే ముచ్చట గా ఉంది. ఇప్పటినుండే మీతో తిప్పుకుంటూ వాడికి వ్యాపారం ఎలా చేయాలో నేర్పుతున్నావా ? బాగుంది “ అన్నాను.

“ఏటి సేత్తాం బాబూ. వేరే పెద్ద దిక్కు లేదు. అందుకని ఆడు సంటోడుగా ఉన్నప్పట్నుండీ కూడా ఇలా బళ్ల మీద మాతో పాటే ఉంచుకుంటున్నాం. మావేమీ నేర్పకుండానే, మాతోనే ఉండీ అన్నీ చూస్తూ నేర్చుకున్నాడు కావాల. నేనిలా బండి కాణ్ణుంచి ఎప్పుడేనా అలా పక్కకెళ్ళగానే బండి కాడికి ఎవరొచ్చినా ఇలానే పిలవడం వొచ్చేసింది. ఎదవకి ముదురు మాటలు బాగానే వొచ్చేసినాయి” అందామె కొడుకుని మురిపెం గా చూసుకుంటూ.

“అవి ముదురు మాటలు కావులేమ్మా. కుదురు మాటలే. నీకీపాటి సాయంగా ఉంటున్నాడు అది చాలదూ. ఏదన్నా స్కూల్ లో వెయ్యి. బాగా వృద్ధి లోకి వస్తాడు.” అని వాడిని మెచ్చుకుంటూ ఓ ఉచిత సలహా కూడా పారేశాను.

“మా చదువులేపాటివి బాబూ. పెద్ద పెద్ద చదువులు చదివించే శక్తి మాకెక్కడిది? ఏదో వ్యాపారం చేసుకునేందుకు చాలే చదువైతే చదివిస్తాం గానీ. “ అందామె నిరాశ గా. ఒకరకంగా ఆమె చెప్పిన మాట నిజమే. “ ‘విద్యే వ్యాపారం’ గా మారిపోయిన ఈ రోజుల్లో, వ్యాపారం చేసుకోవడానికి సరిపడే విద్యని నేర్చుకుని ఇటువంటివాళ్ళు రాణిస్తున్నారు.

తమకున్న తెలివితేటలు సక్రమంగా వినియోగించుకోగలిగితే, ఆ కొద్దిపాటి ‘వ్యాపారవిద్య’ చాలు జీవితంలో రాణించడానికి.” అనుకుంటూ.. “పోన్లెమ్మా! ఏ చదువైనా బ్రతకడానికి అవకాశం కల్పించడానికే గా! నీకు చాతనైనంతే చదివించు. వాడి వాలకం చూస్తే వాడు ఎలాగైనా హాయిగా బ్రతికేస్తాడులే!” అని ఆమెకి భరోసా, వాడికి దీవెన లాంటిది ఇచ్చి ఇంటికి బయలుదేరాను




రామాపురంలో రాంబాబు ఒక వ్యవసాయ కూలి. చాలా పేదవాడైనా మంచి వాడు. అతడి ఒక్కగానొక్క కొడుకు సోంబాబు తండ్రి లా వినయ విధేయతలున్నవాడు. ఆఊరి సర్కార్ బళ్ళో ఐదో తరగతి చదువుతున్నాడు.ఆఊరి పెద్ద రైతు పద్దయ్య కొడుకు కార్తీక్ కూడ అదే బళ్ళో ఐదో తరగతి చదువు తున్నాడు. చదువులో ఇద్దరూ పోటా పోటీ గానే ఉంటారు. ఐతే కార్తీక్ కు తాను ధనవంతు ల బిడ్డనని బాగా గర్వం. పంతుళ్ళకే సరిగా నమస్కరించడు.ఇహ తోటిపిల్లల్ని చాలా చౌకగా చూస్తాడు . తన బట్టలూ,తనబూట్లూ చూసి అంతా తనను గౌరవిస్తారని అపోహ పడతాడు.

సోంబాబు చదువులోనే కాక ఆటల్లోనూ బాగా ముందుంటాడు. అన్ని ఆటల పోటీల్లో అతడిదే ప్రధమస్థానం .కార్తీక్ ఆటల్లోసోంబా బు తో పోటీ పడలేడు. అదీ కార్తీక్ కు కంట గింపే. ఆసంవత్సరం చదువైపోతే తాను పట్నంలో పెద్ద స్కూల్లో చేరుతున్నట్లు తోటి వారందరికీ చెప్పుకుని మురిసిపోయాడు కార్తీక్. సోంబాబును అంతదూరం పంపి చదివించే స్థాయిలేక తండ్రి రాంబాబు తన తోటే కూలి పనికి తీసుకెళాతానని చెప్పాడు.సోంబాబుకు చదువంటే ఎంత ఇష్టం ఉన్నా, తండ్రికి చదివించే స్థోమత లేనందుకు విచా రిం చాడు, 'నాకింతే ప్రాప్తం, 'అనుకున్నాడు. ఆపాఠశాలపెద్దపంతులు వాడిబాధ చూసి తానూ బాధపడేవాడు.

ఆ సంవత్సరం పాఠశాల వార్షిక తనిఖీకి వచ్చిన అధికారి ఐదోతరగతి తనిఖీ చేస్తూ పెద్ద పంతులు గారితో "ఈసంవత్సరం మన ప్రభుత్వం విద్యాశాఖకు అదనపు నిధులిచ్చి క్రీడల్లో మంచి ప్రవేశమున్నవారిని ఉచితంగా చదివించి ఆటల్లో ఉచిత శిక్షణ ఇచ్చే

విధా నాన్ని ప్రవేశపెట్టింది .మంచి అనుభవం సంపాదించిన విద్యార్థులను జిల్లాపోటీలకూ, ఆతర్వాత రాష్ట్రస్థాయిపోటీలకూ అలా వారి గెలుపునూ సామర్థ్యాన్నీ బట్టి ఇంకా పై పోటీలకూ పంపుతుంది. మంచి వినయ విధేయతలూ, కష్టపడే మనస్తత్వం, విచక్ష ణాజ్ఞానం ఉన్న ఒక విద్యార్థిని , దానికోసం మన పాఠశాలల నుండి ఎంపికచేసే పని నాకు అప్పగించింది.మీరొక మంచి విద్యార్థి పేరు ఇవ్వండి. " అని కోరారు.

అది విన్న కార్తీక్ మధ్యాహ్న భోజనసమయం లో ఇంటికెళ్ళి తన తండ్రికి చెప్పి తనపేరు పంపేలా చేయమని అడిగాడు. కార్తీక్ తండ్రి వచ్చి పెద్దపంతులుతో " పంతులూ! కార్తీక్ పేరు చెప్పండి తనిఖీ అధికారికి, బదులుగా నేను ఈ బడికి కావల్సిన సదుపా యాలన్నీ సమకూరుస్తాను " అన్నాడు. పెద్దపంతులు గారు "అయ్యా! నేను కార్తీక్ పేరూ, సోంబాబు పేరూ రెండూ ఇస్తాను. అధి కారే వారిలో ఒకర్ని నిర్ణయించి తీసు కుంటారు. పెద్దలు మీమాట నేనెందుకు కాదంటానూ "అన్నాడు.

తనిఖీ అధికారికి అంతా అర్థమైంది. ఆయన " పంతులుగారూ! చెప్పడం మరచాను దార్లో నా చెప్పులు కాస్తంత కుట్లు ఊడి పో యా యి , ఎవరిచేతైనా కాస్త రిపేర్చేయిస్తారా!" అన్నాడు. పంతులు పిల్లలందరి వంకాచూసారు . సోంబాబు లేచాడు. అధికారి కుట్టు లూజైన ఒకచెప్పు ఇచ్చాడు.దానికి సోంబాబు "సారూ రెండు చెప్పులూ ఇవ్వండి , కుట్టేప్పుడు సరిసమానం చూసుకో వాలికదా!" అని ఆరెండు చెప్పులనూ తన గుడ్డ సంచీలో వేసుకుని వేగంగా పరుగెట్టి ఊరిచివర ఉన్న చెప్పులు కుట్టే చెలమయ్య వద్ద ఇచ్చాడు. చలమయ్య వాటిని చూసి " సోమూ! ఈ చెప్పులకు పెద్ద రిపేరేం లేదురా! ఎందుకు తెచ్చినట్లూ?" అన్నాడు.

సోంబాబు తల ఊచి " పెద్దయ్యా! రెండు చెప్పులూ బాగా పాలిష్ చేసి,సరిచేసి ఇవ్వు , చాలు . సందేళ మానాయన్నడిగి డబ్బిస్తా " అన్నాడు. చలమయ్య పనిచేస్తూ " దీనికి డబ్బేంట్రా! మీనాయన నాకెన్ని సార్లు సాయం చేయలేదూ!"అంటూ కొత్తచెప్పులా పాలిష్ చేసి,కుట్టు సరిచేసి ఇచ్చాడు. వాటిని తన గుడ్డ సంచిలో వేసుకుని వచ్చినంత వేగంగానూ తిరిగొచ్చి తనిఖీ అధికారి ముందుంచాడు. వాటిని పరిశీలించిన అధికారి మెచ్చుకోలుగా సోంబాబు వైపుచూసాడు. కార్తీక్ తండ్రికి చెప్పి ,తమ ఊర్లో ఉన్న ఒకే ఒక షాపు నుంచి కొత్త చెప్పులు తెప్పించాడు.వాటిని అధికారి ముందుంచి "పాతవెందుకు సార్! ఈకొత్తవి వేసుకెళ్ళండి" అన్నాడు దర్జాగా. " కార్తీక్! గాంధీగారి కథ తెల్సుకదా! ఆయన అతిచిన్నపెన్సిల్ నే పాళీపోయిన పెన్ను లో ఉంచి చివరంటా వ్రాసే వారు. పొదుపు ఆచరించాలి బాబూ ! నాచెప్పులు నిజానికి పెద్ద రిపేరేం లేవు. చిన్నపరీక్ష పెట్టానంతే!. పాలిష్ చేయించి కొత్త వాటిలా మెరుపుతో తెచ్చాడు సోంబాబు.నిజానికి మీచేత నా పాద రక్షలు రిపేరు చేయించకూడదు. ఐనా మీ వినయాన్ని పరీక్షించనే ఈపనిచేసాను .అలాంటి విచక్షణ ఉన్నవాడేమాకు కావాలి. నేనుసోంబాబునుఎంపిక చేస్తున్నాను."అని ప్రకటించాడు.

చూసారా! వినయం ,విచక్షణా ఉన్న వారు ఎక్కడైనా రాణిస్తారు.




“సుబ్రహ్మణ్యం గారు - -ఎక్స్ రే రిపోర్టు …మీరేనా? డాక్టర్ గారు రమ్మంటున్నారు” అంటూ నర్సు పిలవడంతో కుర్చీలో కూర్చుని పేపర్ చదువుతున్న నేను లేచి, డాక్టర్ గారి రూము లోకి వెళ్లాను. ఎక్స్ రే తీసి చూస్తున్నంతలో ఏదో ఫోన్ రావడంతో, మాట్లాడి ఎవరో వ్యక్తిని లోపలికి రమ్మన్నారు – మాటల్ని బట్టి వచ్చిన వ్యక్తి టైల్స్ బిజినెస్ లో ఉన్నారని, డాక్టర్ గారు ఏదో కనస్ట్రక్షన్ పని మీద అతని దగ్గర టైల్సు తీసుకున్నారని అర్ధమైంది.

డాక్టర్ గారిచ్చిన చెక్ తీసుకుంటూ ఆవ్యక్తి – “హాస్పటల్ కొత్త బిల్డింగ్ లోకి మార్చేస్తారండి?” అని అడిగాడు. డాక్టర్ గారు నవ్వుతూ –“అబ్బే, అది మా అబ్బాయి, కోడలు కోసం అండీ – వాళ్ళు లండన్ నుండి వచ్చేస్తున్నారు – అబ్బాయి హార్మోన్ స్పెషలిస్ట్, కోడలు డెంటిస్ట్ – అది వారి రెసిడెన్స్ మరియు హాస్పిటల్ – అన్నారు”. “ఓహ్ సరేసార్ వస్తాను.” అంటూ వెళ్ళిపోయాడు. మరలా నా వైపు తిరిగిన డాక్టర్ గారితో, “సంతోషం సార్, మీ అబ్బాయి గారు లండన్ నుంచి వచ్చేస్తున్నారన్న మాట” అన్నాను – వారం రోజుల క్రితం నా శ్రీమతి వెళ్ళినప్పుడే డాక్టర్ గారు ఈ విషయం చెప్పడం, వారి అబ్బాయి, కోడలు అక్కడే ఉండడంతో పరిచయం కూడా చేయడం జరిగింది.

అవన్నీ గుర్తు చేస్తూ, నేను మాట్లాడుతుంటే “ఆ… అవునండీ, వాడు వచ్చేస్తాననడం నాకూ ఆశ్చర్యమే – ఎందుకంటే, పదమూడేళ్ళ పాటు అక్కడ ఉన్నవారు సాధారణంగా ఇక్కడకు వస్తామని అనరు- ఎందుకంటే, దేశం మీద, తల్లితండ్రుల మీద ఎంత ప్రేమ ఉన్నా, వారికి అక్కడ ఉన్న సౌకర్యాలు, ఒక పద్ధతికి అలవాటు పడిన జీవితం – అక్కడనుంచి రానివ్వదు. అయితే,

మావాడు వస్తాననడం నిజంగా ఆశ్చర్యమే – అందునా డాక్టర్లు అంత తొందరగా అక్కడనుంచి రారు అన్నారు. "ఎందుకు?" అన్నట్లుగా చూస్తున్న నా చూపుల్లో ప్రశ్నను గ్రహించినట్లుగా – "ప్రస్తుతం మా అబ్బాయి పనిచేస్తున్న చోట ఉదయం నుంచి సాయంత్రం వరకే డ్యూటి – ఇంటికి వచ్చాక సాధారణంగా ఫోన్ కాల్స్ కూడా రావు – ముఖ్యంగా సిబ్బందితో ఏ విధమైన ఇబ్బంది ఉండదు. హేపీగా ఏడాదికి కోటి రూపాయలు ఖాతాలోకి వచ్చేస్తుంది..." అంటూ, నోరు వెళ్ళబెట్టి చూస్తున్న నాకేసి చూస్తూ, "..అదే ఇక్కడయితే, రూమ్ క్లీన్స్ చేసేవాళ్ళగురించి, నర్సుల గురించి, ఇతర పనివాళ్ళ గురించి, లేబ్స్ గురించి – ఇలా ప్రతిదీ పొద్దున్న లేచిన దగ్గర్నుంచి చూసుకోవలసిందే – నిజానికి వాళ్లకు అది పెద్ద తలపోటు వ్యవహారం – మాకంటే అలవాటు అయిపోయింది గాని ...." అన్నారు నవ్వుతూ.

ఎప్పుడూ బిజీగా ఉండే డాక్టర్ గారు ఆవేళ కూడా అంతే బిజీగా ఉన్నా, నాతో సరదాగా మాట్లాడుతూ వ్యక్తిగత విషయాలను పంచుకోవటం ఆనందంగా అనిపించి – "అదంతా మీరు నేర్పించిన సంస్కారం వల్లనే అయ్యుంటుంది సర్ – ఈ మధ్య ఏ వార్తలు విన్నా – తల్లితండ్రులు చనిపోయాక అంత్యక్రియలకు కూడా ఖాళీ లేదని విదేశాలనుంచి రాని పిల్లల గురించిన కథలే ఎక్కువ వినబడుతున్నాయి. అలాంటిది, ఇన్నాళ్ళ తరవాత మీదగ్గరకు వచ్చేస్తానని మీ అబ్బాయి అనడం బట్టి – వారు జీవితంలో ఏ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలో స్పష్టత కలిగి ఉన్నవారని తెలుస్తోంది. అదంతా మీ పెంపకం వల్లే అయ్యుంటుంది సర్" అన్నా.

విలువలకు ప్రాధాన్యత నిస్తూ, ఆధ్యాత్మికత చింతనతో కూడా గడుపుతూ, ఎప్పుడూ ప్రశాంతంగా, ఋషి లా కనబడే శాస్త్రి డాక్టర్ గారంటే ఆ చుట్టుపక్కల అందరికీ ఇష్టమే – వారి హస్తవాసి మంచిదని విశ్వాసం. అన్నింటి కన్నా వారి మాట తీరు నాకు చాలా నచ్చుతుంది. వచ్చిన పేషెంట్ చెప్పిన విషయాలు అన్నీ శ్రద్ధగా విన్న తరవాతనే వైద్యం చేస్తారు – అనవసరంగా హై డోసు మందులు రాయరని, పని లేకుండా టెస్టులు రాయరని, ఊరికే హాస్పిటల్ లో అట్టేపెట్టుకోరని – జనంలో తరచూ వినబడే మాటలు. ఎంత బిజీ ప్రాక్టీసు ఉన్నా, నెలలో రెండు మూడు రోజులు తీర్థ యాత్రలకు, ఐదు, ఆరు నెలలకు ఒక రెండు వారాలు పిల్లల దగ్గరకు వెళ్ళడం చేస్తుంటారు. డబ్బు కన్నా సంతృప్తి, కుటుంబ సంబంధాలు ముఖ్యమని తెలియజేస్తుంది వారి జీవితం. బహుశా అదే సంస్కారం వారి వల్ల వారి పిల్లలకూ అబ్బి ఉంటుంది.

ఇలా ఆలోచిస్తున్న నాతో - "అదేం లేదండి. అదంతా మా నాన్నగారి ప్రభావం" – అన్నారు – ముఖం లో ఆనందం, బాధ కలిసి పోగా --- "మా నాన్నగారు చాలా ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారు – జీవితంలో ఏ అంశానికి ఎంత ప్రాధాన్యత ఇవ్వాలో వారి ద్వారానే మాకు, మా పిల్లలకు తెలిసింది. వారు వ్యవసాయికులు, వేద పండితులు అయినప్పటికీ, ఆంగ్లంలో మంచి కవిత్వం, వ్యాసాలూ రాసారు – అంతర్జాతీయ పత్రికలలో కూడా ప్రచురితమయ్యాయి – అయినా ఆయన అత్యంత నిరాడంబరంగా, సంతృప్తిగా, ఆధ్యాత్మిక చింతనతో, ప్రశాంతంగా జీవితం సంపూర్ణంగా గడిపి, నాల్గు నెలల క్రితమే హఠాత్తుగా కాలం చేసారు....". నిజమే, వారి గురించి స్థానిక వార్తా పత్రికలో ఒకరు రాసిన గొప్ప వ్యాసం కూడా నేను చదవటం జరిగింది, ఆ విషయాలన్నీ ఇప్పుడు గుర్తుకొస్తున్నాయి. తొంభై ఏళ్ల వయస్సులో వారు చనిపోయినా, సడన్ గా అంటూ, డాక్టర్ గారు అనడం – ఆ తండ్రి పట్ల ఈయనకు గల ప్రేమకు తార్కాణం అనిపించింది.

మృదు స్వభావి, మితభాషి అయిన శాస్త్రి గారు, వారి తండ్రి గారి ప్రస్తావన రాగానే, ఆనందంగా చాలా సేపు మాట్లాడుతూ ఉంటే, నేను అలా వింటూ ఉండి పోయాను. “పైగా....మా నాన్న గారంటే, మా మనవరాలికి కూడా చాలా ఇష్టం – ఆ ముత్తాత, ముని మనవరాళ్ళ ముచ్చట్లు వింటుంటే – కడుపు నిండిపోయేది – ఈ కాలంలో ఉండే పిల్లలను కూడా ఆకట్టుకొనే వ్యక్తిత్వం మా నాన్న గారిది....” అంటూ ముగించారు డాక్టరు గారు. ప్రిస్క్రిప్షన్ తీసుకొని నేను నమస్కారం చెప్పి బయటకు రాబోతుంటే, వెనక్కి పిలిచి, వారి తండ్రి గారి మీద వచ్చిన వ్యాసం ఒక జిరాక్స్ కాపీని తీసి ఇచ్చారు – చదవండి – అంటూ.

ధన్యవాదాలు చెప్పి బయటకు వచ్చిన నాకు నా అనారోగ్యం గురించిన ఆలోచన బెంగ, ఆందోళన పూర్తిగా పోయాయి – మానవ సంబంధాలకు, కుటుంబ విలువలకు ప్రాధాన్యతనిచ్చే పిల్లలు నేడు కూడా ఉండడం ఒక ఎత్తు అయితే, ఆ విలువలు, సంస్కారాలు అవిచ్ఛిన్నంగా ఒక తరం నుండి మరొక తరానికి కొనసాగుతూ ఉండడం మరో ఎత్తు. “పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జనియించినపుడె పుట్టదు, జనులా పుత్రుని కనుగొని పొగడగ పుత్రోత్సాహమ్ము నాడు పొందుర సుమతీ” అన్న పద్యం గుర్తుకొస్తుండగా హాస్పిటల్ బయటకు వచ్చాను.




ఏనాడూ లేంది, ఎంగంపల్లికి విమానమంత తెల్ల కారొచ్చి పంచాయతీ ఆఫీసు ముందు ఆగింది. వాన కురిసిన మట్టిరోడ్డులో వచ్చి బురద కొట్టుకునున్న తెల్లకారు, యుద్ధభూమిలో దెబ్బతిని ఒళ్ళంతా రక్తం మరకలతో ఉన్న వీర సైకునిలా ఉంది. అంత పెద్దకారు ఏనాడూ చూడని పిల్లమూకంతా బెల్లం చుట్టూ మూగిన ఈగల్లా కారు చుట్టూ చేరారు. బొద్దుగా, ఎర్రగా, ఎత్తుగా పాత సినిమాల్లో

ఎస్వీ రంగారావులా తెల్ల ఖద్దరు పంచా, లాల్చీలో ఉన్న ఒక 65 ఏళ్ళ పెద్దాయన కారు దిగాడు. " బాబూ!" అనే పిలుపు విని పంచాయతీ ఆఫీసు వరండాలో తలొక పేజి పంచుకుని తెలుగు దినపత్రిక చదువుతున్న పదిమంది యువకులూ తలలెత్తి చూశారు.

"బాబూ! ఈ ఊర్లో పరమేశ్వరయ్యగారి ఇల్లెక్కడా?" అని అడిగాడాయన. " ఏ పరమేశం? ఈ ఊర్లో ఇద్దరు పరమేశ్వరయ్యలున్నారు? అన్నాడు వారిలో ఎత్తుగా ఉన్న ఒక యువకుడు. "అదే బాబూ! వాళ్లబ్బాయి హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నాడే, ఆ పరమేశ్వరయ్య గారు.." అన్నాడాయన. "ఓహో! పంచాయతీ ప్రెసిడెంటు పరమేశ్వయ్యా!? కుడి వైపు వెళ్ళి ఎడంకు తిరగండి మూడో ఇల్లే." అనిచెప్పి తిరిగి దినపత్రికా పఠనంలో పడ్డాడా యువకుడు. మిగిలినవారూ అదేపనిలో పడ్డారు. ఎండమావిలో దొరకని నీళ్ళకై ఎదురు చూసినట్లు లేని అవకాశాలకై వెతుకులాటలు వారివి, కడుపుకు తిండి, చేతికి పని దొరికే అవకాశం కోసం.

ఆ పెద్దాయన కారెక్కి ఆ యువకుడు చెప్పిన దారంట కారు నడుపుకుంటూ వెళ్ళాడు. ఆ ఇంటి ముందు కారాపి దిగాడాయన. వెనకాలే ఒక మహిళ దిగింది. ఇద్దరూ గేటు తీసుకుని లోపలి కెళ్ళారు. పెద్ద లోగిలి, చుట్టూ పెంకుల వరండా, గేదెలూ, ఆవులూ 'అంబా' అని అరుస్తూ లేగదూడలూ, గేటుకిరువైపులా పెద్ద వేపచెట్లూ, చుట్టూ అరుగులూ! రైతు కుటుంబం అని ఇల్లు చూడగానే తెలుస్తున్నది. అరుగు మీద కూర్చునున్న ఒక 80 ఏళ్ళ వయస్సాయన, "ఎవరదీ?" అన్నాడు గేటు తీసిన శబ్దానికి తలెత్తి . కారు దిగినాయన దగ్గరగా వెళ్ళి "అయ్యా! నా పేరు అనంత రామయ్య, మాది హైదరాబాదు. నేను పరమేశ్వరయ్యగారితో మాట్లాడాలని వచ్చాను.

వారిని కాస్త పిలుస్తారా?" అన్నాడు. "అయ్యా! నేనే పరమేశాన్ని. రండి లోపలికి" అంటూ అరుగు దిగి లోపలికి దారి తీశాడు, పై పంచతో ముఖం తుడుచుకుంటూ. "సుశీలా! మంచితీర్థం తేవే! హైదరాబాదు నుంచి మనతో మాట్లాడేందుకెవ్వరో పెద్దోళ్ళు వచ్చారు." అంటూ కేకేసి, "కూర్చోండి బాబూ, కూర్చోమ్మా!" అంటూ కుర్చీలు చూపాడు. ఇద్దరూ కూర్చున్నారు. లోపలి నుంచి ఆయన పిలిచిన సుశీలమ్మ వచ్చింది, చేతుల్లో తళతళా మెరిసే కంచు గ్లాసులతో మంచితీర్థం తీసుకుని ఇద్దరికీ అందించింది.

"దూరం నుంచొచ్చారు, కాళ్ళూ, ముఖం కడుక్కోండి బాబూ! వెంకయ్యా, ఈ అయ్య గారికి కాళ్ళకు నీళ్ళియ్యి. పిచ్చమ్మా! అమ్మ గారిని లోగాకు తీస్కెళ్ళు కాళ్ళు కడుక్కుంటారు, కాపీ చేయరాదూ సుశీలా!" అంటూ అందరికీ పనులు పురమాయించాడు పరమేశ్వరయ్య. కాఫీలు త్రాగి అంతా స్థిమిత పడ్డాక, "మీరే పని మీదొచ్చారో తెలుసుకోవచ్చా?" అన్నాడు. "అయ్యా! నేను హైదరాబాదులో ఒక కంటి వైద్యుడ్ని.." అంటుండగానే ఈశ్వరయ్య చివ్వున తలెత్తి చూశాడు. "మీ మనవడు వివేక్, మా అమ్మాయి చంద్రిక ఒకే ఆఫీసులో పనిచేస్తారు. మా అమ్మాయిని మీ మనవడికి అడగాలని సంబంధం మాట్లాడను వచ్చాము. ఈమె నా భార్య భానుమతి, ఈమె కూడా హైదరాబాదులో డాక్టరే!" అని తమను పరిచయం చేసుకుని, ఆగాడు అనంత రామయ్య. పై మీది కండువాతో ముఖం తుడుచుకుని "మీరు మా మనవడు వివేకానందును చూసినారా

బాబూ?" అన్నాడు.

"చూట్టమేంటండి! వివేక్ మా ఇంటి మేడ మీదే అద్దెకుండేది. మా అమ్మాయి చంద్రికా, వివేక్ ఇద్దరూ కలసి ఒకే ఆఫీసు కెళుతుంటారు రోజూనూ! ఇద్దరూ మనస్సులు ఇచ్చి పుచ్చుకున్నా, పెద్దల అనుమతి కోసం వేచి ఉన్నారు తప్ప, బయట పడ లేదు. మేమే వారి మనస్సు తెల్సుకుని, మీతో మాట్లాడదామని వచ్చాము." "మంచిది. ఐతే మా అబ్బాయి, అదే మా వివేకు తండ్రి శీనయ్య ఎరువులు తోలుకు రాను టౌనెళ్లాడు, మధ్యాహ్ననికి వస్తాడు. మీకు వివేకు గురించి ఏమి తెలుసు బాబూ?" "అదేంటండీ! వివేక్ బంగారం లాంటి యువకుడు. అలాంటి బుద్ధి మంతుడు ఈ రోజుల్లో ఎవరూ ఉండరు. బాగా తెలివి గల వాడు, చదువుతో పాటుగా సంస్కారం ఉన్న వాడు. ఇంకేం కావాలండీ పిల్ల నిచ్చే వారికి? కట్న కానుకలకు లోటు చేయం, మాకున్నది ఒక్కతే అమ్మాయి, మా తర్వాత అన్నీ ఆమెకే." అన్నాడు అనంత రామయ్య.

"మంచిది బాబూ! మాకూ కట్న కానుకల మీద ఆశ లేదు, మాకున్నదే చాలు! తిండికీ, బట్టకూ మాకు లోటు లేదు. మీరా గదిలో విశ్రాంతి తీసుకోండి! నేనెంత తాతనైనా తండ్రితో సంప్రదించకుండా మాటివ్వలేను గదండీ!" అన్నాడాయన. కొంచెం సేపు విశ్రాంతి తీసుకున్నాక "భోజనానికి లేవండి!" అంది సుశీలమ్మ. ఇంతలో తోటకెళ్ళిన ఆమె కోడలు అనూరాధ కూడా వచ్చింది, పని వారి చేత వంకాయలు కోయించుకుని. "మేమంతా తోటల్లో పనులు చేసుకుంటూ, చేయించుకుంటూ ఉంటాం బాబూ! యజమాని లేందే పనివారు సక్రమంగా చేయరు. రామ్మా! అనూరాధా! వీరు హైదరాబాదు నుంచి వచ్చారు. ఇద్దరూ డాక్టర్లేట! మన వివేకుకు వాళ్ళమ్మాయిని ఇవ్వాలని సంబంధం మాట్లాడను వచ్చారు. సాయంత్రానికి శీనయ్య వస్తాడు గదా! అప్పుడే మాట్లాడ వచ్చని ఆగాను.

మీరిద్దరూ లేంది నేనేం మాట్లాడతా?" అంటూ ,"రండి బాబూ! అతికితే కతకదని ఉపోషం ఉండకండి! అతిధులు తినందే మేం తినం" అంటూ డైనింగ్ టేబుల్ దగ్గరికి పిలిచాడు వాళ్లని పరమేశ్వరయ్య. పెద్ద చెక్క టేబుల్. "మీ నగరాల్లో లాగా మా ఇళ్ళు, టేబుళ్ళూ అందంగా ఉండవు బాబూ! రైతులం, అవసరానికి తగినట్లు అమర్చుకుంటాం, సుశీలా! అన్నం వడ్డించండి! పిచ్చమ్మా కాళ్ళకు నీళ్ళు పట్టుకురా! అనూరాధా, కూరలు వడ్డించు," అంటూ, అందరికీ తలో మాటా చెప్పాడాయన. ఇంటి మహిళలు చక్కగా ఆప్యాయంగా చూసి చూసి వడ్డించి కడుపు నిండుగా భోజనం పెట్టారు, ఆత్మీయత, అభిమానం రంగరించి. వారి సంస్కారానికీ, అతిధి మర్యాదకు అనంత రామయ్యకూ, భానుమతికీ చాలా సంతోషమైంది. 'అన్నమంతా పట్టి చూడక్కర్లేదు, ఒక్క మెతుకు చూస్తే చాలన్న' పెద్దల మాట, వారి మర్యాద, మన్ననతో తేట తెల్లంకాగా అనంతరామయ్య దంపతులు ఆనందించారు, తమ ప్రతిపాదనలో పొరబాటులేదని.

విశ్రాంతిగా నడవాలో కూర్చుని టి.వి చూస్తూ, లోకాభిరామాయణంలో పడ్డారు మొగవారు ఇద్దరూ. మహిళలు పెరట్లోని తోటలోకి భానుమతిని తీసుకెళ్ళి తమ పండ్ల, పూలతోట విశేషాలు చెప్పసాగారు. పొద్దు వాలుతుండగా బస్తీ కెళ్ళిన శీనయ్య అనే శ్రీనివాస రావు వచ్చాడు. "ఏందబ్బయ్యా! ఇంత లేటాయె! పొద్దు వాలుతున్నది ఎట్టొస్తవోని దిగాలు పడుతుంటిని, రా

కాళ్ళుకడుక్కుని ఇంతెంగిలి పడు. సుశీలా! అబ్బయ్యొచ్చిండు చూడూ! బోం చేసినాక నీతో కాస్తంత మాట్లాడాల, హైదరా బాదు నుంచి చుట్టాలొస్తిరి అబ్బయ్యా! ముందు తినేది కానీ, సుశీలా! కోడలు శీనయ్యకు వడ్డిస్తది కానీ, నీవు కాసింత చాయ్ పెట్రాదూ! తినేందుకేమైనా చేస్తూన్నరా!?" అంటూ తన ధోరణిలో అన్నీ ఒకే మారు చెప్పేశాడు పరమేశ్వరయ్య. మరో ఐదు నిముషాలకే వేడి వేడి పకోడీ ప్లేట్లు వచ్చాయి, ఆ తర్వాత టీ కప్పులూ వచ్చాయి టేబుల్ మీదకు. అంతా అయ్యాక "శ్రీనయ్యా! ఈ నడవాలో కూర్చుందాం రా! ఆడాళ్ళూ రండి, ఒకే మారిందురు, వెంకయ్యా! యాడున్నవ్! రారా యిటు, నన్ను దీస్కెళ్ళి నడవాలో దింపు" అంటూ కుర్చీలోంచి లేచి నిలుచున్నాడు పరమేశ్వరయ్య. "శీనయ్యా! రారా! దీపాలన్నీ ఎయ్యండి పిచ్చమ్మా! చీకటవుతన్నాది!"అన్నాడు పరమేశం.

అనంతరామయ్య 'టైం మూడే ఇంది కదా! ఈ పల్లెల్లో మూడింటికే దీపాలు వెలిగించుకుంటారేమో!' అనుకున్నాడు. వెంకయ్య చేయి సాయంతో ఈశ్వరయ్య, ఆయన వెనకాలే శ్రీనివాసులూ వచ్చి కూర్చున్నారు. మహిళలు ముగ్గురూ కూడా వచ్చికూర్చున్నాక, పరమేశ్వరయ్య , "బాబూ! మీరు బాగా చదువుకున్నవారు, నగరాల్లో ఉండేవారు, మేమా పల్లెటూరి బైతులం, మా పద్ధతులు మీ నాగరీకులకు కొత్తగా ఉంటయ్యేమో! మా గురించి కొంచెం చెప్పడం ఇంటి పెద్దగా నా ధర్మంగా భావిస్తున్నా. మాది మొదటి నుంచి ఉమ్మడి కుటుంబం, ఐదు తరాలుగా మా ఇంట మా పిల్లల్ని పరాయి ఇళ్ళకు పంపకుండా మేనరికమే చేస్తూవచ్చాం. మేమే కాదు బాబూ! ఇంచుమించుగా ఈ గ్రామంలో ఉండే వారంతా అంతే! మా అక్క బిడ్డనే మా కొడుకు శీనయ్యకు చేసుకున్నాను.

అక్కా బావా పొలం నుంచి వస్తూ మబ్బేసి దారి కనిపించక బండి తోలడంలో, బండి తిరగ బడి చెఱువులో పడి చని పోయారు. మా ఇంటి పిల్లలకెవరికీ చదువు కూడా అంతంత మాత్రమే. 20 ఏళ్ళ క్రితం మా ఊరు బడికి వచ్చిన పంతులమ్మ పద్మమ్మ, మా పిల్లల్ని తన బళ్ళో వేసి చదివించింది. ఈ ఊరి ఐదో క్లాసు చదువు కాగానే బాగా తెలివి గల పిల్లలనీ వాళ్ళ చదువు ఆపద్దనీ మాకు నచ్చ జెప్పి, తన పూచీ మీద టవున్లో తన ఇంట్లోనే ఉంచుకుని హైస్కూల్, కాలేజీల్లో చదివించింది, ఆ తర్వాత మా మనవడు, మనవరాలూ ఇద్దరూ ఏదో పెద్ద నగరంలో, పిలానీనో ఏదో బాబూ! నాకు తెలవదు, ఇంజనీరు చదివారు ఆరేళ్ళు. చదివేప్పుడే మా పిల్లలకు ఉద్యోగాలూ వచ్చాయి. మాకెంతో సహాయం చేసిన ఆమె కొడుక్కే మా మనవరాలినిచ్చి గతేడాది పెళ్ళిచేశాం. సగం ఆస్తి కూడా రాసిచ్చేశాం, ఇలా మాఇంట్లో తొలిసారిగా వేరే ఇంటి బిడ్డకిచ్చి పెళ్ళి చేయడం జరిగింది. వీళ్లకి మేనరికం కూడా లేదు." అని చెప్తూండగా పరమేశానికి దగ్గు తెర వచ్చింది. గబుక్కున లేవ బోయిన సుశీలమ్మ దట్టుకుని క్రిందపడింది. పిచ్చమ్మ వచ్చి లేపి పట్టుకుంది. "ఎందుకే సుశీలా, అంత తొందర! "అన్నాడు పరమేశం.

"దగ్గుతున్నావ్ కదా మంచి నీళ్ళిద్దమనయ్యా!" అంది ఆమె. "బాబూ! ఏకారణమో కానీ మా ఇంట్లో అందరికీ రాత్రులు కనబడదు. మూడైన కాడ్నుంచి మాకు కాన్రాదు. మా ఇంటి దేవతలాంటి ఆ పంతులమ్మ పద్మమ్మ చెప్పింది, ఇలా తరాలుగా మేనరికాలు చేయడం వల్ల వచ్చిందని, దాన్ని 'రేచీకే'టంటారనీ! మా మనవడు చదువు కున్నాక ఈ జబ్బు గురించి చాలా తెల్సుకున్నాడు. వాడికీ, మనవరాలికీ కూడా ఆపరేసన్ చేయించినం! ఐనా లాబం అంతగా కనిపిచ్చలా! మా మనవరాలికీ రేజీకటుందని తెల్సీ తన కోడల్ని చేసుకుంది పెద్ద మనస్సావిది. ఇట్టాగా వేరే ఇంటి పిల్లలతో పెళ్ళిళ్ళు చేస్తే ఇగనా కంటి జబ్బు

రాదంట గదయ్యా! మీరు కళ్ల డాక్టర్, మీకు తెలిసే ఉంటది. ఇహ మా మనవడు ..." అంటూ ఆపాడాయన.

“మీ మనవడు అంతా చెప్పాడండీ! మీ మర్యాద, దాపరికం లేని మీమనస్తత్వం మాకెంతో నచ్చాయి. మీ మనవడికి 15 సం. వయస్సు నుంచే సరిగా కనిపించేది కాదనీ, దానివల్ల బిడియం కలిగి నలుగుర్లో కలవలేకపోయేవాడని కూడా చెప్పాడు. మీరు మంచి వివేకమున్న వారు కనుక చెప్తున్నాను. ...” అంటూండగానే , పెద్దగా అరుచుకుంటూ పది మంది వచ్చారు "పరమేశం మావా! మా ఆడాళ్లు చెంబెత్తుకెళ్తే పాము కాటేసింది మావా! ..” అంటూ ఏడ్వ సాగాడు ఒకాయన. అప్పటికి సూర్యాస్తమయమైంది. “ఉండ్రయ్యా! బాబూ! మీరు డాక్టర్లు కదా! ఏదైనా...” అని పరమేశ్వరయ్య అంటుండగానే, “బాబూ! ఆమె ఎక్కడున్నారు?” అంది భానుమతి.

ఇంతలో ఒక స్త్రీని మోసుకుంటూ వచ్చారు కొందరు. ఆమెను బయటే ఉన్న మంచమ్మీద పడుకో బెట్టమని, కార్లోంచి ప్రధమ చికిత్స సరంజామా తీసుకు వచ్చింది భానుమతి. ఆమెకు అవసరమైన చికిత్స చేసి ఒక ఇంజక్షన్ చేసింది. ఆ మంచాన్ని వరండాలోకి పట్టించి ఒకరిని ఉంచి విసన కర్రతో విసరమని చెప్పి , "బాబూ! ఆమెకొచ్చిన ప్రమాదం ఏమీ లేదు. మీరు కాస్సేపు కూర్చోండి, ఆమె లేస్తుంది. సమయానికి వైద్యం అందింది.” అంది భానుమతి. ఆమె భర్త వచ్చి, భానుమతి పాదాలు పట్టుకుని “సమయానికి దేవతలా వచ్చిమా ఇంటి దాని ప్రాణాలు కాచావమ్మా!” అన్నాడు. భానుమతి అతడ్ని లేపి "అయ్యా! నేనూ మీలాంటి మనిషినే, ఇక్కడ ఉండటం మూలాని మాకు తెలిసిన వైద్యం చేశాము. ‘కాగల కార్యం గంధర్వులు తీర్చా’రన్నట్లు, మేము వచ్చిన పని సులువైంది.

అంతా కూర్చోండి బాబూ! మీతో కాస్త మాట్లాడుతాము.” అంది భానుమతి. పాము కాటు మాట తెల్సి, ఆ పాటికే ఊరు ఊరంతా వచ్చి పరమేశ్వరయ్య ఇంటి ముందు చేరింది. భానుమతి మాటలకు అంతా కూర్చున్నారు. అనంత రామయ్య లేచి “బాబూ! నేను హైదరాబాదు నగరంలో ఒక వైద్యుడ్ని. ఈమె నా భార్య భానుమతి, ఈమె కూడా ఒక డాక్టరే! ప్రపంచమంతా వాయు వేగంతో ముందుకు సాగుతుంటే మీ గ్రామం ఇలా ఉండటం దురదృష్టం. మీరేమీ అనుకోకండి, మా మాటలు శాంతంగా వినండి. మేమిద్దరం మా వృత్తిలో ధర్మ మార్గంలో బాగా సంపాదించాం! ఈ పరమేశ్వరయ్య గారి మనవడు, మా అమ్మాయి చంద్రికా ఒకే ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నారు. వివేక్ మాటలను విని మీ ఊరి పరిస్థితి అర్ధం చేసుకున్నాం! వివేక్ ఎలాగైనా తన వూరిని బాగు చేయాలని చెప్పాడు. మాకు పిత్రార్జితమూ చాలానే ఉంది. దాన్ని సద్వినియోగం చేయాలని సంకల్పించాం. మా అమ్మాయిని మీ ఊరి అబ్బాయైన వివేక్ కు ఇచ్చి వివాహం చేసి మీ ఊరిలో చుట్టరికం కలుపుకుని మీ ఊరి వారమై ఒక పని చేయాలని మా ఉద్దేశం. ఐతే ముందు మీ ఊరికి సేవ చేసి ఆ తర్వాతే చుట్టరికం కలుపుకోవాలని ఈ సంఘటనతో భావించాం.” అంటూండగానే పాము కరచిన మహిళ లేచిందని తెల్సి వెళ్ళి చూశారు. ఆమె లేచి కూర్చుంది.

"అమ్మా మీరు ఈరోజు విశ్రాంతి తీసుకోవాలి" అని భానుమతి ఒక మాత్ర వేసి వచ్చింది. “అయ్యా! మీ గ్రామంలో ఉన్న మహిళలంతా ఇలా అవసరానికి చీకట్లో ఊరి బయటకెళ్ళి ఎన్నో ప్రమాదాలకు గురవుతున్నట్లు వివేక్ చెప్పాడు. మేము

ఉండగానే ఈమెకు ప్రమాదం జరగ బట్టి మాకు సహాయం చేసే అవకాశం కలిగింది. లేక పోతే ప్రాణానికే మోసం వచ్చేది. ఖర్చంతా మేమే భరిస్తాం, మీరు స్వచ్ఛందంగా సేవలో పాల్గొని మీ అందరి ఇళ్ళకూ శౌచాలయాలు కట్టించను సహకరించండి," అంటూ తమ ప్రణాళికను అందరికీ తెలిపారు అనంతరామయ్య, భానుమతి. అంతా అంగీకరించారు.

మరుసటి వారంలో ఒక శుభ ముహూర్తాన ఊరిలోకి లారీలతో లోడు వచ్చి దిగింది. పరమేశ్వరయ్యతో కొబ్బరికాయ కొట్టించి పనులు మొదలుపెట్టారు. పని కోసం ఎదురు చూస్తున్న యువత అంతా, అక్షర జ్ఞానం ఉన్న వారూ, లేని వారూ అంతా నడుం కట్టారు. ఆ పాటికే పొలాల్లో పనులు ఐపోయాయి. రైతు కూలీలంతా పనుల్లేక ఊరికే ఉండే సమయానికి వారికి చేతి నిండాపని, కడుపునిండా కూడూ అమరాయి. అనంతరామయ్య, భానుమతి పక్కాగా ప్రణాళిక వేసి పనులు సాగించారు. వివేక్, చంద్రిక మధ్యలో వచ్చి పర్యవేక్షించి వెళ్ళేవారు. పద్మా టీచర్, వివేక్ చెల్లి వనజా కూడా వారి ఊరు బాగుపడుతున్నందుకు ఎంతో సంబరంగా వచ్చి చూడసాగారు. రెండు మూడు నెలలయ్యేసరికి ఊరి రూపే మారిపోయింది. పక్కా ఇళ్ళు లేనివారికి ఇళ్ళు, ప్రతి ఇంటికీ శౌచాలయాలు [సెప్టిక్ లెట్రిన్స్], స్నానాలగదులు, ఇళ్ళకు సోలార్ ఎనర్జీతో లైట్లు, ఊరి చివర ఉన్న చెఱువు పూడికతీత, వాననీరు పారే వాలు చూసుకుని మరొక చెఱువు, ఇంకుడు గుంతలు, ఊరంతా కలుపుతూ సిమెంట్ రోడ్లు, పంచాయతీ ఆవరణలో వైద్యశాల వెలిశాయి.

ఊర్లో ఒక్క పూరిల్లైనా లేదిప్పుడు. ఇంట్లో చెత్తంతా బుట్టల్లో ఉంచి ఊరి చివర ఉన్న పెద్దగుంటలో వేయడం మొదలుపెట్టారు. అదంతా ఎరువుగా మారాక అంతా వాడుకోవచ్చునని పంచాయతీ నిర్ణయించింది. దాంతో ఊర్లో ఈగలు, దోమలబాధ తప్పింది. వాటివల్ల వచ్చే జబ్బులూ లేవు. అనంతరామయ్య, భానుమతి తమ హాస్పిటల్ నుంచి సంచార వైద్య బృందాన్ని బస్సుల్లో తెప్పించి గ్రామవాసులందరికీ రక్త పరీక్షలు, అవసరమైన వైద్య పరీక్షలన్నీ చేయించారు. ఊర్లో బిడ్డలందరినీ స్కూలుకు పంపి చదివించే ఏర్పాటు చేశారు. పైచదువులకు వెళ్లేవారికి తమ సంస్థ తరఫున తగు ఏర్పాట్లూ చేశారు. ముఖ్యంగా ఆ ఊరిని బాధించే 'రేచీకటి' నివారణ గురించి వివరించారు. రక్త సంబంధీకులు... అంటే మేనరిక వివాహాలు జరపడం మంచిది కాదని పవర్ పాయింట్ ద్వారా చూపుతూ వివరించారు. మేనరిక వివాహాలవల్ల రక్తంలో ఏవైనా లోపాలుంటే దీర్ఘ వ్యాధులు రావచ్చు. తల్లిదండ్రుల జన్యువులో ఏదైనా లోపం ఉంటే, మరో జన్యువు ఆ లోపాన్ని పూరిస్తుంది. ఐతే రెండు జన్యువులూ లోపమైనవైతే ఏదైనా అవకరం, లేక లోపమున్న పిల్లలు పుట్టవచ్చు.

రెండు జన్యువులూ లోపంతో ఉండేవాళ్లిద్దరూ ఒకే రక్త సంబంధీకులైనప్పుడు వివాహాలు జరిగితే లోపాలతో బిడ్డలు పుట్టేందుకు అవకాశాలు చాలా ఎక్కువ. అందుకే ఆరోగ్యకరమైన సంతానం కోసం దూరపు సంబంధాలనూ, ఏ విధమైన రక్తసంబంధం లేని కుటుంబాలవారితో పెళ్ళిళ్ళు చేయడం మంచిదని ఆధునిక వైద్యశాస్త్రం చెప్తున్నది. మేనరికపు పెళ్ళిళ్ళు చేసుకుంటే, తరాలు గడిచిన కొద్దీ మంద బుద్ధులు, అనేక జబ్బులతో కూడుకున్న వాళ్ళూ పుడుతూ ఉంటారు. బ్రెయిన్ కు సంబంధించిన వ్యాధులూ, అంగవైకల్యమున్న పిల్లలూ, తీవ్రమైన చర్మవ్యాధులూ, ఒక రకమైన పక్షవాతం వంటి జబ్బులు, పుట్టుకతోనే రేచీకటి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది, వీటన్నిటికీ కారణం కేవలం మేనరికపు వివాహాలే! [రెటినిటిస్ పిగ్మెంటోసా]( ఋుఫ్)అంటే రేచీకటి వారసత్వంగా వచ్చే ఒక కంటివ్యాధి. దీనికి పూర్తి నివారణ ఇంతవరకూ కనుగొనలేదు. కేవలం కొంతకాలం చూపు తగ్గకుండా

ఆపరేషన్స్ చేయవచ్చు. ఒక కంటివైద్యునిగా నేను చెప్తున్నాను.

ఈ వ్యాధి లక్షణాలు సాధారణంగా పసివయస్సులోనే కనిపిస్తాయి. కొందరికి యుక్తవయసు ప్రారంభంనుండి రేచీకటి ఉన్నట్లు తెల్సుకోవచ్చు. ఇది మొదలయ్యేప్పుడు చీకటిలో చూడలేకపోతారు, దృష్టి క్రమంగా తగ్గిపోతుంటుంది. నేరుగా ఉన్నవాటిని తప్ప పక్కన వాటిని చూడలేరు. దీన్నే వైద్యశాస్త్రంలో "సొరంగం దృష్టి" తున్నెల్ విసిఒన్ [ట్యూనల్ విషన్] అంటారు. క్రమేపీ అంధత్వం వస్తుంది. పగలు కూడా చూడలేరు. కంటికి ఒక తెర వేసినట్లు మసకగా నీడలు మాత్రమే కనిపిస్తాయి. వంశపారంపర్యం కానివారికి ఈ 'రేచీకటి' ఆహారంలో విటమిన్ ఎ లోపంవల్ల వస్తుంది. విటమిన్ ఎ, క్యారట్లు, పసుపు లేక ఆకుపచ్చ కూరల్లో ఉండే విటమిన్ కంటిలోని రెటీనాను ఆరోగ్యంగా ఉంచడానికి సహకరిస్తుంది. కంటిలోని తెల్లపొర ప్రకాశం కోల్పోయి, పొడి ఆరిపోతుంది. కనుగుడ్డు మీద తెల్లని మచ్చలు ఏర్పడతాయి. ఈ వ్యాధి సోకినవారు మసక వెలుతుర్లో వస్తువులను చూడలేరు. ఇంకా అశ్రద్ధ చేస్తే పూర్తి అంధత్వము వస్తుంది. పగలు కనిపిస్తూ రాత్రులు లైట్లు ఉన్నా కూడా చీకటిగా ఉన్నట్లు ఉంటుంది. అందుకే ఈ వ్యాధిని రేచీకటి అంటారు. స్టీఫెన్ హిక్స్ అనే ఆక్స్ ఫర్డ్ యూనివర్శిటీ పరిశోధకుడు ఒక కళ్ళజోడును కనిపెట్టాడు.

పూర్తిగా అంధత్వం ఉన్నవారికి కాక స్వల్పంగా కనిపించేవారికి ఈ కళ్ళజోడు ఉపయోగిస్తుంది. కళ్ళజోడు ఫ్రేముపై ఉండే వీడియో కేమెరా ఎదురుగా ఉన్న వస్తువుల చిత్రాలను తీసి చూపుతుంది. ఐతే దీన్ని బాగా ఆధునీకరించి మనం వాడే కళ్లజోడంత సైజుకు తీసుకువస్తే ఎంతోమందికి ఉపయోగిస్తుంది. ఇది చాలా ఖర్చుతో కూడినది, పైగా మన దేశానికి వాడుకకు రావడమూ కొంత కష్టమే! ఇవన్నీ మీకు బాగా తెలియాలని చూపుతున్నాను. ప్రపంచవ్యాప్తంగా ఈ రేచీకటి గురించిన పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. "అని వివరిస్తూ ఎదురుగా ఉన్న తెల్లని పెద్ద గోడమీద సినిమాలా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చూపుతూ అనంతరామయ్య, భానుమతి చెప్తుంటే గ్రామస్తులంతా ఆసక్తిగా చూశారు. భానుమతి అందుకుంది "గ్రామస్తులందరికీ నమస్కారాలు! ఏదో మేము చెప్తున్నామని కాక మీకోసం మీరు చాలా చేసుకున్నారు. ఇప్పుడు మన గ్రామంలో ఏ రోగాలూ రావు, ఐతే ఈ గ్రామంలో చాలామందికి ఉన్న రేచీకటిని మనం పూర్తిగా నివారించలేకపోయినా, పిల్లల్లో కనీసం రాకుండా తగు జాగ్రత్తలు తీసుకుందాం, మా గ్రూపు సభ్యులు రేపు వస్తున్నారు, రెండు బస్సుల్లో.

అన్నిపరీక్షలూ బస్సులోనే జరుగుతాయి. మాది 'మొబైల్ హాస్పిటల్, అంతా వచ్చి రక్త పరీక్షలు, మహిళలకు సంబంధించిన పరీక్షలు చేయించుకోండి, ప్రతినెలా వస్తాం, ఎవరికైనా ఏదైనా రుగ్మత ఉంటే నెల వరకూ సరి పడా మందులు ఇస్తాం! మళ్ళా నెలలో పరీక్షించి అవసరమైన వైద్యం అందిస్తాం! పెద్ద ఆపరేషన్స్ అవసరమైతే మా బస్సులో తీసుకెళ్ళి వైద్యం చేసి జాగ్రత్తగా తెచ్చి దింపుతాం! ఒక్క ఊరినైనా దత్తత తీసుకుని మావంతు సేవ దేశానికి చేయాలనే మా ఉద్దేశానికి మీరంతా సహకరించి మా కోర్కె తీర్చినందుకు సంతోషం. చేయి చేయి కలిస్తేనే శబ్దం అనేవారు, అది తగాదాలకు సంబంధించిన సూక్తి, మనం మన ఊరికోసం 'చేయీ చేయీ కలిపి కలిపితే శక్తి' అని ఇలా నవీకరించుకున్నాం, ఎవరో వస్తారని, ఏదో చేస్తారని కాక మనం మన ఊరిని బాగు చేసుకోడం మీకూ సంతోషంగా ఉంది కదూ! మా ఈ కార్యక్రమానికి అవసరమైన అనుమతి అంతా ప్రభుత్వం వారు కల్పించి, అంగీకరించినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కూడా మేము ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం." అంటూ ముగించింది. గ్రామస్తులంతా వారిద్దరిని తమ సంతోషం వెలిబుచ్చుకోను అన్నట్లుగా పూలమాలలతో ముంచెత్తారు.

గ్రామంలో పనులు చేయను అనేకమంది కొత్తవారు వచ్చిపోతుండటాన కొత్తవారిని చూసి ఎవ్వరూ భయపడటం లేదు పూర్వంలా. ఐతే ఒక రోజున జరిగిన సంఘటన ఊరివారందరిని భయభ్రాంతులను చేసింది. ఒక రోజు పొలం నుంచి ఒంటరిగా వస్తున్న ఒక యువతిని పట్టుకుని ఒక ఆగంతకుడు తోటలోకి లాక్కుపోయాడు. ఆమెపై అత్యాచార యత్నం చేయబోగా, ఆమె కేకలకు పొలం నుంచి వస్తున్న వారు పరుగెత్తుకొచ్చి వాడిని పట్టుకుని ఊరిలోకి లాక్కొచ్చారు. వాడిని పోలీసులకు అప్పగించారు. ఇది తెలిసి అనంతరామయ్య, భానుమతి, వివేక్, చంద్రికలతో కల్సి బాగా బాగా ఆలోచించి, అమెరికాలో ఉంటున్న తన తమ్ముని సహకారంతో అక్కడినుంచి 'గిజ్మోపాల్ [ఘిజ్మొపల్] అనే ఒక చిన్న చేతి వాచి ఉపయోగం గురించి తెల్సుకున్నారు. అమెరికాలో 4 సం. పైన వయస్సున్న స్కూళ్ళ కెళ్ళే పిల్లలకు ఆ వాచి పెడతారని, తలిదండ్రులు మాట్లాడితే వారికి తెలుస్తుందని, వారు కూడా తాము ఎక్కడున్నదీ చెప్పవచ్చని, చిన్న మొబైల్ ఫోన్ ని దాన్లో అమర్చారని తెల్సుకున్నాడు అనంతరామయ్య.

దాని ఉపయోగం పూర్తిగా తెల్సుకున్నాక అనంతరామయ్య బెంగుళూరులోని ఒక వ్యాపార సంస్థతో సంప్రదించాడు. G.P.S.కనెక్షన్ తో ఎక్కడున్నారో కంప్యూటర్ లోంచి తెల్సుకునే విధంగా అతి చిన్న 'చిప్' మొబైల్ ఫోన్ లాంటి దాన్ని చేతి వాచిలో పెట్టించి బెంగుళూర్లో తయారు చేయించి తెప్పించాడు. యువతులు, మహిళలు ఒంటరిగా ఎక్కడికీ వెళ్లకుండా, ఎప్పుడూ 3 లేక 5 మంది కలిసి వెళ్లేలాగా ఏర్పాటు చేసాడు. ఆ వాచిని గ్రూపులో ఒకరు చేతికి ధరించి వెళ్ళాలని వివరంగా చెప్పాడు. ఇంకా స్కూల్, కాలేజీలకు వెళ్ళే విద్యార్థులకు అతి చిన్న జి.పి.ఎస్. కనెక్షన్ తో ఉన్న పరికరం అమర్చిన స్కూల్ బ్యాగ్స్ తయారు చేయించి ఇచ్చాడు. ఆ పరికరం బయటికి కనిపించదు. బ్యాగ్ లోపల పొరలో ఉంటుంది. ఆ పరికరాల ద్వారా వారు ఎక్కడున్నదీ తెల్సుకోవచ్చు, ఆ వాచిల్లో ఉన్న ఫోన్స్ ద్వారా వారు ఆపద సంభవించినపుడు పోలీస్ స్టేషన్ కు కానీ, గ్రామంలోని పంచాయతీ ఆఫీసుకు ఉన్న కనెక్టెడ్ ఫోన్ కు కానీ సమాచారం అందించవచ్చు. ఒక చిన్న స్విచ్ నొక్కితే చాలు సమాచారం అందుతుంది. దాంతో ఆ గ్రామ మహిళలకు ఆపదలే సంభవించవు.

అప్పుడు పంచాయతీ ఆఫీసులోని కంప్యూటర్ ద్వారా వారెక్కడున్నదీ తెల్సుకుని సహకరించవచ్చు. కొందరు యువకులకు కంప్యూటర్ ట్రైనింగ్ ఇప్పించి పంచాయతీ ఆఫీసులో ఉద్యోగులుగా నియమించారు. ఇలా ఆ గ్రామాన్ని దత్తత తీసుకుని అధునాతన, ఆధునిక గ్రామంగా తీర్చిదిద్దారు అనంత రామయ్య గ్రూప్ ఆఫ్ డాక్టర్స్, మొబైల్ హాస్పెటల్ సిబ్బందీ కల్సి. యువతకు పని కల్పించను వారికి 'మహిళలకు, పురుషులకు, చిన్నపిల్లలకు' దుస్తులు కుట్టే ట్రైనింగ్ గ్రామంలోనే ఇప్పించి, అవసరమైనవన్నీ సమకూర్చి, దుస్తులు కుట్టడం, వాటిని చక్కగా ప్యాక్ చేయించి నగరాలకు మాల్స్ కు సప్లై చేయించి, ఆ సొమ్ము వారి వారి బ్యాంక్ అకౌంట్ లో జమ అయ్యేలా చర్యలు చేపట్టింది. సొసైటీ ఏర్పరచారు. సేవా సంస్థ గ్రూప్ వారి నిరంతర పర్యవేక్షణలో ఇప్పుడా గ్రామం ఒక చిన్న పట్టణంలా, తయారైంది... స్వయంశక్తికి ఋజువుగా నిలిచింది.

అప్పుడే తన కల నిజం చేయను సహకరించిన వివేక్ కూ, అతని కుటుంబానికీ కృతజ్ఞత తెల్పుకుంటూ తమ కుమార్తెతో వివాహాన్ని ఏర్పాటు చేశారు అనంతరామయ్య దంపతులు. ఆ వేడుకల సందర్భంగా ఊరివారంతా పాల్గొని తమ శాయశక్తులా సహకరించి ఆనందించారు. ఆ ఊరి యువత తాము తయారు చేసిన పెళ్ళి వస్త్రాలు వధూవరుల కిద్దరికీ కానుకగా ఇచ్చారు.

గ్రామంలో ఎక్కడా కులమత భేదాలు లేకుండా, పార్టీలకు అతీతంగా, అంతా అన్నదమ్ముల్లా కలసి మెలసి పనులు చేసుకోడం అనంతరామయ్య దంపతులకు పరమానందమైంది.

పని లేనప్పుడే ఇవన్నీ మనసుకొస్తాయి. తీరిక లేని పనులలతో ఎవ్వరికీ తన పర భేదాలే లేకుండా పోడం ప్రగతికి చిహ్నం అనిపించింది అందరికినీ! భారత కేంద్ర ప్రభుత్వం ఈ విషయాలన్నీ తెల్సుకుని ఒక అధికారిని పంపింది. టి.వి., పత్రికలవారంతా వచ్చి కళ్ళారా చూసి, కెమెరాల నిండా చిత్రాలు నింపుకుని వెళ్ళారు. 'ఇదండీ నిజమైన సేవ అంటే' అని తమ పత్రికల్లో, టీవీ ఛానల్స్ లో అహోరాత్రులు వార్తలు నింపారు. 'చేయీ చేయీ కలిపి' సాధించిన ఘనత' అనే టైటిల్ తో...




" మా నాన్నలా చూసుకుంటావా?" అంది వినీల.

"నేనడిగిందేమిటి? నువ్వడిగేదేమిటి?" అన్నాడుఆశ్చర్యంగా ఆదర్శ్.

ఆదర్శ్ ఎన్నో రోజుల నించి వినీలను ప్రేమిస్తున్నాడు. ఆమెను ఆమె ప్రవర్తనను రోజూ చూస్తున్న కొలదీ ఆమే తనకు సరి అయిన భాగస్వామి అని నిర్ణయించుకున్నాడు. స్నేహితులుగా మెలుగుతున్న వారి మధ్య ఇన్నాళ్ళు పెళ్ళి ప్రసక్తి రాలేదు. సడన్ గా ఈ రోజు ఎలాగైనా అడగాలని నిర్ణయించుకుని ధైర్యం చేసి అడిగాడు "నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అని.

"నువ్వడిగింది నాకర్థమయ్యింది అందుకే అలా అడిగాను. ఇలా నేను ఎందుకడిగానో తెలియాలంటే మా అమ్మా నాన్నా గురించి

నీకు తెలియాలి”

“చెపితే కదా తెలిసేది. మీ నాన్నగారిలో ఉన్న ఆ స్పెషాలిటీ ఏమిటో మాకూ తెలియాలి కదా!”

వినీల చెప్పడం మొదలు పెట్టింది

----

“ఒక విధంగా చెప్పాలంటే మా అమ్మా నాన్నలది కూడా ప్రేమ వివాహమే. మా నాన్న అమ్మలో ఏం చూసి పెళ్ళి చేసుకున్నారో నాకు తెలిసాక మా నాన్నంటే నాకు ఇంకా ఇష్టమైంది. అమ్మ అవకరం కల అమ్మాయి. సొట్ట కాలు పిల్లగా పిలవ బడుతూ చిన్నప్పటి నించీ న్యూనతా భావంతో పెరిగింది. తాతా, అమ్మమ్మా ఏమీ అనక పోయినా చుట్టు పక్కల వాళ్ళు ఏదో వంకన ఆమె అవకరాన్ని ఎత్తి చూపించే వారు.

“మీ అమ్మ గారు పోలియో ఎఫెక్టెడా?”

“కాదు అమ్మ పుట్టినప్పుడు పాదాలు వంకరతో పుట్టిందిట. ఆ వంకర సరి చెయ్యడానికి ఆపరేషన్ చేసారు. కట్టు లోకి యూరిన్ వెళ్ళి కాలు కుళ్ళి పోయింది. అది అమ్మమ్మ చూసుకో లేదు. ఉమ్మడి కుటుంబంలో పెద్ద కోడలిగా ఆమెకు బాధ్యతలు ఎక్కువగా ఉండేవిట. కాలు కుళ్ళి పోయి వాసన వేస్తుంటే అప్పుడు డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగి పోయింది. అలా అమ్మ కాలు సొట్ట కాలుగా మిగిలి పోయింది.”

“సైన్స్ ఇంత పురోగమించింది కదా! అయిన నష్టాన్ని సరి దిద్ది ఉండ వచ్చు కదా!” అన్నాడు ఆదర్శ్.

“సైన్స్ ఎంత పురోగమించినా కొన్ని సరి దిద్ద లేని తప్పులు కూడా ఉంటాయి. వైద్య సదుపాయాలు

అప్పట్లో అంతగా లేవో, లేక అమ్మమ్మ వాళ్ళ అందుబాటులో లేవో నాకు తెలియదు. ఆత్మ న్యూనత చోటు చేసుకున్న అమ్మ ఉమ్మెత్త పువ్వు లా తనలో తాను ముడుచుకు పోయేది. చదువులో మాత్రం ఎప్పుడూ ముందు ఉండేది”.

“ఆమెకు ఇంట్లో వాళ్ళ సపోర్ట్ ఉండేది కాదా!”

“ఉమ్మడి కుటుంబాల్లో ఒకరి కొకరు ఉన్నట్లుగా కనబడ్డా ఎవరిలోనూ స్వార్థం లేదనడానికి లేదు. ఎవరి మటుకు వాళ్ళు

ఉమ్మడిలో లాభాలు పొందుతున్నా లాభాల కన్నా నష్టాల్ని బేరీజు వేస్తారు. ఈ విషయాలన్నీ అమ్మ అనుభవంలోంచి నేను తెలుసుకున్న నిజాలు".

"మీ అమ్మా నాన్నా ఎక్కడ కలిసారు?" అడిగాడు ఆదర్శ్

"వాళ్ళిద్దరూ పక్క పక్క ఇళ్ళల్లో ఉండే వారు. ఒక విధంగా చెప్పాలంటే నాన్నకు అమ్మ చిన్న తనం నుండి తెలుసు. అమ్మ ఇంజనీరింగ్ చదివింది. నాన్న ఎం, ఎస్సీ చదివారు. చదువు పూర్తయ్యాక నాన్న ఉద్యోగ ప్రయత్నాలు చేసారు. ఊళ్ళో ఉన్న జూనియర్ కాలేజ్ లో లెక్చరర్ గా ఉద్యోగం వచ్చింది. అమ్మకు కూడా మంచి ఉద్యోగం వచ్చింది. కానీ హేండికాప్డ్ కోటాలో. అమ్మకు తన ప్రతిభ మీద ఉద్యోగం రావాలన్న కోరిక ఉన్నా వచ్చిన ఉద్యోగం వదులుకోవడం అవివేకం అని తాత నచ్చ చెప్పారు. తాత గారి మాట కాదన లేక అమ్మ ఉద్యోగంలో చేరింది. ఈడొచ్చిన ఆడపిల్లకు పెళ్ళి చెయ్యడం కన్న తండ్రి బాధ్యత కదా! అందుకని అమ్మ కోసం సంబంధాలు వెతకడం మొదలు పెట్టారుట తాత గారు. వచ్చిన ప్రతీ వాళ్ళూ అమ్మ అవకరం ఎత్తి చూపడం, కొంత మంది ఆ అవకరం డబ్బుతో ముడి పెట్టడం చూసిన అమ్మ పెళ్ళి చేసుకోనని చెప్పిందిట".

" అబ్బ తొందరగా చెప్పు మరీ సస్పెన్స్ మైంటైన్ చేస్తున్నావు" అన్నాడు ఆదర్శ్.

" అమ్మా నాన్నల ప్రేమ కథ నేను చెప్పడం ఎందుకు? వాళ్ళ నోటే విను"

"అంటే మీ ఇంటికి రమ్మంటావు".

"నన్ను పెళ్ళి చేసుకుంటానని చెప్పడానికి రావాలిగా" అని కవ్వించింది వినీల.

ఆదర్శ్ కి కూడా వినీల తండ్రిని కలుసుకోవాలని ఉంది. వినీల చెప్పినట్లు అతనిలో ఉన్న ఆ గొప్ప వ్యక్తిత్వం ఏమిటో తెలుసుకోవాలన్న ఉత్సుకత కూడా చోటు చేసుకుంది.

"సరే ఐతే రేపు వస్తాను" అన్నాడు.

రాజేష్ ,మొదటి నించి సున్నిత మనస్తత్వం కలిగిన మనిషి. ఎవరి కళ్ళల్లో ఉదాసీనత, కన్నీళ్ళు చూడ లేడు. పక్కింటి రాధిక పట్ల కూడా ఆకర్షణ పెరగడానికి అతని మనస్త్వత్వం కూడా కొంత కారణం.

ఆటల్లో పరిగెట్టలేక వెనక బడ్డ రాధికను స్నేహితులు "ఆ కుంటి కాలితో నీకెందుకే ఆటలు? మాతో సమానంగా ఆడదామని అనుకోకుండా ఆ అరుగు మీద కూర్చుని చూడవచ్చు కదా!" అన్నప్పుడు గుడ్ల నీరు కుక్కుకుంటూ అరుగు మీద కూర్చునే రాధికను ఓదార్చడానికి తను కూడా ఆటలు మానేసి ఆమె పక్కన కూర్చునే వాడు.

చిన్న తనంలో లాగా యవ్వనం లోకి అడుగు బెట్టాక ఆమె దు:ఖంలో పాలు పంచుకో లేక ఆమె చిన్న బోయిన మొహంతో బైట కనబడ్డప్పుడల్లా అతని మనసు విల విల లాడేది. అతనికి తెలియకుండానే ఆమె పట్ల ఆకర్షణ ఏర్పడి, ఉద్యోగం వచ్చాక ఆమెను పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించు కున్నాడు. ఆ మాటే తండ్రితో చెపితే అతను ఇంతెత్తున ఎగిరి పడ్డాడు.

"నీకేం ఖర్మరా ఆ సొట్ట పిల్లను చేసుకుందుకు. నువ్వు ఊ అంటే కోటి మంది పిల్లల్ని క్యూలో నిల బెడతాను" అన్నాడు.

"నాకు ఆ క్యూలో ఉన్న అమ్మాయిలు అక్కర్లేదు నాన్నా ! నేను రాధికని ఇష్ట పడుతున్నాను. మీరు కాదంటే పెళ్ళే చేసుకోను" అన్న కొడుకు మాటలకు కోపం వచ్చినా భార్య కళ్ళతో చేసిన సంజ్ఞతో ఆగి పోయాడు.

"నేను మాత్రం వెళ్ళి అడగను" అని చెప్పాడు.

"నేనే అడుగుతాను నాన్నా. మీకా శ్రమ అక్కర్లేదు" అన్నాడు రాజేష్.

రాజేష్ వచ్చి అడిగినప్పుడు రాధిక తండ్రి కూడా ఆశ్చర్య పోయాడు. ఈ అబ్బాయి ఏమి ఆశించి పెళ్ళి చేసుకుంటాననంటున్నాడు? రాధిక అతని కన్నా ఉన్నత ఉద్యోగంలో ఉంది అందుకని ఆశ పడుతున్నాడా! అన్న అనుమానం కలిగింది. ఐనా ఆగలేక తన సందేహాన్ని నివృత్తి చేసుకోవాలని,

"అందరూ చూసి ఎగతాళి చేసే పిల్లను కావాలని కోరుకుంటున్నావంటే దాని వెనకున్న కారణం తండ్రిగా తెలుసుకోవడం నా బాధ్యత కదా! కారణం చెప్తావా?"

"అందరూ రాధికలో ఉన్న మిగిలిన మంచి గుణాల కన్నా ఆమె కాలికి ఉన్న లోపానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారనిపించింది నాకు. నేను అది తప్ప రాధికలో మిగిలిన గుణాలకు ప్రాధాన్యత ఇవ్వ దల్చుకున్నాను. లోపం లేని మనిషి ఉండడం చాలా అరుదని నా అభిప్రాయం. ఐనా రాధికను అడగకుండా ఆమె సమ్మతి లేకుండా నిర్ణయం తీసుకో వద్దండి" అన్నాడు.

పిల్లాడేదో బుద్ధిమంతుడిలా ఉన్నాడు. రాధిక నిజంగానే అదృష్ట వంతు రాలేమో! అనుకున్నాడు రాధిక తండ్రి.

"ఇప్పుడు జాలితోనో ఆకర్షణతోనో చేసుకుని రేపు దాని లోపాన్ని ఎత్తి చూపకుండా ఉండ గలవా! అది ఆలోచించుకున్నావా? మీ అమ్మ గారూ నాన్న గారూ, నీ వాళ్ళందరు ఒప్పుకుంటారా?" అని అడిగాడు ఆమె తండ్రి.

"ఆమె మీద జాలితో నేను ఈ పెళ్ళి చేసుకుంటానని అనటం లేదండి నిజంగా రాధిక నాకు కావాలి. జివితంలో ఎప్పుడూ ఆమె మనసు నొప్పించను. నా వాళ్ళెవరూ ఆమెను నొప్పించ కుండా చూసుకుంటాను. ఇంత కన్నా నేను హామీ ఏమివ్వ గలను చెప్పండి " అన్నాడు రాజేష్

రాజేష్ తనను పెళ్ళి చేసుకుంటానన్నాడని, తనతో మాట్లాడాలని అన్నాడని తండ్రి చెప్పగానే ఆశ్చర్య పోయింది రాధిక. తనను చేసుకుంటానని ఎవరో రావడం కొత్తగా థ్రిల్లింగ్ గా ఉంది.

రాజేష్ మాట్లాడడానికి వచ్చినప్పుడు అదే అడిగింది—

" అందరికీ నా సొట్ట పెద్దదిగా కన బడుతుంటే మీకు కన బడ లేదా! అది అడ్డుగా అనిపించ లేదా? "

"నాకెందుకు కనబడలేదు సొట్టలు? కనబడ్డాయి. సొట్టలు, సొట్టల్లో అప్పుడప్పుడు పూచే గులాబిలూ" అన్నాడు నవ్వుతూ

ఒక్క క్షణం అర్ధం కాలేదు. సొట్టలు అంటున్నాడేమిటా! అని. మరుక్షణం అర్ధమయ్యి మొహం మీద చిరునవ్వు చిందులాడింది. "అదిగో సొట్టలు, గులాబిలూ" అన్నాడు.

రాధిక నవ్వినప్పుడల్లా బుగ్గల్లో అందమైన సొట్టలు పడతాయి.

"మీరు భలే మాట్లాడుతారు" అంది.

"ఐతే నేను మీకు నచ్చానా?" అన్నాడు.

"అందరికీ అడ్డుగా నిల బడ్డ నా కాలి సొట్ట మీకు అభ్యంతరంగా కన బడ లేదా?"

"మనిషన్న వాడికి మనసులో ఏ సొట్టలూ లేకుండా ఉండాలి. అది నీకుందని నాకు తెలుసు. చిన్న తనం నించీ నీ లోపం ని పెద్దగా చూపించడంతో నీలో ఉన్న మిగిలిన గుణాలన్నీ మరుగున పడ్డాయి. ఆ మరుగున పడ్డ గుణాలతో మనం మన జీవితంలో మరు మల్లెలు పండించుకుందాము. ఇంతకన్నా నీ పట్ల నాకున్న ప్రేమను ఎలా వ్యక్తం చెయ్యాలో నాకు తెలియదు. నీ లోపాన్ని గురించి ఇంకెప్పుడూ మన మధ్య చర్చ రావడానికి వీలు లేదు. అసలు ఆ విషయాన్ని పూర్తిగా మర్చిపో "అన్నాడు.

అతని మాటలకు పుట్టాక ఎప్పుడూ పొందనంత ఆనందం పొందింది రాధిక. ఆ ఆనందంలో తనకు తెలియకుండానే వచ్చి అతని భుజం మీద తన తల వాల్చింది. ఆప్యాయత నిండిన అతని చేతులు ఆమెను దగ్గరకు తీసుకున్నాయి.

మర్నాడు వాళ్ళింటికి వచ్చిన ఆదర్శ్ రాజేష్ నోట వాళ్ళ ప్రేమ కధ విన్న అతనికి నోట మాటలు కరువయ్యాయి. ఆలు మగల దాంపత్యానికి శరీర లోపం అడ్డు కాదని నిరూపించారు రాజేష్ అంకుల్ అనుకున్నాడు.

" ఇంతే కాదు మా నాన్న నన్ను, తమ్ముడ్ని అమ్మలా పెంచారు తెలుసా?"

మళ్ళీ కధలో ట్విస్ట్ ఏమిటిరా బాబూ అన్నట్లుగా చూసాడు ఆదర్శ్.

అతని ముఖ కవళికల్ని చూసి పక్కున నవ్వింది రాధిక.

"ఏంటి ఆంటీ మీరు నవ్వుతున్నారు? అంకుల్ అమ్మలా పెంచడమేమిటి? అసలే మీ ప్రేమ కధ విన్న నేను అదే జీర్ణించుకో లేక పోతున్నాను. దానిపై మళ్ళీ ఇదొకటి. ఈ పొడుపు కధ మీరు విప్పేయ్యండి బాబూ!" అనగానే అందరూ గొల్లుమని నవ్వారు. ముందుగా రాధిక తేరుకుని చెప్పడం మొదలు పెట్టింది.

పెద్దల ఆమోదంతో వాళ్ళ పెళ్ళి బాగా జరిగింది. రాధిక, రాజేష్ కన్నా ఎక్కువ సంపాదిస్తున్నా వాళ్ళ మధ్య ప్రేమలో ఏమీ తేడా లేకుండా ఆనందంగా సంసారం సాగుతున్న తరుణంలో రాజేష్ ఉద్యోగం పోయింది. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగం దొరక లేదు. అదే సమయంలో రాధిక గర్భవతి అవడంతో తన ఉద్యోగం కన్నా ఆమెను జాగ్రత్తగా చూసుకోవడం అవసరమని నిర్ణయించుకున్నాడు.

వినీల పుట్టుక వాళ్ళ జీవితాల్లొ కొత్త వసంతాన్ని తెచ్చింది. రాధిక ఆఫీస్ లో జాయిన్ అయ్యాక వినీలను అతనే పెంచాడు. అతని సబ్జెక్ట్ మాథ్స్ కావడంతో ఇంటి దగ్గర ట్యూషన్స్ చెప్పే వాడు. ఎంత రాధిక కూ తనకూ మధ్య డబ్బు ప్రసక్తి లేక పోయినా తన ఖర్చులకు ఆమెను అడగడం అతనికిష్టం ఉండేది కాదు.

అలా వినీల రాజేష్ గారాల కూతురయి పోయింది. ఆమెను నిద్ర పుచ్చడానికి లాలి పాటలు కూడా నేర్చుకున్నాడు. పక్క వాళ్ళు విచిత్రంగా ఉందని చెవులు కొరుక్కున్నా అవేమీ అతనికి పట్ట లేదు. పోనీ మేము వచ్చి పెంచుతాము అన్న అమ్మను అత్త గార్నీ కూడా వారించాడు.

“వినీలను పెంచడంలో మీకేం కష్టం అనిపించ లేదా అంకుల్ !” అన్నాడు ఆదర్శ్.

“పుట్టుకతోనే ఎవరికీ ఏ విద్యా రాదు. చూసి కానీ ఎవరైనా నేర్పితే కానీ నేర్చుకుంటాము. ఆడపిల్లకైనా మొదటి బిడ్డను పెంచడానికి కష్టాల్ని ఎదుర్కోక తప్పదు. మొదటి సారి తల్లి అయిన ఆనందం ఆమెను అన్నీ నేర్చుకునేటట్లు చేస్తుంది. ఇక్కడ ఆ పని నేను చేసాను. ఇష్టమైన పని ఎప్పుడూ కష్టమనిపించదు” అన్నాడు రాజేష్.

“నేను కూడా అంత బాగా పెంచి ఉండే దాన్ని కాదేమో! రాజేష్ అంత బాగా చూసుకున్నాడు వినీలను. వినీలకు రెండేళ్ళు వచ్చాక రాజేష్ కు మంచి కాలేజ్ లో మళ్ళీ జాబ్ దొరికింది. ఇంకో రెండేళ్ళకు వినీలకు తమ్ముడు పుట్టాడు. అదృష్టవశాత్తు వాడు సమ్మర్ లో పుట్టాడు. అందుకని వాడికి కూడా నాన్న పెంపకం దొరికింది. సమ్మర్ లో కాలేజీలకు సెలవులు కదా! అదీ కథ” అంది రాధిక.

“అహా చాలా బాగుంది మీ ప్రేమ కథ. ఇప్పుడు అర్ధమయ్యింది వినీలను నన్ను పెళ్ళి చేసుకుంటావా? అంటే నాన్నలా ప్రేమిస్తావా? అని ఎందుకందో. మీరు చాలా గ్రేట్ అంకుల్ ”

“అహా నేనొక్కడ్నే గ్రేట్ కాదిక్కడ అందరూ గ్రేటే. మన మనసులో భావాలు ఉన్నా ఎదటి వాడు దాన్ని అర్థం చేసుకోనప్పుడు దానికి విలువ లేకుండా బూడిదలో పోసిన పన్నీరవుతుంది.అలాగే చాలా మందికి ప్రేమను వ్యక్తం చెయ్యడం తెలియదు. అలాగే పంచిన ప్రేమను అందుకోవడం కూడా తెలియదు” అన్నాడు రాజేష్.

“ ప్రేమకు నిర్వచనం చాలా బాగా చెప్పారంకుల్. మీ ప్రేమ సామ్రాజ్యంలో నన్ను కూడా ఒక సభ్యుడిగా చేర్చుకోండి” అంటూ వినీల వైపు ఒక కొంటె చూపు విసిరాడు.

వాళ్ళిద్దరి చూపుల్ని అర్థం చేసుకుని రాజేష్, రాధిక మెల్లిగా అక్కడి నించి జారుకున్నారు.